ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

WWW.PRAJAVOICE.IN

సంపుటి: 02 | సంచిక: 48 | ఎడిటర్: మేనం శ్యామ్ | ఆదివారం 06-09-2026 | పేజీలు: 10

సిరా చుక్క

కొండా సురేఖను బర్తరఫ్ చేసిన తర్వాత
ఒక్క బీసీ సంఘం నాయకుడైన
ఒక బీసీ లీడర్ అయిన కనీసం రేవంత్ రెడ్డి
దిష్టిబొమ్మ దహనం చేస్తారేమో అని
అనుకున్నాం బి సి నాయకులు సోషల్
మీడియాలో ఖండించుడు తప్ప..
రోడ్ల మీదికి వచ్చి కొండా సురేఖకు మద్దతుగా
ఏ బీసీ నాయకుడు ఎందుకు
నిలబడలేకపోతున్నాడు.....
లీడర్లంతా లోపాయికారి ఒప్పందాలు పెట్టుకొని
నేను బాగుంటే చాలు అనే కోణంలో వెళ్తున్నట్టే
కనిపిస్తుంది..... ఎవడికి వాడే యమునా తీరి
అన్న కోణంలో వెళ్తుంది బీసీ సమాజం....
చిన్నచిన్న సమస్యలు ఉంటే చిన్నచిన్న
భేదాభిప్రాయాలు ఉంటే పక్కన పెట్టి కనీసం
సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో అయినా ఒక బీసీ
బిడ్డ ఒక మహిళకి కనీసం లో కనీసం ఒక
రౌండ్ టేబుల్ సమావేశం అయినా ఎందుకు
ఏర్పాటు చేయలేకపోతున్నారు..
బీసీ కుల సంఘాలు ఏడపన్నాయి
బీసీ లీడర్లు ఎక్కడున్నారు
ఎవడి కోసం ఈ బీసీ కుల సంఘాలు
పనిచేస్తున్నాయి ఎవడి కోసం ఈ బీసీ లీడర్లు
పనిచేస్తున్నారు మీ కళ్ళ ముందు అన్యాయం
జరిగిన మీ లోపాయి కారు ఒప్పందమే మీకు
ముఖ్యం మీ డబ్బు సంపాదనే మీకు ధ్యేయం
దానికి పెట్టుబడే బీసీ అనే ఒక ట్యాగ్ లైన్ సిగ్గు
తప్పిన నీతిమాలిన బిసి రాజకీయ నేతలకి,
బీసీ కుల సంఘాలకు ఇంకెప్పుడూ
సిగ్గు వస్తుంది అని నిలదీస్తుంది
నా తెలంగాణ బీసీ ప్రజలు ..

మేనం శ్యామ్ . ....
ప్రజా వాయిస్.సీఈవో

117 సీట్లలో గెలుస్తాం..
సీట్లు పెరగకపోతే
97 సీట్లతోనైనా గెలుస్తాం

- సీఎం రేవంత్
- తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారం అంటూ ధీమా
- 2024 నుంచి 2034 వరకు కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని వ్యాఖ్య
- బీఆర్ఎస్ అనే మొక్కను ఏ ఎన్నికల్లోనూ మొలవనివ్వనని సవాల్
- సిరిసిల్లకు వచ్చి మూడు రంగుల జెండా ఎగురవేస్తానన్న రేవంత్
- బీఆర్ఎస్, బీజేపీలపై తీవ్రస్థాయిలో విమర్శలు

నకిరేకల్, ప్రజావాయిస్ బ్యూరో : తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. అసెంబ్లీ సీట్లు పెరిగితే 117 సీట్లలో గెలుస్తామని.. సీట్లు పెరగకపోతే 97 సీట్లతో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని అన్నారు. 2024 నుంచి 2034 వరకు పదేళ్ల పాటు కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని స్పష్టం చేశారు. ఇదే బీఆర్ఎస్, బీజేపీలకు తన సవాల్ అని పేర్కొన్నారు.

'బీఆర్ఎస్ మొక్కను మొలవనివ్వను'

బీఆర్ఎస్ అనే మొక్కను ఏ ఎన్నికల్లోనూ తాను మొలవనివ్వనని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. ఈ నెలాఖరుకు సిరిసిల్లకు వస్తానని, అక్కడ మూడు రంగుల జెండా ఎగురవేస్తానని అన్నారు. వచ్చేనెల సిద్దిపేటపై దండయాత్ర చేస్తానని.. కాస్కోవాలని బీఆర్ఎస్ నేతలకు సవాల్ విసిరారు.కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో గొప్ప పథకాలు అమలు చేస్తుంటే కొందరు జీర్ణించుకోలేక ఊరూరా తిరుగుతున్నారని విమర్శించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన, కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనను ప్రజలు బేరీజు వేసుకోవాలని కోరారు.

రైతుల కోసం ఎన్నో చేశాం..

గత ప్రభుత్వం ఎగ్గొట్టిన రైతు భరోసా నిధులను తమ ప్రభుత్వం 32 నెలల్లో రూ.36 వేల కోట్లు రైతులకు చెల్లించిందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లు, రైతు భరోసా, రుణమాఫీ వంటి కార్యక్రమాలను 30 నెలల్లో అమలు చేశామని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నంత కాలం ఇందిరమ్మ రాజ్యంలో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కొనసాగుతుందని చెప్పారు. కోటి మంది మహిళలకు నెలకు రూ.10 వేల చొప్పున ఖర్చులు మిగిలేలా చేశామని పేర్కొన్నారు. మహిళలను కోటీశ్వరులను చేయడం కోసం అన్ని పథకాల్లో వారిని భాగస్వామ్యం చేశామని అన్నారు.

'72 వేల ఉద్యోగాలు ఇచ్చాం'

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించారా? అని సీఎం ప్రశ్నించారు. ఫామ్‌హౌస్‌కు పరిమితమైన కేసీఆర్ చేస్తున్న విమర్శలు తమ ప్రభుత్వంపై ప్రభావం చూపవని అన్నారు. గతంలో నోటిఫికేషన్లు ఇచ్చినా ఉద్యోగ నియామకాలు ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 72 వేల ఉద్యోగాలు ఇచ్చిందని రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. దేశంలో ఏ ప్రభుత్వం ఇవ్వని విధంగా నియామకాలు చేపట్టామని తెలిపారు.

మిగతా 2లో

అమెరికా-ఇరాన్ మధ్య ముదిరిన ఉద్రిక్తతలు..
మూడు ఆయిల్ ట్యాంకర్లపై అమెరికా దాడి

- అమెరికా యుద్ధనౌకలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ బాలిస్టిక్ క్షిపణుల ప్రయోగం
- దాడి నుంచి సురక్షితంగా బయటపడిన అమెరికా నౌకలు
- ఇరాన్‌కు చెందిన మూడు క్రూడ్ ఆయిల్ ట్యాంకర్లపై అమెరికా ప్రతిదాడి
- ట్యాంకర్లు 'షాడో నెట్‌వర్క్'లో భాగమని అమెరికా ఆరోపణ
- ఇరాన్‌లో కీలకమైన ఖర్గ్ ఐలాండ్ సమీపంలో దాడి

అంతర్జాతీయ డెస్క్, ప్రజావాయిస్ : అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత ముదిరాయి. అమెరికాకు చెందిన యుద్ధనౌకలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులతో దాడికి ప్రయత్నించిందని అమెరికా సెంట్రల్ కమాండ్ (USCENTCOM) వెల్లడించింది. అయితే అమెరికా నౌకలు ఈ దాడి నుంచి సురక్షితంగా బయటపడ్డాయని, ఈ ఘటనలో అమెరికా సైనికులు ఎవరూ గాయపడలేదని తెలిపింది. ఇరాన్ చర్యకు ప్రతిస్పందనగా అమెరికా బలగాలు ఇరాన్‌కు చెందిన క్రూడ్ ఆయిల్ ట్యాంకర్లపై దాడులు చేసినట్లు ప్రకటించింది.

అమెరికా నౌకలే లక్ష్యంగా క్షిపణులు..

అమెరికాకు చెందిన ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్, గైడెడ్ మిస్సైల్ డిస్ట్రాయర్లను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ క్షిపణులను ప్రయోగించినట్లు అమెరికా అధికారులు తెలిపారు. అయితే ఈ దాడుల్లో అమెరికా నౌకలకు

మిగతా 2లో

ఎమ్మెల్సీ టికెట్ల కోసం కాంగ్రెస్‌లో లాబీయింగ్..
ఆశావహుల జోరు

- తెలంగాణలో ఎమ్మెల్సీ ఎన్నికలకు ముందే కాంగ్రెస్‌లో రాజకీయ సందడి* రెండు పట్టభద్రుల స్థానాలకు పలువురు నేతల పోటీ
- గవర్నర్ కోటా నాలుగు స్థానాల కోసం కూడా తీవ్ర ప్రయత్నాలు
- అయోధ్యరెడ్డి, సత్తు మల్లేశ్‌తో పాటు బస్వరాజు సారయ్య పేరు తెరపైకి
- టికెట్ల కోసం నాయకత్వంతో ఆశావహుల ముమ్మర సంప్రదింపులు

2 లో

యువతకు స్కిల్ లేదంటున్న రేవంత్..
ఓటుకు నోటు దొంగ అంటూ కేటీఆర్ ఫైర్

- సీఎం రేవంత్‌రెడ్డిపై మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డ కేటీఆర్
- కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై యువభేరి సభలో ఘాటు విమర్శలు
- తెలంగాణ యువతకు ఉద్యోగాలు, నోటిఫికేషన్లు లేవని ఆరోపణ
- 420 మోసాలకు 420 సార్లు రేవంత్ రాజీనామా చేయాలని డిమాండ్
- ఉద్యోగాల కల్పనపై కాంగ్రెస్‌తో చర్చకు సిద్ధమన్న కేటీఆర్

హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. యువతకు స్కిల్ లేదంటున్న సీఎం రేవంత్‌రెడ్డి.. ఓటుకు నోటు దొంగ అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ నిర్వహించిన 'యువభేరి' సభలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు.

'లక్కీ లాటరీతో సీఎం అయ్యారు'

లక్కీ లాటరీ తగిలినట్లు రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని కేటీఆర్ విమర్శించారు. ప్రధానమంత్రి మోదీని గడగడలాడించిన తెలంగాణ యువతకు రేవంత్‌రెడ్డి ఓ లెక్క కాదన్నారు. తెలంగాణ యూత్ డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సమయంలో పెద్ద పెద్ద హామీలు ఇచ్చారని.. అధికారంలోకి

మిగతా 2లో

వెయ్యి రోజుల పాలనలో
వెయ్యి అబద్ధాలు

- రేవంత్‌పై హరీశ్ రావు ఫైర్
- తెలంగాణలో రాబందు, రాక్షస పాలన సాగుతోందంటూ హరీశ్ రావు ధ్వజం
- రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం పీక్కుతింటోందని తీవ్ర విమర్శలు
- రైతుబంధు, రైతుబీమా, ఉచిత విద్యుత్‌పై ప్రభుత్వాన్ని టార్గెట్ చేసిన మాజీ మంత్రి
- కాళేశ్వరం ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశారంటూ సీఎం రేవంత్‌పై ఆరోపణలు
- రైతు బంధు మళ్లీ రావాలంటే కేసీఆర్ అధికారంలోకి రావాలన్న హరీశ్ రావు

2 లో

కొండా సురేఖకు బీజేపీ డోర్స్ క్లోజ్

- చెత్తబుట్ట కాదు అంటూ సీనియర్ నేత హాట్ కామెంట్స్
- మంత్రి పదవి నుంచి కొండా సురేఖ బర్తరఫ్‌తో రాజకీయ వర్గాల్లో కొత్త చర్చ
- కాంగ్రెస్‌ను వీడి కొండా దంపతులు మరో పార్టీలో చేరతారంటూ ప్రచారం
- కొండా కుటుంబం బీజేపీలో చేరే అవకాశం ఉందంటూ ఊహాగానాలు
- బీజేపీ 'చెత్తబుట్ట' కాదంటూ మురళీధర్ రావు ఘాటు వ్యాఖ్యలు
- పార్టీ మార్పుపై ఇప్పటివరకు కొండా దంపతుల నుంచి అధికారిక ప్రకటన లేదు

మురళి రాజకీయ భవిష్యత్తు ఏంటి? కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతారా? లేక మరో పార్టీలోకి వెళ్తారా? అనే అంశంపై రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. ముఖ్యంగా కొండా కుటుంబం బీజేపీలో చేరే అవకాశం ఉందనే ప్రచారం తెరపైకి వచ్చింది.

కాంగ్రెస్ ను వీడతారా?

కొండా సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేసిన నేపథ్యంలో ఆమె కాంగ్రెస్ పార్టీని వీడే అవకాశం ఉందంటూ ఊహాగానాలు వినిపిస్తున్నాయి. గతంలోనూ కొండా దంపతులు పార్టీలు మారిన నేపథ్యంలో.. ఇప్పుడు మరోసారి రాజకీయ పునర్వ్యవస్థీకరణ జరిగే అవకాశం ఉందని కొందరు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అయితే, పార్టీ మార్పుపై

మిగతా 2లో

హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో : మంత్రి పదవి నుంచి కొండా సురేఖను తొలగించడంతో తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చ మొదలైంది. ఇక కొండా సురేఖ, కొండా

మల్కాజిగిరిలో భారీ బంగారం చోరీ

- 11 ఏళ్లుగా నమ్మకంగా పనిచేసిన కుటుంబంపైనే ఆరోపణలు
- ఆనంద్‌బాగ్‌లోని ఎస్‌బీఐ అపార్ట్‌మెంట్‌లో భారీ చోరీ ఘటన
- సుమారు 48 తులాల బంగారం మాయమైనట్లు ఫిర్యాదు
- అపార్ట్‌మెంట్ ఖాళీ చేసి వెళ్లిపోయిన నేపాలీ కుటుంబంపై అనుమానాలు
- ఫ్లాట్ నంబర్లు 301, 302లో బంగారం చోరీ జరిగినట్లు గుర్తింపు
- నిందితుల ఆచూకీ కోసం దర్యాప్తు ముమ్మరం చేసిన మల్కాజిగిరి పోలీసులు

2 లో

సుమంత్ కేసులో పోలీసుల దూకుడు.. ముగ్గురి కస్టడీ..

- పరారీలో మాజీ ఓఎస్డీ కోసం గాలింపు
- మాజీ ఓఎస్డీ సుమంత్ కోసం ప్రత్యేక పోలీసు బృందాల గాలింపు
- సుమంత్‌తో పాటు మరో ముగ్గురిపై హత్యాయత్నం కేసు
- అరుణ్‌కుమారెడ్డి, కార్తీక్‌కుమార్, మహేందర్‌రెడ్డికి నాలుగు రోజుల పోలీస్ కస్టడీ
- మొదటి రోజు నిందితులను లోతుగా విచారించిన పోలీసులు
- ఘటన వెనుక అసలు కారణం, ఇతరుల ప్రమేయంపై ఆరా

2లో

117 సీట్లలో గెలుస్తాం.. సీట్లు పెరగకపోతే 97 సీట్లతోనైనా గెలుస్తాం

మొదటి పేజీ తరువాయి

'తండ్రి, కొడుకులు అసెంబ్లీకి రావాలి'

తాను ముఖ్యమంత్రి అయిన తర్వాత పలువురికి మంత్రి, ఎంపీ, ఎమ్మెల్సీ పదవులు కల్పించానని రేవంత్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ తన విగ్రహం కోసం ఐదెకరాల స్థలానికి కాంపౌండ్ పెట్టుకున్నారని విమర్శించారు. తనకు చదువు లేదని విమర్శిస్తున్నారని.. అయితే తనకు సంస్కారం ఉందని అన్నారు.కేసీఆర్, కేటీఆర్‌లపై వ్యక్తిగత విమర్శలు చేసిన సీఎం.. అసెంబ్లీలో ఏ అంశంపైనైనా చర్చించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. తండ్రి, కొడుకులు అసెంబ్లీకి వచ్చి అన్ని విషయాలపై చర్చించాలని సవాల్ చేశారు. కేసీఆర్ అసెంబ్లీకి రాకుండా రూ.22.1 కోట్ల జీతం తీసుకుంటూ ఫామ్‌హౌస్‌లో ఉన్నారని ఆరోపించారు.

నకిరేకల్‌లో రూ.345 కోట్ల అభివృద్ధి పనులు..

నల్లగొండ జిల్లా నకిరేకల్ నియోజకవర్గంలో సీఎం రేవంత్‌రెడ్డి శనివారం పర్యటించారు. రూ.345 కోట్లతో చేపట్టనున్న 12 అభివృద్ధి పనులకు శిలాఫలకాలను ఆవిష్కరించారు. నకిరేకల్‌లో 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రిని ప్రారంభించి.. ఆస్పత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీలు రఘువీర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ టికెట్ల కోసం కాంగ్రెస్‌లో లాబీయింగ్.. ఆశావహుల జోరు

హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో : తెలంగాణలో ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్‌కు ఇంకా కొన్ని నెలల సమయం ఉన్నప్పటికీ అధికార కాంగ్రెస్ పార్టీలో లాబీయింగ్ రాజకీయాలు వేడెక్కాయి. త్వరలో రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలతో పాటు నాలుగు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ కానున్న నేపథ్యంలో.. ఆశావహులు ఇప్పటి నుంచే తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, తమకు అనుకూలంగా ఉన్న నాయకత్వంతో సంప్రదింపులు జరుపుతున్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

రెండు పట్టభద్రుల స్థానాలపై పోటీ..

ప్రస్తుతం ఎమ్మెల్సీలుగా ఉన్న సురభి వాణీదేవి, చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో రెండు పట్టభద్రుల నియోజకవర్గాల్లో కొత్త అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్ నాయకత్వం దృష్టి సారించింది.మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టికెట్ కోసం సామ రామ్మోహన్‌రెడ్డి, గాలి హర్షవర్ధన్, బి.వేణుగోపాల్, గౌరీశంకర్ పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. దీంతో ఈ స్థానంలో టికెట్ కోసం పోటీ ఆసక్తికరంగా మారింది.

ఖమ్మం–వరంగల్–నల్లగొండలోనూ రేసు..

ఖమ్మం–వరంగల్–నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గంలోనూ ఆశావహుల సంఖ్య పెరుగుతోంది. గుత్తా అమిత్‌రెడ్డి, పున్న కైలాశ్‌నేత, చనగాని దయాకర్, లోక్ యాదవ్ తదితరులు టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థుల వ్యక్తిగత బలంతో పాటు పార్టీ సంస్థాగత మద్దతు, విద్యావంతులు, ఉద్యోగ వర్గాల్లో ఉన్న పరిచయాలు కీలకంగా మారే అవకాశం ఉంది. దీంతో టికెట్ దక్కించుకునేందుకు నేతలు ఇప్పటి నుంచే తమ ప్రయత్నాలను వేగవంతం చేస్తున్నారు.

గవర్నర్ కోటాపైనా కన్ను..

ఇక నవంబర్, డిసెంబర్ నెలల్లో నాలుగు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ కానున్న నేపథ్యంలో నామినేటెడ్ పదవులపై కూడా కాంగ్రెస్‌లో ఆసక్తి నెలకొంది. పార్టీకి దీర్ఘకాలంగా సేవలందించిన నాయకులతో పాటు వివిధ రంగాలకు చెందిన ప్రతినిధులు ఈ స్థానాలపై ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది.ఈ కోటాలో అయోధ్యరెడ్డి, సత్తు మల్లేశ్ పేర్లు ప్రధానంగా పరిశీలనలో ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇదే సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సన్నిహితుడిగా రాజకీయ వర్గాల్లో గుర్తింపు ఉన్న బస్వరాజు సారయ్య పేరు కూడా తెరపైకి రావడం చర్చకు దారితీసింది.

ఎవరికి అవకాశం?

గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాలకు రాజకీయ అనుభవంతో పాటు సామాజిక సేవ, సాహిత్యం, కళలు, విజ్ఞానం తదితర రంగాల్లో విశిష్ట సేవలను కూడా పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంటుంది. దీంతో అభ్యర్థుల ఎంపికపై పార్టీ రాష్ట్ర నాయకత్వం, అధిష్ఠానం విస్తృతంగా కసరత్తు చేయాల్సి ఉంటుంది.ఎన్నికల నోటిఫికేషన్ వెలువడేలోపు ఆశావహుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. చివరికి రెండు పట్టభద్రుల స్థానాలతో పాటు గవర్నర్ కోటా నాలుగు స్థానాలకు కాంగ్రెస్ అధిష్ఠానం ఎవరిని ఎంపిక చేస్తుందన్నది ఇప్పుడు పార్టీ శ్రేణుల్లో ఆసక్తికర అంశంగా మారింది.

వెయ్యి రోజుల పాలనలో వెయ్యి అబద్ధాలు

దుబ్బాక, ప్రజావాయిస్ బ్యూరో : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో వెయ్యి రోజులుగా రాబందు, రాక్షస పాలన కొనసాగుతోందని ఆరోపించారు. రైతులను రాబందుల్లా పీక్కుతింటున్నారని సీఎం రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనకు నిరసనగా బీఆర్ఎస్ చేపట్టిన ఆందోళనల్లో భాగంగా శనివారం దుబ్బాక నియోజకవర్గంలోని హబ్సీపూర్ క్రాసింగ్ వద్ద నిర్వహించిన 'రైతు పొలికేక' కార్యక్రమంలో హరీశ్ రావు, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డితో పాటు భారీ సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

'మళ్లీ రోడ్లపైకి వచ్చే పరిస్థితి'

తెలంగాణ కోసం గతంలో ఇదే తరహాలో ఉద్యమించామని హరీశ్ రావు గుర్తు చేశారు. అయితే సీఎం రేవంత్ రెడ్డి పాలన కారణంగా నేడు మళ్లీ రైతుల కోసం రోడ్లపైకి రావాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో 24 గంటల విద్యుత్ అందించామని.. ప్రస్తుతం ఐదారు గంటలకు కూడా విద్యుత్ పరిమితమైందని ఆరోపించారు.కేసీఆర్ హయాంలో కరెంట్ కోసం రైతులు ఎదురుచూసే పరిస్థితి ఉండేదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ హామీ ఇచ్చిన 'పాత రోజులు' మళ్లీ వచ్చాయని విమర్శించారు. ఉచిత కరెంట్ కాస్తా 'ఉత్త కరెంట్'గా మారిందంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

'రూ.29 వేల కోట్ల రైతుబంధు ఎగ్గొట్టారు'

కరోనా సమయంలోనూ రైతుబంధు ఆగలేదని హరీశ్ రావు అన్నారు. రైతులపై కేసీఆర్‌కు ప్రేమ ఉండేదని.. సీఎం రేవంత్ రెడ్డికి మాత్రం రైతులపై ఎందుకు ఇంత నిర్లక్ష్యమని ప్రశ్నించారు. ఉన్న రైతుబంధుకే ఎసరు పెట్టారని ఆరోపించారు.రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ మూడేళ్లలో రూ.29 వేల కోట్ల రైతుబంధు నిధులను ఎగ్గొట్టిందని హరీశ్ రావు ఆరోపించారు. రైతుబీమాను కూడా నిలిపివేశారని విమర్శించారు. యాప్‌లో బుక్ చేసుకున్నా 15 రోజుల వరకు డీఏపీ అందడం లేదని అన్నారు. షాపుల్లో లేని యూరియా యాప్‌లోకి ఎలా వస్తుందని ప్రశ్నించారు.

కాంగ్రెస్, బీజేపీపై హరీశ్ ఫైర్..

యూరియా ధరలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెంచిందని హరీశ్ రావు ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు రైతుల ఉసురు పోసుకుంటున్నాయని మండిపడ్డారు. కేంద్రం ఏ పంటను ఎంత కొనుగోలు చేయమంటే అంతే కొనుగోలు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెబుతున్నారని విమర్శించారు.ఉమ్మడి మెదక్ జిల్లాలో ఈ మూడేళ్లలో ఒక్క ఎకరా భూసేకరణ చేయలేదని, జానెడు కాలువ కూడా తవ్వలేదని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును సీఎం రేవంత్ రెడ్డి నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. మేడిగడ్డ వద్ద చిన్న మరమ్మతులు చేయాల్సిన చోట 'కూలింది.. కూలింది' అంటూ ప్రాజెక్టును నిరుపయోగంగా మార్చారని విమర్శించారు.

ఇది రేవంత్ తెచ్చిన కరవు..

మేడిగడ్డ వద్ద ప్రస్తుతం 44 వేల క్యూసెక్కుల నీరు పారుతోందని హరీశ్ రావు పేర్కొన్నారు. మోటార్లు ఆన్ చేస్తే మల్లన్నసాగర్‌కు నీరు తరలించే అవకాశం ఉందని అన్నారు. ఇది కాలం తెచ్చిన కరవు కాదని.. రేవంత్ రెడ్డి తెచ్చిన కరవు అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో వెయ్యి అబద్ధాలు, వెయ్యి ఓట్లు, భూ కబ్జాలు తప్ప మరేమీ కనిపించడం లేదని హరీశ్ రావు ఆరోపించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం కావాలంటే సీఎం రేవంత్ రెడ్డిని పదవి నుంచి దించాలని పిలుపునిచ్చారు. రైతుబంధు గతంలో మాదిరిగా అందాలంటే కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రావాలని హరీశ్ రావు స్పష్టం చేశారు.

యువతకు స్కిల్ లేదంటున్న రేవంత్.. ఓటుకు నోటు దొంగ అంటూ కేటీఆర్ ఫైర్

మొదటి పేజీ తరువాయి

వచ్చిన తర్వాత వాటి పరిస్థితి ఏంటని ప్రశ్నించారు.రాష్ట్రంలో ఉద్యోగాలు లేవని, నోటిఫికేషన్లు లేవని కేటీఆర్ ఆరోపించారు. 'జాబులు లేవు.. నోటిఫికేషన్లు లేవు.. లూటిఫికేషన్లు మాత్రం బ్రహ్మాండంగా నడుస్తున్నాయి' అంటూ ప్రభుత్వంపై మండిపడ్డారు. వంద రోజుల్లో హామీలు నెరవేరుస్తామని చెప్పి.. ఇప్పుడు వెయ్యి రోజులు పూర్తయ్యాయని విమర్శించారు.

'రాజీనామా ఎవరు చేయాలి?'

కేసీఆర్ ఎందుకు రాజీనామా చేయాలని కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణను సాధించిన కేసీఆర్ రాజీనామా చేయాలా? లేక ప్రజలను మోసం చేసిన రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలా? అని నిలదీశారు. 420 మోసాలకు 420 సార్లు రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.కేసీఆర్‌తో పెట్టుకోవద్దని హెచ్చరించిన కేటీఆర్.. ఒక్క మంత్రిని బర్తరఫ్ చేయడం కాదని, ప్రభుత్వాన్నే బర్తరఫ్ చేసే రోజులు ముందున్నాయని అన్నారు. కమీషన్ల కోసం మంత్రులు కొట్టుకుంటున్నారని ఆరోపించారు. ఉద్యోగాలు ఇస్తామని కాంగ్రెస్ నాయకులు అడ్డగోలు హామీలు ఇచ్చారని విమర్శించారు.

'వెయ్యి రోజుల్లో ఇచ్చింది 16 వేల ఉద్యోగాలే'

ఉద్యోగాల విషయంలో కాంగ్రెస్ నాయకులు ఒక్కొక్కరు ఒక్కో మాట చెబుతున్నారని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వెయ్యి రోజుల్లో ఇచ్చిన ఉద్యోగాలు కేవలం 16 వేలేనని పేర్కొన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్లలో 2.32 లక్షల ఉద్యోగాలు ఇచ్చామని కేటీఆర్ తెలిపారు. ఉద్యోగాల కల్పనపై కాంగ్రెస్ ప్రభుత్వం తమతో చర్చకు సిద్ధంగా ఉందా? అని సవాల్ విసిరారు. యువతకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

'రేవంత్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసే రోజులు ముందున్నాయి'

కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో, ముఖ్యంగా యువతలో తీవ్ర అసంతృప్తి నెలకొందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రాష్ట్రంలో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు.కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేయడం మానేసి.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని, భవిష్యత్తులో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించే పరిస్థితులు వస్తాయని హెచ్చరించారు.

కొండా సురేఖకు బీజేపీ డోర్స్ క్లోజ్

కొండా సురేఖ, కొండా మురళి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

బీజేపీ వైపు చూస్తున్నారా?

కొండా కుటుంబం బీజేపీలో చేరవచ్చన్న ప్రచారం నేపథ్యంలో తెలంగాణ బీజేపీలోనూ భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నట్లు తెలుస్తోంది. కొందరు నాయకులు వారు వస్తామంటే అడ్డుకోవాల్సిన అవసరం లేదని అభిప్రాయపడుతుండగా.. మరి కొందరు మాత్రం పార్టీలోకి తీసుకునే విషయంలో వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ పరిణామాల మధ్య బీజేపీ సీనియర్ నేత మురళీధర్ రావు చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

బీజేపీ చెత్తబుట్ట కాదు..

కొండా సురేఖ బీజేపీలో చేరతారన్న ప్రచారంపై మురళీధర్ రావు ఎక్స్ వేదికగా ఘాటుగా స్పందించారు. కాంగ్రెస్ పార్టీలో సంక్షోభం ముదురుతున్న సమయంలో ప్రతి రాజకీయ ఊహాగానాన్నీ బీజేపీకి ఎందుకు అంటగడుతున్నారని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్‌లోని అంతర్గత సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకు బీజేపీని చర్చలోకి తీసుకువస్తున్నారా? అని నిలదీశారు.అసంతృప్త నేతలను చేర్చుకునే 'డస్ట్ బిన్'గా తెలంగాణ బీజేపీ మారదని ఆయన స్పష్టం చేశారు. సంస్కృతి, నైతికత, రాజకీయ విలువల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ప్రత్యామ్నాయంగా ఎదగడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. బీజేపీ అంటే నిజమైన రాజకీయ ప్రత్యామ్నాయమని.. కేవలం మరో పార్టీకి పేరు మార్చుకున్న సంస్థ కాదని వ్యాఖ్యానించారు.

దీని వెనుక పెద్ద ఆంతర్యం ఉండొచ్చు..

కాంగ్రెస్‌లో సంక్షోభం ముదురుతున్న ప్రతిసారీ ఊహాజనిత రాజకీయ కథనాల్లోకి బీజేపీని ఎందుకు లాగుతున్నారని మురళీధర్ రావు ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎదుర్కొంటున్న ఇబ్బందుల నుంచి ఆ పార్టీని కాపాడేందుకు, అసలు అంశాన్ని పక్కదారి పట్టించేందుకు ఇలాంటి ప్రచారాలు జరుగుతున్నాయా? అనే అనుమానం వ్యక్తం చేశారు.''బీజేపీ 'బిన్' కాబోదు. ఈ దుష్ప్రచారాల పట్ల జాగ్రత్తగా ఉండండి. ఈ కథనాల వెనుక మనం చూస్తున్న దానికంటే ఆంతర్యం చాలా పెద్దదే ఉండొచ్చు'' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.అయితే కొండా దంపతుల తదుపరి రాజకీయ అడుగు ఏంటన్నది ఇంకా స్పష్టత రాలేదు. గతంలో వైసీపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరి, ఆ పార్టీతో విభేదించిన అనంతరం తిరిగి కాంగ్రెస్ గూటికి చేరిన కొండా దంపతులు.. ఇప్పుడు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది.

అమెరికా–ఇరాన్ మధ్య ముదిరిన ఉద్రిక్తతలు.. మూడు ఆయిల్ ట్యాంకర్లపై అమెరికా దాడి

ఎలాంటి నష్టం జరగలేదని, సిబ్బందికి కూడా ఎలాంటి గాయాలు కాలేదని USCENTCOM పేర్కొంది.ఈ పరిణామం అనంతరం అమెరికా బలగాలు ఇరాన్‌పై ప్రతిదాడులకు దిగినట్లు వెల్లడించింది. దీంతో ఇరు దేశాల మధ్య ఇప్పటికే ఉన్న ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యే పరిస్థితి నెలకొంది.

మూడు ఆయిల్ ట్యాంకర్లపై దాడి..

ఇరాన్ చర్యకు ప్రతిస్పందనగా ఖర్గ్ ఐలాండ్, జాస్క్ సమీపంలో IRGCకి చెందిన రెండు క్రూడ్ ఆయిల్ ట్యాంకర్లను అమెరికా బలగాలు ధ్వంసం చేసినట్లు సమాచారం. M/T డానీ, M/T స్టార్క్–1 అనే ట్యాంకర్లపై దాడి చేసినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించింది.వీటితో పాటు ఒమన్ గల్ఫ్‌లో ఖాళీగా ఉన్న మరో ఆయిల్ ట్యాంకర్‌పైనా దాడి జరిగినట్లు అధికారులు తెలిపారు. దీంతో మొత్తం మూడు ట్యాంకర్లు అమెరికా దాడులకు గురైనట్లు పేర్కొన్నారు.

'షాడో నెట్‌వర్క్'కు భారీ దెబ్బ..

ఈ మూడు ట్యాంకర్లు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ (IRGC), దానికి అనుబంధంగా ఉన్న గ్రూపులకు నిధులు సమకూర్చే బిలియన్ డాలర్ల అక్రమ 'షాడో నెట్‌వర్క్'లో భాగమని అమెరికా అధికారులు ఆరోపించారు.అమెరికా సెంట్రల్ కమాండ్ కమాండర్ అడ్మిరల్ బ్రాడ్ కూపర్ ఇరాన్‌ను తీవ్రంగా హెచ్చరించినట్లు సమాచారం. అమెరికా బలగాలపై దాడులు చేస్తే అందుకు మరింత తీవ్రమైన ప్రతిచర్య ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. అవసరమైతే ఇరాన్ చమురు రవాణా వ్యవస్థపై మరిన్ని చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని హెచ్చరించారు.

ఖర్గ్ ఐలాండ్‌పై ఇరాన్ స్పందన..

ఖర్గ్ ఐలాండ్ సమీపంలో తమకు చెందిన ట్యాంకర్‌పై దాడి జరిగినట్లు ఇరాన్‌కు చెందిన 'తస్నిమ్' వార్తా సంస్థ పేర్కొంది. అయితే ట్యాంకర్‌లోని సిబ్బందిని సురక్షితంగా ఖాళీ చేయించామని, ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని నివేదించింది.ఇరాన్ చమురు ఎగుమతుల్లో ఖర్గ్ ఐలాండ్‌కు అత్యంత కీలకమైన స్థానం ఉంది. యుద్ధం ప్రారంభానికి ముందు దేశం నుంచి ఎగుమతి అయ్యే క్రూడ్ ఆయిల్‌లో సుమారు 90 శాతం వరకు ఈ ద్వీపం ద్వారానే రవాణా జరిగేదని సమాచారం. దీంతో ఖర్గ్ ఐలాండ్ చుట్టూ చోటుచేసుకున్న పరిణామాలు అంతర్జాతీయ చమురు మార్కెట్లపైనా ప్రభావం చూపే అవకాశం ఉందనే చర్చ మొదలైంది.

సుమంత్ కేసులో పోలీసుల దూకుడు.. ముగ్గురి కస్టడీ..

హైదరాబాద్, ప్రజావాయిస్ బ్యూరో : ఎమ్మెల్యే కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్ కేసులో పోలీసులు దర్యాప్తును మరింత ముమ్మరం చేశారు. హత్యాయత్నం కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న సుమంత్ పరారీలో ఉండటంతో అతడి కోసం ప్రత్యేక పోలీసు బృందాలు గాలిస్తున్నాయి. మరోవైపు ఈ కేసులో అరెస్టైన ముగ్గురు నిందితులను పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారణ కొనసాగిస్తున్నారు.

ముగ్గురు నిందితులకు పోలీస్ కస్టడీ..

సుమంత్‌తో పాటు మరో ముగ్గురిపై జూబ్లీహిల్స్ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈ కేసులో బత్తిని అరుణ్‌కుమారెడ్డి, పసుపులేటి కార్తీక్‌కుమార్, ముత్యాల మహేందర్‌రెడ్డిలను నాలుగు రోజుల పాటు పోలీస్ కస్టడీకి కోర్టు అనుమతించినట్లు సమాచారం.కస్టడీలో భాగంగా శుక్రవారం మొదటి రోజు పోలీసులు ముగ్గురినీ విచారించారు. శనివారం కూడా వారిని విచారించనున్నారు. కేసుకు సంబంధించిన కీలక వివరాలను రాబట్టేందుకు పోలీసులు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నట్లు తెలుస్తోంది.

సుమంత్‌తో సంబంధాలపై ఆరా..

మొదటి రోజు విచారణలో సుమంత్‌తో నిందితులకు ఉన్న సంబంధం, పరిచయం ఎలా ఏర్పడింది? అనే అంశాలపై పోలీసులు ప్రధానంగా ఆరా తీసినట్లు తెలుస్తోంది. అసలు హత్యాయత్నం ఘటన వెనుక ఏం జరిగింది? దాడికి దారితీసిన పరిస్థితులు ఏంటి? అనే కోణాల్లోనూ వివరాలు సేకరిస్తున్నారు.ఈ ఘటనలో ఎవరి పాత్ర ఎంత ఉంది? మరికొందరి ప్రమేయం ఏమైనా ఉందా? అనే అంశాలపైనా పోలీసులు విచారణ సాగిస్తున్నారు. నిందితుల నుంచి లభించే సమాచారం ఆధారంగా దర్యాప్తును మరింత విస్తరించే అవకాశం ఉంది.

పరారీలో సుమంత్.. గాలింపు ముమ్మరం

ఇప్పటికీ సుమంత్ పోలీసులకు చిక్కకపోవడంతో అతడి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. సుమంత్ ఎక్కడ ఉన్నాడు? ఎవరైనా అతడికి ఆశ్రయం కల్పిస్తున్నారా? అనే కోణాల్లో పోలీసులు ఆరా తీస్తున్నారు.ఈ కేసులో నిందితుల కస్టడీ విచారణతో పాటు సుమంత్ ఆచూకీపై దర్యాప్తు కొనసాగుతుండటంతో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు. కేసు దర్యాప్తు కొద్దికొద్దిగా ముందుకు సాగుతున్న కొద్దీ ఘటన వెనుక ఉన్న పూర్తి వ్యవహారం బయటపడే అవకాశముంది.

మల్కాజిగిరిలో భారీ బంగారం చోరీ

మల్కాజిగిరి, ప్రజావాయిస్ బ్యూరో : హైదరాబాద్‌లోని మల్కాజిగిరి పరిధిలో భారీ బంగారం చోరీ ఘటన కలకలం రేపుతోంది. ఆనంద్‌బాగ్‌లోని ఎస్‌బీఐ అపార్ట్‌మెంట్‌లో సుమారు 48 తులాల బంగారం చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. అపార్ట్‌మెంట్‌లో సుమారు 11 సంవత్సరాలుగా పనిచేస్తూ యజమానుల నమ్మకాన్ని సంపాదించిన నేపాలీ కుటుంబంపైనే ఈ చోరీకి సంబంధించి అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కుటుంబం ఏప్రిల్‌లోనే అపార్ట్‌మెంట్‌ను ఖాళీ చేసి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది.

11 ఏళ్లుగా అపార్ట్‌మెంట్‌లోనే..

అనారోగ్య కారణాలతో భర్త మృతి చెందడంతో ఓ మహిళ తన నలుగురు పిల్లలతో కలిసి అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం. ఏళ్ల తరబడి అక్కడే ఉంటూ అపార్ట్‌మెంట్ యజమానులు, కుటుంబ సభ్యులతో సన్నిహితంగా మెలిగినట్లు తెలుస్తోంది.అయితే ఈ ఏడాది ఏప్రిల్‌లో ఒక్కసారిగా అపార్ట్‌మెంట్‌ను ఖాళీ చేసి వెళ్లిపోవడంతో అనుమానాలు వ్యక్తమయ్యాయి. అనంతరం ఫ్లాట్లలో బంగారం కనిపించకపోవడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు.

48 తులాల బంగారం మాయం..

అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్ నంబర్లు 301, 302లో భారీగా బంగారం చోరీ జరిగినట్లు గుర్తించారు. మొత్తం సుమారు ★48 తులాల బంగారం★ కనిపించకుండా పోయిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.వాచ్‌మెన్‌గా పనిచేసిన కుటుంబం ఏప్రిల్‌లోనే అపార్ట్‌మెంట్‌ను ఖాళీ చేసి వెళ్లిపోవడం, అనంతరం బంగారం చోరీ విషయం వెలుగులోకి రావడంతో వారి పాత్రపై అనుమానాలు బలపడినట్లు తెలుస్తోంది.

మల్కాజిగిరి పోలీసుల దర్యాప్తు..

ఫిర్యాదు అందుకున్న మల్కాజిగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నేపాలీ కుటుంబం ప్రస్తుతం ఎక్కడ ఉంది? ఏప్రిల్‌లో అపార్ట్‌మెంట్ ఖాళీ చేసిన తర్వాత ఎక్కడికి వెళ్లారు? అనే అంశాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.చోరీకి గురైన బంగారం ఎక్కడికి తరలించారు? ఈ ఘటనలో కుటుంబ సభ్యులతో పాటు మరెవరైనా సహకరించారా? అనే కోణాల్లోనూ విచారణ కొనసాగుతోంది.

ప్రత్యేక బృందాలతో ఆరా..

చోరీ ఘటనకు సంబంధించి అందుబాటులో ఉన్న ఆధారాలను పోలీసులు సేకరిస్తున్నారు. నిందితుల ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగినట్లు సమాచారం. బంగారం చోరీకి సంబంధించి పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది.

పాక్‌కు భారత్ బిగ్ చెక్.. సింధు నదిపై రాక్ ఫిల్ డ్యామ్

- **లడఖ్‌లోని ఉప్షి వద్ద సింధు నదిపై భారీ రాతి ఫిల్ చెక్ డ్యామ్**
- **సిమెంట్ లేకుండా బౌల్డర్లు, మట్టితో నిర్మాణం**
- **డ్యామ్‌తో సింధు నదిలో నీటి మట్టం 10 అడుగులు పెరిగినట్లు సమాచారం**
- **సుమారు 40 మిలియన్ లీటర్ల నీటిని నిల్వ చేసే సామర్థ్యం**
- **మరో 36 చెక్ డ్యామ్‌ల నిర్మాణానికి రూ.56 కోట్లతో కేంద్రం ప్రతిపాదన**

లేహ్, ప్రజావాయిస్ బ్యూరో : సింధు నదీ జలాల విషయంలో పాకిస్తాన్‌తో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. కేంద్ర పాలిత ప్రాంతం లడఖ్‌లోని లేహ్ పరిధిలో ఉప్షి వద్ద సింధు నదిపై భారీ రాతి ఫిల్ చెక్ డ్యామ్‌ను నిర్మించింది. సిమెంట్‌ను వినియోగించకుండా బౌల్డర్లు, మట్టితో ఈ నిర్మాణాన్ని చేపట్టినట్లు సమాచారం. సరిహద్దు గ్రామాల్లో నీటి కొరతకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు, సింధు నదీ జలాలపై పాకిస్తాన్ ఆధారపడే పరిస్థితుల నేపథ్యంలో ఈ ప్రాజెక్టుకు ప్రాధాన్యత ఏర్పడింది.

10 అడుగులు పెరిగిన నీటిమట్టం..

ఉప్షి వద్ద నిర్మించిన ఈ చెక్ డ్యామ్ అందుబాటులోకి రావడంతో సింధు నదిలో నీటి మట్టం సుమారు 10 అడుగుల మేర పెరిగినట్లు సమాచారం. దాదాపు 40 మిలియన్ లీటర్ల నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం ఈ డ్యామ్‌కు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.సింధు నది లోయల గుండా ప్రవహిస్తుండటంతో అక్కడి నీటిని వ్యవసాయ అవసరాలకు వినియోగించుకునేందుకు రైతులు పంపింగ్‌పై ఆధారపడాల్సి వచ్చేది. దీంతో సాగునీటి కోసం అధిక ఖర్చు చేయాల్సి వచ్చేది. నీటి కొరత కారణంగా పంటలు ఎండిపోయే పరిస్థితులు కూడా ఉండేవి. ఈ సమస్యకు పరిష్కారంగా చెక్ డ్యామ్‌ను నిర్మించినట్లు తెలుస్తోంది.

బ్రూస్ లీ అవార్డు పొందిన మాస్టర్ మహేష్

- గ్లోబల్ ఎక్సలెన్స్ మార్షల్ ఆర్ట్స్ బ్రూస్ లీ అవార్డు ప్రదానం
- టాలెంట్ ఎవరు సొత్తు కాదని నిరూపించిన మాస్టర్ మహేష్

ప్రజా వాయిస్ తలకొండపల్లి : రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం పెట్టుపులపల్లి గ్రామానికి చెందిన ఏదుల మహేష్ చిన్నతనం నుంచే కరాటే నేర్చుకుని తనదైన స్థానాన్ని కల్పించుకొని మార్చి లాస్ట్ లో బ్రూస్లీ అవార్డులు పొందారు. హైదరాబాద్ మార్షల్ ఆర్ట్స్ రంగంలో విశిష్ట ప్రతిభ, సేవలు అందించిన వారికి అందజేసే మహేష్ గ్లోబల్ ఎక్సలెన్స్ మార్షల్ ఆర్ట్స్ బ్రూస్ లీ అవార్డును పలువురు ప్రముఖులు ఘనంగా స్వీకరించారు.ఈ సందర్భంగా మాస్టర్ కేశవ్ కరాటే అకాడమీ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గబ్బర్ సింగ్ సాయి, శివం శివరాత్రి, కేశవ్ గౌడ్, కాజావుద్దీన్, అమర్ సింగ్ తదితరులు అవార్డులను అందుకున్నారు.మార్షల్ ఆర్ట్స్ రంగంలో ప్రతిభ, క్రమశిక్షణ, సేవా భావంతో ముందుకు సాగుతున్న వారిని గుర్తించి ప్రోత్సహించడమే ఈ అవార్డుల ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. అవార్డులను ప్రముఖుల చేతుల మీదుగా అందుకోవడం పట్ల అవార్డు గ్రహీతలు ఆనందం వ్యక్తం చేశారు.మార్షల్ ఆర్ట్స్ అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రతి ఒక్కరినీ ప్రోత్సహిస్తూ భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు.

మానవత్వం మంట కలిసిందా! రాజకీయం దారి తప్పిందా..!??

- మణుగూరు పట్టణంలో శాంతిభద్రతలు కాపాడే బాధ్యత ఎవరిది...!?
- ఒక బీసీ బిడ్డ దారుణ హత్య దేనికి సంకేతం...!??
- ఆదివాసి మహిళ మరణిస్తే సంతాపం!??
- బీసీ బిడ్డ మరణిస్తే క్రూరత్వం..!??
- ఓటు వేసిన గెలిపించిన కుటుంబాన్ని పరామర్శ చేయలేని స్థానిక ఎమ్మెల్యే పాయం!?
- నేటికీ నోరు విప్పని కేంద్ర ప్రభుత్వ బీజేపీ పార్టీ నేతలు
- పది రోజులు గడిచిన కంటికి కనిపించని సి,పి,ఎం సి,పి,ఐ ఎర్రజెండా పార్టీలు
- చుట్టం చూపుగా వెళ్లి పరామర్శ చేసిన మణుగూరు మండల బిఆర్ఎస్ నేతలు

ప్రజా వాయిస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గ రాజకీయం అంటేనే ప్రజలు భయభ్రాంతులకు గురయ్యే పరిస్థితి ఏర్పడింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే. విద్య, వైద్యం సత్వర ,న్యాయం జరుగుతుంది. అంటూ నమ్మిన ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పై నమ్మకంతో గెలిపించారు అనేది జగమెరిగిన సత్యమే!? అయితే కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా కొనసాగే పాయం వెంకటేశ్వర్ల పాలనలో .నేర చరిత్ర కలిగిన ప్రాధాన్యత ఇవ్వడం. గ్రూపులుగా ఏర్పడి దందాలు చేసే వ్యక్తుల కు సహకరించడం. బహిరంగ ప్రదేశాల్లో దారుణ హత్యలు జరిగిన స్పందించ కపోవడం చూసిన ప్రజల ఓట్లు వేసి గెలిపించిన పాపానికి తలలు బాదుకునే పరిస్థితి ఏర్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి, సింహాద్రి శివకుమార్ దారుణ హత్య మరవక ముందే. అంబేద్కర్ సెంటర్ సాక్షిగా మణుగూరు పట్టణంలో పోలీస్ స్టేషన్ సమీపంలోనే మరో దారుణ ఘర్షణ బయటకు రావడం వల్ల ప్రజలకు ప్రాణభయం పట్టుకుంది. రాజకీయ నేతల పిల్లలే నేరాలకు పాల్పడడం. విశ్వబ్రాహ్మణ కుటుంబానికి చెందిన సింహాద్రి శివకుమార్ అనే వ్యక్తిని దారుణ హత్య చేయడం, జరిగిన ప్రజలకు సేవలు చేయవల స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మౌనం పాటించడం. వల్ల శాంతి భద్రతలు పూర్తిగా దారి తప్పినట్లు ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు...

ఆదివాసి మహిళ మరణిస్తే సంతాపం..!? విశ్వబ్రాహ్మణ వ్యక్తి మరణిస్తే క్రూరత్వం!?

మణుగూరు పట్టణ సమీపంలో గల నేతాజీ గ్రౌండ్ నందు గత నెలలో జరిగిన ఘర్షణ ఘటనలో సింహాద్రి శివకుమార్ అనే విశ్వబ్రాహ్మణ కులానికి చెందిన వ్యక్తి అతి దారుణ హత్యకు గురయ్యారు. అయితే ఈ దారుణ హత్య చేసిన వ్యక్తులు రాజకీయ నేతల పిల్లలు కావడం వలన పినపాక రాజకీయం అంటేనే రౌడీ పాలన అన్నట్లు ప్రజల్లో గుర్తింపు పొందినట్లు తెలుస్తుంది. రాఖీ పౌర్ణమి రోజు తన తమ్ముడు చనిపోవడంతో హృదయాలు పగిలేలా సింహాద్రి శివకు మార్ అక్క చెల్లెలు రోదించిన రాజకీయ నేతల్లో మానవత్వం మంట కలిసిన ట్లుగా రాజకీయ నేతలు నటించడం. ఆ కుటుంబానికి శాపంగా మారింది. ప్రజలను కాపాడవలసిన పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే పాయం వెంకటే శ్వర్లు ఆంధ్ర బోర్డర్ సమీపంలో. అత్యాచార ఘటనలో మరణించిన మహిళ కుటుంబాన్ని పరామర్శ చేయడం ప్రభుత్వం అండగా ఉంటుంది అంటూ ప్రక టించడం చేసిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఓట్లు వేసి గెలిపించిన ప్రజలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి కిలో మీటర్ దూరం ఉన్నప్పటికీ పది రోజులు గడిచిన ఆ కుటుంబాన్ని ఓదార్చే ప్రయత్నం చేయకపోవడం ఏమిటి అంటూ ప్రజలు అయోమయంలో పడ్డారు. మరి ఇప్పటికైనా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు. తక్షణమే స్పందించి. మణుగూరు ఖాన్ దాన్ గ్రూప్ ఎలా ఏర్పడింది, గ్రూప్ సభ్యులకు అంతర్గతంగా సహకరించేది ఎవరు.!? సింహాద్రి శివకుమార్ దారుణ హత్య ఘటనలో ప్రధాన పాత్ర ఎవరిది అనేది గుర్తించేలా పోలీసులకు బహిరంగ ఆదేశాలు జారీ చేయాలని బాధిత కుటుంబం కోరుకుంటుంది....

విశ్వబ్రాహ్మణ వ్యక్తి మరణం పట్ల నోరు విప్పని ప్రతిపక్ష పార్టీలు..

. మణుగూరు పట్టణం ఖాన్ దాన్ ముఠా సభ్యులు చేసిన దారుణ హత్య పట్ల దేశాన్ని పాలించే బిజెపి పార్టీ నేతలు రోజులు గడిచిన పోరాట యోధులుగా గుర్తింపు పొందిన సి,పి,ఐ సి,పి,ఎం పార్టీల నేతలు. దారుణ ఘటన పట్ల స్పందించకపోవడం. ప్రతిపక్ష బిఆర్ఎస్ నేతలు చుట్టం చూపుగా వెళ్లి. బాధిత కుటుంబాన్ని అంతర్గతంగా కలవడం. ప్రజలను అయోమయంలో పడేస్తుంది. రాజకీయ నేతలకు పిల్లలు దారుణ హత్యకు కారణం అయితే. కాపాడవలసిన రాజకీయ నేతలే కూర మృగాలుగా మారి కుట్రలు చేయడం చేయడం ఏమిటి అంటూ బాధిత కుటుంబ సభ్యులు కంటతడి పెడుతున్నారు..

మణుగూరు పట్టణంలో శాంతిభద్రతలు కాపాడే బాధ్యత ఎవరిది..!??

మణుగూరు పట్టణంలో శాంతి భద్రతలు గాల్లో దీపంలా మారాయి నిన్న కాక మొన్న mk గ్యాంగ్ చేతిలో ఓ అమాయకుడు దారుణ హత్యకు గురైన ఘటన మరువకముందే. మణుగూరు నడిబొడ్డున అంబేద్కర్ సెంటర్. పోలీస్ స్టేషన్ కు పది అడుగుల దూరంలోనే ప్రజలు అందరూ చూస్తుండగానే ఆటో ట్రాలీ డ్రైవర్లు ఘర్షణ పడడం పిడుగులతో విరుచుకుపడడం. సుమారు 20 నిమిషాల పాటు నడిరోడ్డుపై స్వైర విహారం చేస్తూ భయాందోళనలు సృష్టించిన, సమీపం లోనే ఉన్న పోలీసులు అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం జరిగినట్లు ప్రజలు చర్చించుకోవడం గమనార్హం!? ప్రజలు రద్దీగా ఉన్న ప్రదేశంలోనే విచక్షణ రహితంగా ఒకరిపై ఒకరు పిడుగులు కురిపించుకుంటూ హల్చల్ చేయడం చూసిన ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. నిత్యం రద్దీగా ఉండే అంబేద్కర్ సెంటర్ సమీపంలోనే ఘర్షణలను అదుపు చేయలేని పోలీసులు రేపు వీధుల్లో గ్రామాల్లో ఘర్షణలు సృష్టించి విధ్వంసం చేసే అవకాశాలు ఉన్నాయని. ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. మరి ఇప్పటికైనా తెలంగాణ డిజిపి స్థాయి అధికారులు తక్షణమే స్పందించి మణుగూరు మండల పరిధిలో గల మద్యం విక్రయాలు మాదకద్రవ్యాలు అదుపు చేస్తే తప్ప. ఈ ఘర్షణలు ఆగే పరిస్థితి లేదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు

కన్నాలలో ఇంకుడు గుంతల నిర్మాణానికి శ్రీకారం

- మంథని ఎంపీడీవో శ్రీజ రెడ్డి

ప్రజా వాయిస్ మంథని భూగర్భ జలాల పెంపే లక్ష్యంగా చేపట్టిన 'జలసిరి' కార్యక్రమంలో భాగంగా మంథని మండలం కన్నాల గ్రామంలో శనివారం ఇంకుడు గుంతల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ గుడిసె గట్టయ్య యాదవ్ ఆధ్వర్యంలో గ్రామంలో ఇంకుడు గుంతల ఏర్పాటుకు స్థలాలను పరిశీలించి ముగ్గులు వేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీజ రెడ్డి, సర్పంచ్ గట్టయ్య యాదవ్ పాల్గొని మాట్లాడుతూ... గ్రామంలోని ప్రతి ఇంటా తప్పనిసరిగా ఇంకుడు గుంతను నిర్మించుకోవాలని సూచించారు. వర్షపు నీటిని వృథాగా పోనివ్వకుండా ప్రతి నీటి చుక్కను ఒడిసిపట్టినప్పుడే భూగర్భ జలాలు పెరుగుతాయని, తద్వారా నీటి ఎద్దడిని అరికట్టవచ్చని గ్రామస్తులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి గాదె దివ్య, వార్డు సభ్యుడు పర్షవేన అనిల్, గ్రామ కార్యదర్శి కేశెట్టి మధుకర్, ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్‌తో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులే సమాజ నిర్మాణానికి కీలకం

- ములుగు విద్యార్థులు రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలవడం ఉపాధ్యాయుల కృషికి నిదర్శనం
- విద్యారంగంలో ములుగును మరింత ముందుకు తీసుకెళ్లాలి
- భానోత్ రవిచందర్

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్. ప్రజా వాయిస్ ములుగు జిల్లా; ఏటూరునాగారం మండలం:/గిరిజన సంక్షేమ శాఖ, ఏటూరునాగారం సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ములుగు జిల్లా కేంద్రంలో గురుపూజోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, ఏటూరునా గారం సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి లెనిన్ వస్తల్ టొప్పో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భానోత్ రవిచందర్ మాట్లాడుతూ..... ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులందరికీ శుభాకాం క్షలు తెలిపారు. సమాజాన్ని అద్భుతంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు."మాతృ దేవోభవ.. పితృ దేవోభవ.. ఆచార్య దేవోభవ" అని పెద్దలు చెప్పారని, విద్యార్థులు ప్రయోజకులుగా, భావి భారత పౌరులుగా ఎదగడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ములుగు జిల్లా విద్యార్థులు రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలవడం వెనుక ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందని అన్నారు. ములుగు జిల్లా అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న మంత్రి సీతక్క ఆశయాలకు అనుగుణంగా విద్యారంగంలో జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిపిన ఘనత ఉపాధ్యాయులదేనని కొనియా డారు. రానున్న రోజుల్లో కూడా ములుగు జిల్లాను విద్యా రంగంలో రాష్ట్రస్థాయిలో మరింత ముందుకు తీసుకెళ్లేం దుకు ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలని భానోత్ రవిచందర్ కోరారు.ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబ రిచిన ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రాలు అందజేసి సత్క రించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ అధికా రులు, ఏటూరునాగారం సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ అధి కారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

- సీఎం ను కలిసిన అతిథి అధ్యాపకులు
- సానుకూలంగా స్పందించడం పట్ల హర్షం

ప్రజావాయిస్/వికారాబాద్ జిల్లా: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గత పదేళ్లుగా విధులు నిర్వహిస్తున్న అతిథి అధ్యాపకుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అతిథి అధ్యాపకుల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రోజున సీఎం ను కలిసి విన్నవించారు. 2023 ఎన్నికల మేనిఫె స్టోలో హామీ ఇచ్చిన విధంగా నెలకు రూ.42 వేల వేతనంతో పాటు 12 నెలల జీతం, ఉద్యోగ భద్రత కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. రెగ్యులర్ లెక్చరర్ల నియామకాలతో డిస్టర్బ్ అయిన అతిథి అధ్యాప కులను అవకాశం ఉన్న చోట సర్దుబాటు చేయాలని కోరారు. తమ సేవలను గుర్తించి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.అయితే ఈ విషయంపై సీఎం సానుకూలంగా స్పందించడం పట్ల అతిథి అధ్యాపకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేసిన వారిపై కేసు నమోదు చేయాలి

- బీఆర్ఎస్ గజ్వేల్ ఇంచార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి ఫిర్యాదు
- వారం రోజుల్లో చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్
- లేని పక్షం పదివేల మందితో శవయాత్ర, దహనం, ధర్నా హెచ్చరిక
- అధికారం చేతకాని కాంగ్రెస్ నేతల అవివేకానికి నిదర్శనం

ప్రజా వాయిస్ గజ్వేల్ :తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసిన కాంగ్రెస్ నాయకులపై వెంటనే కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి గజ్వేల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర సాధనకు కృషి చేసిన కేసీఆర్‌ను అగౌరవపరిచిన కాంగ్రెస్ నాయకులపై వారం రోజుల్లో చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో దాదాపు పదివేల మంది కార్యకర్త లతో కోట మైసమ్మ నుంచి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ శవయాత్ర చేపట్టి, ఇంద్రపార్క్ చౌరస్తా వద్ద దహనం చేసి కాంగ్రెస్ నేతలకు గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. అప్పుడు పోలీసులు కేసులు పెడితే గజ్వేల్ పోలీస్ స్టేషన్ ముందు బెంట్లు వేసుకుని ధర్నా చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ నేతలు ప్రతి పక్షంలో ఉన్నారా లేదా అధికారంలో ఉన్నారా అనేది వారికే అర్థం కావడం లేదని, తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి కేసీఆర్ రాజీనామా చేయమని అడగడం, దిష్టిబొమ్మ దహనం చేయడం అత్యంత విద్రూరంగా ఉందని తీవ్రంగా ఖండించారు. అభివృద్ధి చేయకపోవడం, సంక్షేమ ఫలాలు పంపిణీ చేయ కపోవడం, మేనిఫెస్టో హామీలు అమలు చేయకపోవడంతో తమకు భయం వేసి ఇలా చేస్తున్నారని, ఇది కాంగ్రెస్ ప్రభుత్వం చేతకానితనానికి నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్, వైస్ చైర్‌పర్సన్ పద్మాబాయి నర్సింగరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి, మండల పార్టీ అధ్యక్షుడు బెండ మధు, పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా, మాజీ జెడ్పీటీసీ పంగా మల్లేశం, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



మద్యపాన నిషేధానికై గ్రామ మహిళల పోరాటం

- బెల్ట్ షాపుల వద్ద మద్యం సేవించి మత్తులో మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు
- గ్రామస్తులతో కలిసి సర్పంచి గ్రామంలో బెల్ట్ షాపులు మూసివేయాలని నినాదాలు
- మద్యం నమ్మినవారికి 1లక్ష రూపాయల జరిమానా. మద్యం పట్టించిన వారికి 20వేల రూపాయల బహుమతి.
- గ్రామ సర్పంచికి కార్యదర్శికి వినతి పత్రం అందజేసిన మహిళలు

ప్రజా వాయిస్ / పాలకుర్తి (జనగామ జిల్లా)జనగామ జిల్లా దేవరు ప్పుల మండలం గొల్లపల్లి గ్రామంలో బెల్ట్ షాపులను మూసివేయా లని మహిళా సంఘం నాయకురాలు గ్రామ సర్పంచ్ కి ,కార్యదర్శికి ఫిర్యాదు చేయగా వెంటనే గ్రామ కార్యదర్శి సర్పంచి స్పందించి గ్రామ మహిళా సంఘం నాయకులతో గ్రామస్తులతో కలసి గ్రామంలో ర్యాలీ చేపట్టి బెల్ట్ షాపులు మూసివేయాలని నిదానాలు చేసుకుంటూ గ్రామంలో కలియ తిరిగి బెల్టు షాపు నిర్వాహకులకు నోటీసులు అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచి,కార్యదర్శి మహిళా సంఘం నాయకులు మాట్లాడుతూ..గ్రామంలో గత కొద్ది రోజులుగా బెల్ట్ షాపుల వద్ద మద్యం సేవించి మద్యం మత్తులో బజారు పోతున మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ మహిళలపై దాడి చేయడం జరుగుతుంది గొడవలకు అడ్డాగా మారిన బెల్ట్ షాపులను మూసివేయాలని అన్నారు.బెల్టు షాపులు మూసివేసి గ్రామంలో శాంతి భద్రతలకు ప్రశాంతమైన వాతావరణం కోసం సహకరించాలని తెలిపారు.మద్యం అమ్మిన వారికి లక్ష రూపాయల జరినామా పట్టించిన వారికి 20వేల బహుమతి అందజేస్తామని మహిళా సంఘం నాయకురాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి తీగల పరుశరాములు,వార్డు మెంబర్లు తీగల సోమలక్ష్మి, తీగల మౌనిక, దయ్యాల శోభ, మహిళా సంఘం నాయకురాలు ఆకావరం ప్రేమలత రెడ్డి,కోనేటి సుశీల,తీగల భారతమ్మ, తీగల యాదలక్ష్మి,బొరోజు శ్రీలత,తండ సుజాత, వర్రే దుర్గమ్మ,తీగల బాగ్యమ్మ, జవ్వారపు లక్ష్మి, గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బట్ట అంజయ్య, కోనేటి వెంకన్న,బట్ట యాదగిరి, బోండ్ల మారయ్య,వంగాల మల్లయ్య బట్ట పరశు రాములు,బట్ట యాదయ్య బట్ట రాజయ్య, బట్ట సోమయ్య, బట్ట దుర్గయ్య, బట్ట రాజయ్య, బట్ట కొండయ్య, బట్ట ఎల్లమ్మ, బట్ట ఉప్పలమ్మ, బట్ట మంగమ్మ,బట్ట స్వప్న మహిళలు తదితరులు పాల్గొన్నారు

22-ఏ భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

- ఇందిరాపార్కు వద్ద జనసేన భారీ నిరసనదీక్ష

ప్రజా వాయిస్, కోరుట్ల:తెలంగాణలో 22-ఏ నిషేధిత జాబితాలోని అర్హులైన భూములను వెంటనే తొలగించి, ప్రజల ఆస్తి హక్కులను కాపాడాలని జనసేన పార్టీ డిమాండ్ చేసింది. శనివారం ఇందిరా పార్కు ధర్నాచౌక్ వద్ద పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ నేమూరి శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో భారీ నిరసన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 22-ఏ కారణంగా భూముల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయి ప్రజలు ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్నారని, పెండింగ్ దరఖాస్తులను కాలపరిమితిలో పరిష్కరించాలని కోరారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు పోరాటం ఆపబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆర్కే సాగర్, రాజా లింగం, మండపాక కావ్య శిరీష,దుంపటి శ్రీనివాస్, మాదిరెడ్డి దామోదర్ రెడ్డి, ప్రేమ్ కుమార్, ప్రేమ్ గాంధీ, గంగం అజయ్ కుమార్, పృథ్వి, బెక్కం జనార్ధన్, కంచర్ల నర్సాగౌడ్, మంతిని సంపత్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు మంథని పోలీసుల కౌన్సెలింగ్

ప్రజా వాయిస్ మంథని రాబోయే వినాయక చవితి (సెప్టెంబర్ 14) సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మంథని పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లకు శనివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. పండుగ వేళ బలవంతపు చందాలు, బహిరంగ మద్యపానం, గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. ఊరు వదిలి వెళ్లే ముందు పోలీసులకు సమాచారం ఇవ్వాలని స్పష్టం చేశారు. పండుగ బందోబస్తు నిమిత్తం బీట్ చెకింగ్, నైట్ రౌండ్స్, ప్రత్యేక పికెట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని, సమస్యలు ఉంటే వెంటనే పోలీసులను సంప్రదించాలని కోరారు.

పాలిటెక్నిక్ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న రేవంత్ రెడ్డి

- ప్రభుత్వం విద్యార్థులతో పెట్టుకుంటే కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేసే వరకు ఉద్యమం చేసిన చరిత్ర
- నీకు కూడా అదే గతి పడుతుంది రేవంత్ రెడ్డి నన్నపునేని నరేందర్

ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి వరంగల్ లో కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల విఫల పాలనలో విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలను పూర్తిగా విస్మరించిందని గ్రేటర్ వరంగల్ మేయర్, వరంగల్ తూర్పు మాజీ శాసనసభ్యులు నన్నపునేని నరేందర్ తీవ్రంగా విమర్శించారు.విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో అనేక మంది విద్యార్థులు కళాశాలల నుంచి తమ సర్టిఫికెట్లు పొందలేక నరకయాతన అనుభవిస్తున్నారని అన్నారు. మరోవైపు నిరుద్యోగులకు భృతి ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని విస్మరించి యువతను మోసం చేశారని మండిపడ్డారు.ఈ సమస్యలపై నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో సుమారు 3,000 మంది విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించి వరంగల్ చౌరస్తా వరకు తరలివెళ్లి ప్రభుత్వానికి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ.. పాలిటెక్నిక్ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెంటనే వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.విద్యార్థులతో పెట్టుకుంటే ఏమవుతుందో చరిత్ర చెబుతోంది. విద్యార్థుల సమస్యలపై గతంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేసే వరకు ఉద్యమం చేసిన చరిత్ర. అదే విద్యార్థి శక్తిని తక్కువ అంచనా వేసి ముందుకు వెళ్తే రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి కూడా అదే గతి పడుతుంది" అని నరేందర్ హెచ్చరించారు.విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, కళాశాలల్లో నిలిపివేసిన సర్టిఫికెట్లను విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఎన్నికల సమయంలో ఇచ్చిన నిరుద్యోగ భృతి హామీని వెంటనే అమలు చేయాలని కోరారు.విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడితే చూస్తూ ఊరుకునేది లేదు. విద్యార్థుల హక్కుల కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమని నన్నపునేని నరేందర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమం లో విద్యార్థులు మరియు బీ ఆర్ ఎస్ ముఖ్య నాయకులు బీ ఆర్ ఎస్ వి నాయకులు పాలుగోన్నారు.

వదల బొమ్మాళి నేను వదల!?

- డిప్యూషన్ పేరుతో దవాఖాన వదలని ఉద్యోగస్తులు!
- ఏళ్ల తరబడి కదలకుండా ఉండేందుకే ఇష్టపడుతున్న సిబ్బంది?
- వేరే ప్రాంతానికి బదిలీ అయినా వీడని ఉత్కంఠ తెర!?
- ఏసీలకు పరిమితమై ప్రజా సేవను మానేస్తున్నారంటూ విమర్శలు!
- ఎనిమిదేళ్లుగా ఒకే చోట కదలని యంత్రాంగం
- సానిటరీ విధానంలో పాత వారే మేల్ అంటున్న ప్రజానీకం

ప్రజా వాయిస్ అశ్వారావుపేట భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట పట్టణంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాల నందు పదుల సంఖ్యలో పలు అధికారులు బదిలీ అయినప్పటికీ డిప్యూషన్ పై వెళ్లి తిరిగి మరల అక్కడే విధులు నిర్వహించటం మండలంలో సంచలనం సృష్టిస్తుంది. ఏళ్ల తరబడి కదలకుండా ఉండేందుకు ఇష్టపడుతున్న సిబ్బంది అంటూ వేరే ప్రాంతానికి బదిలీ అయినా వీరు వీడని ఉత్కంఠం తెర లాగా ఉందని మీరు మాత్రం కేవలం ఏసీలకు పరిమితమై ప్రజాసేవను సైతం మరిచిపోతున్నారని విమర్శలు లేకపోలేదు. 8 ఏళ్లుగా ఒక చోట కదలకుండా యంత్రాంగం ఉండటం ఏ భారత రాజ్యాంగ జీవోలో సవరణ చేసి ఉందో తెలియని పరిస్థితిలో ఉందంటూ ప్రజానీకం సైతం ప్రశ్నించే పరిస్థితి కనిపిస్తుంది. సానిటరీ విధానంలో పాతవారే మేలే తప్ప కొత్త వారి వల్ల ఒరిగిందేమీ లేదంటూ పట్టణంలోని ప్రజలు భారీగా విమర్శిస్తున్నారు. ఇంతటి ఒడిగడుతున్న వారిపై కన్న ప్రేమ చూపుతున్న వారు ఎవరో ఆ దేవుడికే తెలియాలంటే ప్రజలు ప్రభుత్వాన్ని సైతం విమర్శించే స్థాయికి చేరుకుంది. నిజానికి హాస్పటల్ నందు ప్రజలకు సేవలు అందించేందుకు ప్రభుత్వం పలు రకాలు విభాగాలకు సంబంధించిన యంత్రాంగాన్ని నియమించి వారిని గత మూడేళ్లుగా విధి నిర్వహణ కొనసాగిస్తున్న వారు మాత్రం బదిలీలు అయినా వేడని పరిస్థితి కనిపిస్తుందంటూ భారీగా విమర్శలు చోటు చేసుకుంటున్నాయి. ప్రభుత్వ దవాఖానాలోని ఓ స్లీపర్ ఉద్యోగి నుండి ఫార్మర్స్, స్టాఫ్ నర్సులు. కూడా బదిలీలయి ఉన్నప్పటికీ మరల డిప్యూటీషనపై అదే ప్రదేశంలో విధి నిర్వహణలో కొనసాగించడం ప్రజలకు శాపంగా మారింది. జిల్లాకు చెందిన ఉన్నత స్థాయి అధికారి వీరిని కాపాడుతున్నారని వాదనలేకపోలేదు.

బదిలీపై మూడు సంవత్సరాల్లో విధినిర్మాణ కొనసాగించాలి!

పలు ప్రభుత్వ కార్యాలయాల్లో విధి నిర్వహణలు చేస్తున్న ఉద్యోగస్తులు కేవలం మూడు సంవత్సరాల కాలంలోనే బదిలీపై వచ్చిన ప్రదేశంలో విధినిర్మానాలు కొనసాగించాలి! భారత రాజ్యాంగం ఆర్టికల్ ప్రకారం అంతకంటే ఎక్కువగా విధి నిర్వహణలో కొనసాగించరాదు? ఇది అందరికీ తెలిసిన విషయమే! కానీ బదిలీపై వచ్చి ఐదు నుండి ఆరు సంవత్సరాలు కావస్తున్న వేరే ప్రాంతానికి బదిలీ కావడంతో మరల జిల్లా స్థాయి అధికారి యంత్రంగా సహకారాలతో డిప్యూషన్ తో వెళ్లిన తిరిగి మరల అదే ప్రదేశంలో విధి నిర్వహణలో కొనసాగించటం కొసమెరుపు.

నాలుగు శాఖలు నలుగురు బదిలీలు మరల అదే ప్రదేశంలో విధి నిర్వహణలు

అశ్వారావుపేట ప్రభుత్వ వైద్యశాల నందు ఓ ఇద్దరూ స్టాఫ్ నర్సులు ఓ స్లీపర్ ఓ ఫార్మర్ సి తో పాటు ఎక్సరే సిబ్బందిని సైతం బదిలీ జరిగితే మరల జిల్లా అధికారులతో ఒప్పందం కుదుర్చుకొని అట్టి ప్రదేశంలో విధినిర్మాణంలో కొనసాగిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. నిజానికి వీరు సుమారు ఎనిమిది సంవత్సరాలుగా ఒక చాటే ఇది నిర్వహణలు కొనసాగిస్తున్నారంటే వారికి సహకరిస్తున్న అధికారులు ఎంతటి వారు ప్రజలకే అర్థమయ్యే పరిస్థితి కనిపించట్లేదు! నిజానికి ఏ భారత రాజ్యాంగం సెక్షన్ లో కూడా ఒకే చోట ఎనిమిది సంవత్సరాలుగా విధి నిర్వహణ కొనసాగించే విధానం లేనప్పటికీ వీరు విధులు నుండి ఎందుకు వెళ్ళటానికి నిరాకరిస్తున్నారు? ఆ దేవుడికే ఎరుకంటూ భారీగా విమర్శలు లేవనెత్తుతున్నాయి.

పాత సానిటరీ విధానమే మేలు అంటున్న ప్రజానీకం

పట్టణంలో ఉన్న ఆరోగ్య కేంద్రంలో సానిటరీ విధానంలో పాత వ్యక్తులే ప్రజలకు సేవలు చేసే విధంగా పనిచేశారని అప్పట్లో ఎలాంటి విభేదాలు కూడా చోటు చేసుకునే విధానం లేదని ఆసుపత్రి నందు ఎవరైనా అనారోగ్యంతో ఉన్నవారు రావడంతో సేవలందించేందుకు మేము సైతం అంటూ సానిటరీ విభాగానికి చెందిన సిబ్బంది ముందుకు వచ్చేవారని ప్రస్తుత పరిస్థితులలో ఆ విధానం లేకుండా పోయిందని అయినప్పటికీ వీరికి ఉన్నత స్థాయి అధికారులు సహకారాలు అందించడం ప్రజలకు శాపంగా మారింది. అంటూ భారీగా విమర్శలు వినిపిస్తున్నాయి.

సేవలను గాలికి వదిలేసిన ఉద్యోగులు

ప్రభుత్వ వైద్యశాల అంటే అందరూ ఆశించే విధంగా వైద్యం అందిస్తారని ఆశతో దవాఖానకు చేరుకుంటే ప్రస్తుతం ఉన్న సిబ్బంది కేవలం ఏసి రూములకే అలవాటు పడి ఉంటున్నారే తప్ప ప్రమాదవశాత్తు ఏదైనా జరిగి వైద్యశాలకు వెళితే పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదని ఎంతమంది సిబ్బంది ఏ విధుల్లో కొనసాగుతున్నారో కేవలం కాగితాలకే తప్ప పనులు కనిపించారని ఎవరు ఎక్కడ కనిపిస్తారో! ఎవరు ఎక్కడ ఏసీ గదిలో ఉంటారు? ఎవరు ఎప్పుడు వస్తారు? ఎవరు ఎప్పుడు ఇంటికి వెళతారో! ఎవరు ఎప్పుడు సంతకాలు చేస్తారో! తెలియని పరిస్థితి హాస్పటల్ ఆవరణలో కనిపిస్తుందని భారీగా ప్రచారం కొనసాగుతుంది. కొందరైతే రికార్డులను సైతం ఇంటికి తీసుకువెళ్లి అక్కడే డైలీ రిజిస్టర్ సంతకాలు సౌకర్యాలని ఏర్పాటు చేసుకుంటున్నారని భారీగా విమర్శలు వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా జిల్లా కలెక్టర్ స్పందించి ప్రభుత్వ వైద్యం సేలపై ప్రత్యేక శ్రద్ధ చూపితేనే తప్ప లేకుంటే ప్రజలకు దవాఖాన ఓ యమ ఖానా లాగా కనిపిస్తుందని జిల్లా యంత్రాంగం స్పందించాలంటూ పట్టణవాసులు కోరుకుంటున్నారు.

యువత హామీలపై ప్రభుత్వాన్ని నిలదీసిన మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

- రెండు లక్షల ఉద్యోగాల హామీ ఏమైంది..?
- ఉద్యోగాల భర్తీపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- యువతను అవమానించే వ్యాఖ్యలు చేయడం సరికాదు
- ములుగులో బీఆర్ ఎస్ ఆధ్వర్యంలో యువత సమావేశం.

ప్రజా వాయిస్ ములుగు జిల్లా:/ ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని బీఆర్ఎస్ మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ విమర్శించారు. యువత సమస్యలపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యక్రమాల్లో భాగంగా బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ఆధ్వర్యంలో శనివారం ములుగు జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో యువత సమావేశం నిర్వహించారు. యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కోకిల మహేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి సుమారు 500 మంది యువత హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ..... ఎన్నికల ముందు యువత భవిష్యత్తును మారుస్తామని, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీలు ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, విద్యార్థుల సంక్షేమం, విదేశీ విద్యకు ఆర్థిక సహాయం వంటి హామీలను ఎన్నికల సమయంలో ప్రకటించి యువతను ఆకట్టుకున్నారని అన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఆ హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణను వెల్లడించడం లేదని విమర్శించారు.

రెండు లక్షల ఉద్యోగాల హామీపై సమాధానం చెప్పాలి:

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చిందని సత్యవతి రాథోడ్ గుర్తు చేశారు. ఆ హామీ అమలు పరిస్థితిపై ప్రభుత్వం యువతకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో ఎన్ని ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చారు, ఎన్ని పోస్టులు భర్తీ చేశారు, ఇంకా ఎన్ని ఖాళీలు ఉన్నాయి, ఎన్ని నియామక ప్రక్రియలు పెండింగ్‌లో ఉన్నాయి అనే పూర్తి వివరాలను ప్రజల ముందుంచి శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు.

యువత ఆత్మగౌరవాన్ని దెబ్బతీయొద్దు:

యువతను కించపరిచే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు చేస్తున్నారని సత్యవతి రాథోడ్ విమర్శించారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతను అవమానించడం కాకుండా వారికి ఉద్యోగాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు. తెలంగాణ యువత తమ ఆత్మగౌరవాన్ని ఎవరి రాజకీయ వ్యాఖ్యలకు తాకట్టు పెట్టదని, ప్రజాస్వామ్య పద్ధతిలో సమాధానం చెబుతుందని పేర్కొన్నారు. యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ములుగు అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా..?

మంత్రి సీతక్క ములుగు జిల్లా ప్రజలకు చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజల సమక్షంలో వివరించాలని సత్యవతి రాథోడ్ డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలోనే ములుగు జిల్లా అభివృద్ధి చెందిందని అన్నారు. వెయ్యి రోజుల్లో ఎంతో అభివృద్ధి చేశామని చెబుతున్న మంత్రి సీతక్క ప్రజల సమక్షంలో అభివృద్ధిపై చర్చకు సిద్ధం కావాలని సవాల్ విసిరారు. ములుగు జిల్లాకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, గత ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిపై ప్రజల ముందు వివరాలు ఉంచాలని కోరారు. ఈ సమావేశంలో ములుగు జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడే నాగజ్యోతి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్, తాటి కృష్ణ, భూక్య జంపన్న, చెన్న విజయ్, శ్రీనివాస్ రెడ్డి, బైకాని ఓదెలు, కోకిల లక్ష్మి, ఈర్ల వెంకన్న, పోరిక విజయ రామ నాయక్, గోవిందు రాజ కుమార్, మొర్రి రాజు యాదవ్, నరేంద్ర చారి, కామ అశోక్, జన్ను రాంబాబు, సురేష్, కిషోర్, ప్రశాంత్, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

కామన్‌పల్లి-ముకునూర్ రహదారిని అభివృద్ధి చేయాలి

- 8 కి.మీ. షార్ట్ కట్ మార్గంలో బస్సు వేయాలని విజ్ఞప్తి
- మేడారం, కాళేశ్వరం వెళ్లే భక్తులకు తగ్గనున్న దూరం

ప్రజా వాయిస్ పలిమెల జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండలంలోని కామన్‌పల్లి – ముకునూర్ రహదారిని తక్షణమే అభివృద్ధి చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం బస్సులు ఇతర గ్రామాల మీదుగా సుమారు 12 నుంచి 13 కిలోమీటర్లు చుట్టూ తిరిగి ముకునూర్ చేరుకుంటున్నాయి. అదే కామన్‌పల్లి నుండి ముకునూర్ మధ్య ఉన్న 8 కిలోమీటర్ల షార్ట్‌కట్ రహదారిని బాగుచేస్తే ప్రయాణ సమయంతో పాటు రవాణా భారమూ తగ్గుతుంది.ఈ మార్గాన్ని మేడారం రూట్‌కు అనుసంధానిస్తే ఏటూరునాగారం, మేడారం, మహాదేవపూర్, కాళేశ్వరం, పలిమెల ప్రాంతాల ప్రజలకు, భక్తులకు ఎంతగానో సౌకర్యంగా ఉంటుందని గ్రామస్థులు తెలిపారు. ప్రస్తుతం ఈ రహదారికి ఇరువైపులా పిచ్చిమొక్కలు, దట్టమైన పొదలు పెరిగి కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి దాపురించింది. సంబంధిత అధికారులు స్పందించి రహదారిని తక్షణమే పునరుద్ధరించి, బస్సు సౌకర్యం కల్పించాలని పలిమెల మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



నకిలీ సర్టిఫికేట్ లు తయారు చేస్తున్న నేరస్థుల అరెస్ట్

- మీ సేవ, ఇంటివద్ద దొంగ సర్టిఫికెట్ల తయారీ
- ఒక్కో నకిలీ సర్టిఫికెట్ కు 5,10 వేలు వసూలు
- నకిలీ సర్టిఫికెట్లను ఒరిజినల్ గా అందజేస్తున్నారు
- ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధికి సర్టిఫికెట్ల వాడకం
- నిజామాబాద్ పోలీస్ కమీషనర్ సాయి చైతన్య వెల్లడి

ప్రజా వాయిస్ నిజామాబాద్/నిజామాబాద్ జిల్లాలోని బోధన్ పట్టణం రాకాసిపేట్ లోని సహారా మీ సేవ కేంద్రం లో నకిలీ ప్రభుత్వ సర్టిఫికెట్లు తయారు చేస్తున్న ముఠాను అరెస్టు చేశామని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య వెల్లడించారు. నిజామాబాద్ సిసిఎస్ ఏసిపి శ్రీశైలం ,సిసిఎస్, బోధన్ పోలీస్ సిబ్బంది కలిసి, రాకాసిపేట్ పెద్ద మసీదు దగ్గర గల సహారా మీ సేవ కేంద్రంలో తనిఖీలు నిర్వహించారు.తనిఖీలో మీ సేవ ఆపరేటర్ షేక్ వసీమ్ తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే దురాశతో గత రెండు సంల నుండి మీ సేవ యజమాని మహమ్మద్ ముక్రమ్ , ఇతరులతో కలిసి తన మీ సేవ సెంటర్, ఇంటిదగ్గర నకిలీ మీ సేవ సర్టిఫికేట్ లు తయారు చేసి ఇస్తున్నాడని, అట్టి సర్టిఫికేట్ లపై సంబందిత రబ్బర్ స్టాంప్ లు వేసి ఒరిజినల్ సర్టిఫికేట్ ల అందజేస్తున్నారన్నారు. ఒక్కో సర్టిఫికెట్ కు రూ. 5,000/- నుండి రూ. 10,000/- వరకు వసూలు చేసి పంచుకునేవారు. అట్టి సర్టిఫికేట్లను తీసుకున్నవారు మోసపూరితముగా ప్రభుత్వము నుండి లబ్ది పొందుటకు నకిలీ సర్టిఫికేట్ లను ఉపయోగించినరని తెలిపారు నిందితులు షేక్ వసీమ్, తండ్రి షేక్ జామీల్, 32 ముస్లిం, వృత్తి మీసేవ ఆపరేటర్, నివాసం ఇ.నం. 1-1-674, రాకాసిపేట్, బోధన్,మహమ్మద్ ముక్రమ్, తండ్రి మహమ్మద్ ఆరిఫ్, 36, ముస్లిం, వ్యాపారం సహారా మీసేవ సెంటర్ యజమాని ఇ.నం. 1-2-120, రాకాసిపేట్, బోధన్ గా తెలిపారు.స్వాదినము చేసుకున్న వివరములు తయారు చేసిన నకిలీ మీసేవ సర్టిఫికేట్ లు-05, , ఇప్పటికే తయారు చేసి ఇచ్చిన నకిలీ మీసేవ జనన ధృవీకరణ జిరాక్స్ పత్రాలు -22 ,తయారు చేయడానికి ఉంచిన మీసేవ ఖాళీ ఒరిజినల్ సర్టిఫికేట్లు- 38రబ్బర్ స్టాంప్-01 తయారు చేసిన నకిలీ టి సి, బోనఫైడ్ లు-13 షాదీ ముబారక్ కు సంబంధించి తయారు చేసిన నకిలీ జిరాక్స్ కాపీలు-01 ,నకిలీ సర్టిఫికెట్ల తయారీకి ఉపయోగించిన హ్యెచ్ పి ల్యాప్‌టాప్ - 01 కేనన్ కలర్ ప్రింటర్ – 01 సెల్ ఫోన్ -02 పై పత్రాలను ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాదినము చేసుకొని, వారిపై చట్టప్రకారం కేసు నమోదు చేశామన్నారు. పరారీల్లో ఉన్న మిగతా వారిని త్వరలో అరెస్టు చేస్తామన్నారు. దర్యాప్తు లో సహకరించిన సిసిఎస్ సిబ్బంది సి ఐ అజయ్, ఎస్సై శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ రాములు కానిస్టేబుల్ అనిల్, గంగ ప్రసాద్, బోధన్ ఏసిపి శ్రీనివాస్, బోధన్ టౌన్ పోలీస్ సిబ్బంది వెంకట నారాయణ రామ్, కానిస్టేబుల్ గంగారం, శివ కృష్ణ లను అభినందించినారు.

సాఫిగా గ్రామాలకు తాగునీటి సరఫరా

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- జోగంపల్లిలోని మిషన్ భగీరథ నీటి శుద్ధీకరణ ప్లాంటును పరిశీలించిన కలెక్టర్

ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి శాయంపేట మండలంలోని గ్రామాలకు తాగునీటి సరఫరాలో ఎక్కడ కూడా సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. శనివారం హనుమకొండ జిల్లా శాయంపేట మండలం జోగంపల్లిలోని మిషన్ భగీరథ తాగునీటి శుద్ధీకరణ ప్లాంట్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రా వాటర్ ఎక్కడినుండి వస్తుందని, నీటి సరఫరా పరిస్థితి ఎలా ఉందని, పంపుల పనితీరు, క్లోరినేషన్, ఇన్ట్రా డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థ, పంపింగ్ తీరు తదితర అంశాలను సంబంధిత అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.శాయంపేట మండలంలోని 26 గ్రామాలకు రోజుకు ప్రస్తుతం సుమారు 5.35 ఎమ్ఎల్డీ నీటిని సరఫరా చేస్తున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు.నీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన అన్ని పంపులు పని చేసే స్థితిలో ఉన్నాయా, ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తినప్పుడు వెంటనే వినియోగించేందుకు స్టాండ్‌బై పంపులు, ప్రత్యామ్నాయ పరికరాలు అందుబాటులో ఉన్నాయా అని కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ★ ప్రజలకు సురక్షిత మైన తాగునీరు నిరంతరాయంగా అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. నీటి సరఫరా వ్యవస్థలో ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వాటిని వెంటనే గుర్తించి పరిష్కరించాలని, ప్రత్యామ్నాయ నీటి వనరులు, అదనంగా పరికరాలను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచాలని సూచించారు.ప్రజలకు తాగునీటి విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని పేర్కొన్నారు. అదేవిధంగా పరకాల లోని చలి వాగు కు సంబంధించిన చెక్ డ్యామ్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. చెక్ డ్యామ్ ద్వారా వరద నీరు సాఫీగా వెళ్లే విధంగా చేపట్టనున్న మరమ్మతు పనుల గురించి వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ ఇంట్రా ఆర్డబ్ల్యూఎస్ ఈఈ గాయత్రి, వాటర్ గ్రిడ్ ఈఈ సురేందర్, సాగునీటిపారుదల శాఖ ఈఈ సునీత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్ మీ చేతుల్లోనే!

- ఉపాధ్యాయులు దేశానికి దిక్సూచిగా నిలిచేలా విద్యార్థులను తీర్చిదిద్దాలి
- సీఎం రేవంత్ రెడ్డి
- టీచర్లు రోడ్డెక్కొద్దు.. రెండేళ్లు సమయం ఇవ్వండి
- పీఆర్సీ సహా ఉపాధ్యాయుల సమస్యలను ఆర్థిక వెసులుబాటును బట్టి పరిష్కరిస్తా
- ఉపాధ్యాయులకు హామీ ఇచ్చిన సీఎం రేవంత్

ప్రజా వాయిస్/వికారాబాద్ జిల్లా బ్యూరో: తెలంగాణ విద్యార్థులను దేశాభివృద్ధికి దిక్సూచిగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో సీఎం పాల్గొని 123 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేశారు. అనంతరం ఫొటో ఎగ్జిబిషన్‌ను సందర్శించి, రాధాకృష్ణన్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు.ప్రభుత్వ పాఠశాలల్లో పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులే అధికంగా ఉంటారని, వారికి నాణ్యమైన విద్య అందించి ఉన్నత స్థాయికి తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. రాష్ట్ర విద్యా ర్యాంకింగ్ గతంలో 28వ స్థానంలో ఉండగా ప్రజా ప్రభుత్వం వచ్చాక 17వ స్థానానికి చేరిందని, రెండేళ్లలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 88 వేలు పెరిగిందని తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో 95 శాతం అడ్మిషన్లు జరిగాయని, సాంకేతిక విద్యను బలోపేతం చేస్తున్నామని చెప్పారు.ఉపాధ్యాయులు రోడ్డెక్కాల్సిన అవసరం లేదని, వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. 55 రోజుల్లో డీఎస్సీ ద్వారా 10,006 ఉపాధ్యాయ పోస్టులు, 25,950 మంది ఉపాధ్యాయుల ప్రమోషన్లు, 34,706 మంది బదిలీలను పారదర్శకంగా చేపట్టామని వివరించారు. 317 జీవో సమస్యను పరిష్కరించడంతో పాటు విద్యా కమిషన్ ఏర్పాటు చేశామని, కే. కేశవరావును విద్యా సలహాదారుగా నియమించామని తెలిపారు. పీఆర్సీ సహా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రెండేళ్ల సమయం ఇవ్వాలని కోరారు.గత ప్రభుత్వం రూ.8.11 లక్షల కోట్ల అప్పులు చేసి వెళ్లిందని సీఎం విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం ప్రజా ప్రభుత్వం 90 రోజుల్లో రూ.6 వేల కోట్లు చెల్లించిందని, ప్రతి నెల బకాయిల విడుదలకు రూ.వెయ్యి కోట్లు కేటాయిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ ఖర్చుతో ఉపాధ్యాయులను విదేశాలకు పంపి విద్యా విధానాలను అధ్యయనం చేయిస్తున్నామని పేర్కొన్నారు.రాజకీయ నాయకుల ఉచ్చులో పడకుండా ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తుపై దృష్టి పెట్టాలని సూచించారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ప్రభుత్వ విద్యను బలోపేతం చేసి, ఆ తర్వాత విద్యార్థులకు నైపుణ్యాలను అందించడమే లక్ష్యమన్నారు. ఐటీఐలను ఏటీసీలుగా, పాలిటెక్నిక్ కళాశాలను స్కిల్ యూనివర్సిటీలుగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు.మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ సమసమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, ప్రభుత్వ పారదర్శక విధానాలతో విద్యార్థుల చేరికలు పెరిగాయని తెలిపారు. ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యేలు బి. మనోహర్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, విద్యాశాఖ ఉన్నతాధికారులు, కలెక్టర్ దీపక్ తివారి, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉత్తమ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందిస్తాం

- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

(ప్రజా వాయిస్ షాద్‌నగర్) అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు అందించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం కొత్తూరు మున్సిపాలిటీ కార్యాలయంలో కొత్తూరు మండల లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని లబ్ధిదారులకు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందించడంతో పాటు అవసరమైన కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశారని గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు అందించే కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో రేషన్ ద్వారా అందించే బియ్యం నాణ్యత సరిగా లేక పేద ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఎమ్మెల్యే విమర్శించారు. గల్లీగల్లీలో దళారులు ఆటోల్లో వచ్చి పేదల వద్ద నుంచి బియ్యాన్ని కొనుగోలు చేసేవారని, అనంతరం రైస్ మిల్లర్లు ఆ బియ్యాన్ని కొనుగోలు చేసి పాలిష్ చేసి తిరిగి మార్కెట్‌లో విక్రయించేవారని ఆరోపించారు. ప్రజలకు నాణ్యమైన బియ్యం అందించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వీర్లపల్లి శంకర్ తెలిపారు. ఇంకా రేషన్ కార్డులు పొందని అర్హులైన కుటుంబాలకు కూడా కార్డులు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రజలకు మరింత పారదర్శకంగా, సులభంగా సేవలు అందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్, కొత్తూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శేఖర్ రెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, నందిగామ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కుమారస్వామి గౌడ్, నాయకులు నర్సప్పగూడ క్రిష్ణ, అగీర్ రవికుమార్ గుప్తా, కొత్తూరు తహసీల్దార్ మసూద బేగం, మున్సిపల్ కమిషనర్ సాహితీ రెడ్డి, సర్పంచులు దయాసంద్, శ్రీరాములు, గోవిందు, విష్ణు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

ఫీజు రీయింబర్స్మెంట్ బకాయి చెల్లించడంలో ప్రభుత్వం విఫలం

- జోగిపేటలో టిఆర్ఎస్ వీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ
- మాజీ ఎమ్మెల్యేక్రాంతి కిరణ్

ప్రజా వాయిస్ జోగిపేట (సంగారెడ్డి) అధికారంలోకొచ్చి మూడు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించవలసిన ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు ఇంతవరకు చెల్లించలేదని అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ఆరోపించారు. రాష్ట్ర కమిటీ మేరకు శనివారం వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన.. ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంపై వారం రోజుల పాటు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. అందులో భాగంగానే శనివారం బి ఆర్ ఎస్ వీ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా నుంచి గుర్రం బొమ్మ వరకు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రాంతి కిరణ్ మాట్లాడుతూ బి ఆర్ ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా రాష్ట్ర ఖజానా అప్పుల్లో ఉన్న విద్యార్థుల కోసం ఫీజు బకాయిలను ఎప్పటికప్పుడు చెల్లించిన విషయాన్ని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థుల సమస్యలను ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. విద్యార్థులకు చెల్లించవలసిన ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలతో పాటు హాస్టల్ విద్యార్థులకు కాస్మెటిక్ ఛార్జీలు సకాలంలో చెల్లించడం లేదన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సంగారెడ్డి జిల్లా జోగిపేటలో మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బీఆర్ఎస్.వీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన విద్యార్థులతో కలిసి కదం తొక్కారు.విద్యార్థులు, బీఆర్ఎస్.వీ కార్యకర్తలతో కలిసి మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ భారీ ర్యాలీ మరియు మానవహారంలో పాల్గొన్నారు ప్రభుత్వం సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడం వల్ల పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని చంటి క్రాంతి కిరణ్ ఆరోపించారు.రాష్ట్రంలోని హాస్టళ్లలో కనీస సౌకర్యాలు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ఇదే విధంగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని బీఆర్ఎస్వీ నేతలు హెచ్చరించారు.ఈ సందర్భంగా పలువురు విద్యార్థినిలు సీఎం రేవంత్ రెడ్డి పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

గజ్వేల్ ప్రజలకు అందుబాటులో ఉండని కేసీఆర్

- ఎమ్మెల్యేగా కొనసాగే నైతిక హక్కు ఆయనకు లేదు
- కేబినెట్ ర్యాంకు హోదాతో కెసిఆర్ కు రూ 24 ప్రభుత్వ ఖజానా ఖర్చు
- బంధువుల కార్యక్రమాలకు వెళ్తూ ఇక్కడి ప్రజల పట్ల నిర్లక్ష్యం దురదృష్టకరం
- గజ్వేల్ లో కేసీఆర్ దిష్టి బొమ్మ దగ్ధం చేసిన కాంగ్రెస్ శ్రేణులు

ప్రజా వాయిస్ గజ్వేల్ : కేబినెట్ ర్యాంకు హోదాతో గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ కు ప్రభుత్వం ఇప్పటి వరకు రూ 24 కోట్లు ఖర్చు చేయగా, మూడేండ్లలో మూడు సార్లు కూడా ఆయన గజ్వేల్ ప్రజల మధ్యకు రాలేదని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తూంకుంట అంజన్‌రెడ్డి, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గజ్వేల్ పట్టణంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు స్థానిక ఎమ్మెల్యే కేసీఆర్ దిష్టిబొమ్మను ఊరేగించి అంబేద్కర్ చౌరస్తాలో దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎన్నో ఆశలతో కేసీఆర్ ను గజ్వేల్ ప్రజలు గెలిపిస్తే వారిని నట్టేట ముంచినట్లు విమర్శించారు. బంధువుల ఇంటికి, పార్టీ నేతల ఇండ్లకు వెళ్తున్న కెసిఆర్ ప్రజల మధ్యకు మాత్రం రావడం లేదని ఎద్దేవా చేశారు. దీంతో గజ్వేల్ అభివృద్ధి ఎక్కడి కక్కడే నిలిచిపోగా, పేదల సమస్యలు తీరడం కష్టంగా మారిందని తెలిపారు. అయితే ఎమ్మెల్యే కోసం నిర్మించిన క్యాంపు కార్యాలయానికి ఇప్పటి వరకు ఆయన అడుగు పెట్టకపోగా, అనామకుల అడ్డాగా మారి మందు పార్టీలు జరుగుతున్నట్లు ఆరోపించారు. ప్రభుత్వ పథకాల వర్తింపులో ప్రోటోకాల్ పరంగా కష్టంగా మారిందని, దీంతో సరైన సమయంలో లబ్ధిదారులకు పథకాలు అందలేకపోతున్నట్లు విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో వారానికి ఒకసారి గజ్వేల్‌లో సమావేశం నిర్వహించి సమస్యలను పరిష్కరిస్తానని కేసీఆర్ హామీ ఇవ్వగా, ఆ హామీ అమలుకు నోచుకోకపోవడంతో పాటు ప్రస్తుతం ఫాంహౌజ్ కే పరిమితమైనట్లు గుర్తు చేశారు. ఇంటి కష్టాలు, అనారోగ్య సమస్యలు వెంటాడుతున్న కెసిఆర్ ఇక ప్రజల మధ్యకు రావడం కష్టమేనని, దీనిని దృష్టిలో పెట్టుకొని ఆయన వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాగా తాము ఎర్రవల్లి ఫాంహౌజ్ వద్ద కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి వెళ్లి స్వాగతం పలికినప్పటికీ స్పందన కరువైందని, ప్రభుత్వ జీతభత్యాలు పొందుతూ ఎంజాయ్ చేయడం ఆయన వంతైందని చెప్పారు. అవినీతి అక్రమాలతో రూ లక్ష కోట్లు కూడబెట్టిన కేసీఆర్ వాటిని కాపాడుకోవడానికి పరిమితం కాగా, కెసిఆర్ స్పందించని పక్షంలో నియోజకవర్గంలో నిరసన ర్యాలీలు చేపడతామని వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

'మాస్' ఎంకన్న అరాచక దందాపై విచారణ ఎప్పుడు

- ఎపిసోడ్- 2 అక్రమార్కులకు అండగా అధికార పార్టీ మాజీ జడ్పీటీసీ అనే గుస గుసలు వినిపిస్తున్నాయి
- మధ్యవర్తులకు లక్షలు, బాధితులకు చుక్కలు
- అడిగితే ఇప్పుడు, అప్పుడు అంటూ దాటి వేసే వైనం

ప్రజా వాయిస్ - తాండూరు / బెల్లంపల్లి:అధికారాన్ని అడ్డంపెట్టుకుని అమాయకుల ఆస్తులతో చెలగాటమాడుతున్న కిరాతక మూకల ఆట కట్టించే సమయం ఆసన్నమైంది! కరీంనగర్ నుంచి మానకొండూరు మీదుగా తాండూరు వరకు సాగుతున్న 'మాస్ ఎంకన్న' ల్యాండ్ సెటిల్మెంట్లు, కబ్జా దందాలు ఇప్పుడు ఉమ్మడి జిల్లాలో తీవ్ర సంచలనం సృష్టిస్తున్నాయి. నమ్మకం గొలిపేలా బాండ్ పేపర్లు, బురిడీ కొట్టించే బ్యాంక్ చెక్కులతో నిరుపేదల పొట్ట కొడుతున్న ఈ ముఠా అరాచకాలకు తెరదించేందుకు ప్రజలు తిరగబడుతున్నారు. బాధితులకు ముందుగా నకిలీ బాండ్ పేపర్లు, చెక్కులు చేతిలో పెట్టి నమ్మించి, ఆపై లక్షలాది రూపాయలు కొల్లగొట్టిన ఘరానా మోసం. అధికార పార్టీ అండదండలు ఉన్నాయన్న అహంకారంతో సాగిస్తున్న దౌర్జన్యాలు, ప్రశ్నించే వారిపై బెదిరింపుల పర్వం. కష్టపడి సంపాదించుకున్న ఆస్తులను కోల్పోయి, అన్యాయాన్ని ఎక్కడ చెప్పుకోవాలో తెలియక దిక్కు తోచని స్థితిలో బాధితుల రోదనలు. బెల్లంపల్లి తాండూరు కి చెందిన మాస వెంకన్న అనే వ్యక్తి మానుకొండూరు కి సంబందించిన కొందరు వ్యక్తులకు భూమి అమ్ము తాము అని చెప్పి నకిలీ పాత్రలను చూపి అమాయకుల ను మోసం చేశారని బాధితులు వాపోతున్నారు. అడిగిన ప్రతిసారీ ఏదో ఒకరీ పేరు చెప్పి భయపడుతున్నారు, గట్టిగా అడిగితే ఏదైనా చేసుకోండి అని అంటున్నాడు. మేము అతని చేతిలో డబ్బులు పెట్టి నరకం చూస్తున్నాము. కనీసం మా డబ్బులు ఐన మాకు ఇవ్వాలంటూ బాధితులు ఆవేదన వ్యక్తంచేశారు. ఇవన్నీ జరుగుతున్న ఈ విషయాలను అధికారులు ఎందుకు పట్టించు కొకపోవడం లేదని ప్రజలు నిలదీస్తున్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, అక్రమ సంపాదనతో రాజ్యమేలుతున్న ఈ నకిలీ నాయకులను అరికట్టాలని బాధితులకు న్యాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

80 దళిత కుటుంబాలకు ప్రభుత్వం న్యాయం చేయాలి

- అందోల్ ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నా
- పట్టాపాసు పుస్తకాలు జారిచేసి ప్రభుత్వం న్యాయం చేయాలి

ప్రజా వాయిస్, జోగిపేట (సంగారెడ్డి): నాటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ దళితుల జీవనో పాది కోసం భూమిని పంపిణీ చేస్తే నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దళితులకు ఇచ్చిన 1141వ సర్వే నెంబర్ను బ్లాక్ లో పెట్టి దళితుల మోసం చేస్తున్నారంటూ గ్రామానికి చెందిన దళిత కుటుంబాల మహిళలు పెద్ద ఎత్తున జోగిపేట తహసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఎమ్మార్వో గారికి రైతుల పక్షాన వినతిపత్రం ఇవ్వడం జరిగింది.ఈ ఈ సందర్భంగా క్రమానికి చెందిన దళిత నాయకులు మాట్లాడుతూ సర్వే నెంబర్ 1141లో ఆనాడు అంటే 2005సంవత్సరంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయంలో దేశ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ గారి చేతుల మీదుగా ఆనాడు 80కుటుంబాలకు పట్టాల సర్టిఫికెట్ ఇవ్వడం జరిగింది. ఆనాడుగా ఆరుతడి పంటలు సాగుచేసుకొని, రైతులు జీవనం సాగిస్తున్నారు.ఇప్పటికి ప్రభుత్వాలు పట్టా పాసుబుక్ లు రైతులకు జారీ చేయకుండా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారు. ఇట్టి విషయంలో అందోల్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న వైద్య ఆరోగ్యాశాఖ మంత్రి దామోదర రాజనరసింహ గారు ఎన్నికల సమయంలో స్వయంగా అందోల్ గ్రామంలో అందరి సమక్షంలో రైతులకు పట్టాలు ఇప్పించే బాధ్యతలు నాది అని హామీ ఇవ్వడం జరిగింది.హామీ ఇచ్చి దాదాపు సంపత్సరాలు గడుస్తున్నా, ఇంతవరకు న్యాయం చేయలేక పోయారు ఇప్పటికైనా మంత్రి రైతులకు పట్టపాసు పుస్తకాలు ఇప్పించి న్యాయం చేయాలనీ ఎమ్మార్వోఎస్ తరపున విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ అధికారులు కూడా రైతులకు పట్టపాసు పుస్తకాలు ఇప్పించే విషయంలో సహకరించి న్యాయం చేయాలనీ విజ్ఞప్తి చేస్తున్నాం. లేనిపక్షంలో మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు రైతుల పక్షాన న్యాయం కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉంటామని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాం. ఈ కార్యక్రమంలోగంధగల్ల వీరయ్య మాదిగ ఎమ్మెస్పీ జిల్లా నాయకులు,పుర్ర సంతోష్ మాదిగ అందోల్ నియోజకవర్గ ఇంచార్జి,పెద్దమదిగా అశోక్,వట్పల్లి మండల అధ్యక్షులు,భాంధవ్,తుడుం రాములు మాదిగ,మహేష్,రాకేష్, జ్ఞానమ్మ,రాజు,రవి, బాధిత రైతులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

- ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేయాలి
- విద్యార్థినులకు స్కూటీల హామీ ఏమైంది.?
- నిరుద్యోగులకు ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలి
- ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తాం
- మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

ప్రజా వాయిస్,కోదాడ: విద్యార్థులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ డిమాండ్ చేశారు. విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం కోదాడలో ధర్నా నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లోని గాంధీ విగ్రహం నుంచి రంగా థియేటర్ వరకు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో విద్యార్థినులకు స్కూటీలు ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని, అధికారం లోకి వచ్చిన తర్వాత ఆ హామీని పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు, కళాశాలల యాజమాన్యాలు ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. చదువు పూర్తయినప్పటికీ సర్టిఫికెట్లు పొందలేని పరిస్థితి ఉందన్నారు. బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు.

గురుకులాల్లో వసతులు మెరుగుపరచాలి

సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కలుషిత ఆహారం కారణంగా విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారని, వారి భద్రతపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. టెండర్ల ప్రక్రియను త్వరగా పూర్తి చేసి విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలన్నారు.

ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలి

నిరుద్యోగులకు కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందని మల్లయ్యయాదవ్ ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన నియామక ప్రక్రియకు సంబంధించిన నియామకాలను ప్రస్తుత ప్రభుత్వం తన ఘనతగా ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు. పెండింగ్ నోటిఫికేషన్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం ఇప్పటికైనా విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై స్పందించాలని కోరారు. హామీలను అమలు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని మల్లయ్యయాదవ్ హెచ్చరించారు.

కేసీఆర్ ఫాంహౌజ్ వీడి అసెంబ్లీకి రావాలి

- నమ్మి ఓట్లేసిన గజ్వేల్ ప్రజల సమస్యలు పరిష్కరించు
- కేటీఆర్ గత చరిత్ర తెలుసుకొని మాట్లాడు
- సోనియా తెలంగాణ ఇవ్వకుంటే మీ గతి ఏమిటి
- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, సీనియర్ నేత వి హనుమంతరావు

ప్రజా వాయిస్ గజ్వేల్ : కెసిఆర్ ఎర్రవల్లి ఫాంహౌజ్ వీడి అసెంబ్లీకి రావాలని, నమ్మి ఓట్లేసిన గజ్వేల్ ప్రజల సమస్యలు తీర్చాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హనుమంత రావు స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు తూంకుంట అంక్షారెడ్డి ఆధ్వర్యంలో గజ్వేల్ లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సంబరాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేసి వెలుగు నింపుతుండగా, మరింత రాష్ట్ర అభివృద్ధి కోసం తగు సూచనలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీని దేవత అన్న కెసిఆర్ కాళ్లు మొక్కి నక్క వినయం నటించగా, ప్రస్తుతం రాజకీయ లబ్ది కోసం కాంగ్రెస్‌పై విమర్శలు చేస్తున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే కాంగ్రెస్ పై విమర్శలు చేసే ముందు కేటీఆర్ గత చరిత్ర తెలుసుకోవాలని హితవు పలకగా, చంద్రబాబు, కెసిఆర్ లాంటి వ్యక్తులకు కాంగ్రెస్ రాజకీయ బిక్ష పెట్టిందని గుర్తు చేశారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు సమయంలో సోనియాగాంధీని దేవతగా అభివర్ణించిన కేసీఆర్ కుటుంబం ఇప్పుడు వారిపైనే విమర్శలు చేయడం రాజకీయ దిగజారుడు తనానికి నిదర్శనమని మండిపడ్డారు. రాజకీయ పరిణతి సాధించని కేటీఆర్ తన పద్దతి, వ్యవహార శైలి మార్చుకోవాలని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. గజ్వేల్ ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన కేసీఆర్ దర్శనం కష్టంగా మారిందని, ప్రభుత్వ జీతభత్యాలు పొందుతున్న ఆయన ముఖం చాటేస్తే ప్రజలు ఊరుకోరని హెచ్చరించారు. ఇక్కడి ప్రజల సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీలో కొట్లాడి నిధులు సాధించాలని, అయితే ఇవ్వడానికి సీఎం రేవంత్ రెడ్డి సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలన కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనతో ప్రజలు బెరీజు వేసుకొని హర్షం వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా అయోధ్య రాముడుతో రాజకీయం చేస్తున్న బిజెపి సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటన అడ్డుకొని తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్నట్లు ఎద్దేవా చేశారు. పెట్టుబడులు సాధించడానికి ఆయన విదేశీ పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తుంటే రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం చూసి ఓర్వలేక బీఆర్ఎస్, బీజేపీ నేతలు కారుకూతలు కూస్తున్నట్లు విమర్శించారు. రాజకీయ కోసం రాష్ట్ర ప్రయోజనాలు అడ్డుకోవడం సరికాదని పేర్కొంటూ కేంద్ర నిధులు సాధించాల్సిన ఇక్కడి బిజెపి మంత్రులు, ఎంపీలు ఫీజు రీయింబర్స్‌మెంట్ పేరిట దీక్షలు చేయడం ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నమే అవుతుందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ చరిత్రను ఎవరూ చెరిపేయలేరని, దేశ రాజకీయాల్లో కాంగ్రెస్ పాత్రను తక్కువ చేసి చూపించే ప్రయత్నాలు ఎప్పటికీ ఫలించవని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో 10 ఏళ్ల పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, డిసిసిబి చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్ రెడ్డి, భూంరెడ్డి ఏఎంసీ చైర్మన్లు నరేందర్‌రెడ్డి, విరుపాక శ్రీనివాస్‌రెడ్డి, విజయ మోహన్, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, పీసీసీ నాయకులు నాయిని యాదగిరి నియోజకవర్గ కాంగ్రెస్ కమిటీ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి, మండలాల సర్పంచుల ఫోరం అధ్యక్షులు అశోక్ రెడ్డి, వెంకటేష్ ముదిరాజ్, మండలాల బాధ్యులు సుఖేందర్ రెడ్డి, అశోక్, నరసింహారెడ్డి, రవీందర్ రెడ్డి మైనార్టీ నాయకులు మతీన్ సమీర్, తదితరులు పాల్గొన్నారు.

కాళోజీ హెల్త్ యూనివర్సిటీలో ఎంబీబీఎస్ విద్యార్థుల అవస్థలు!

ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి
వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయంలో ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ పాసైన విద్యార్థులకు సర్టిఫికెట్ల జారీలో తీవ్ర జాప్యం.స్లాట్ బుక్ చేసుకుని, శనివారం అపాయింట్మెంట్ రావడంతో పూణే, బెంగళూరు, ముంబై తదితర ప్రాంతాల నుండి సుమారు 200 మంది విద్యార్థులు, తల్లిదండ్రులు ఉదయం 9 గంటలకే యూనివర్సిటీకి చేరుకున్నారు.సంతకం కాలేదనే సాకుతో ఉదయం నుండి (దాదాపు 12 గంటలు) విద్యార్థులను కార్యాలయం చుట్టూ తిప్పించడంతో తీవ్ర నిరసన వ్యక్తమైంది.సిబ్బంది కొరత ఉందని, కేవలం నలుగురు స్టాఫ్‌తోనే పనులు చూసుకోవాల్సి వస్తోందని అధికారులు చేతులెత్తేశారు.ఇంత పెద్ద యూనివర్సిటీలో ఇలాంటి నిర్లక్ష్యం సరికాదని, దూర ప్రాంతాల నుండి వచ్చిన వారికి త్వరగా సర్టిఫికెట్లు ఇచ్చి సౌకర్యాలు కల్పించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

విజిబుల్ పోలీసింగ్ టెక్నాలజీతో నేరాలు నియంత్రించాలి

- పెండింగ్ కేసులు దర్యాప్తు వేగవంతం చేయాలి
- గణేష్ పండుగకు ముందస్తు చర్యలు చేపట్టాలి
- దోమకొండ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర

ప్రజా వాయిస్ దోమకొండ/విజిబుల్ పోలీసింగ్ చర్యలతో పాటు సాంకేతిక పరిజ్ఞానంతో నేరాలను నియంత్రించాలని కామారెడ్డి జిల్లా ఎస్పీ ఎం రాజేష్ చంద్ర సూచించారువార్షిక తనిఖీల్లో భాగంగా దోమకొండ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. జిల్లా ఎస్పీ ప్రతిరోజూ అధికారులకు తెలియజేస్తున్న సూచనలు, అంశాలు సిబ్బందికి చేరుతున్నాయా లేదా అనే విషయాన్ని స్వయంగా సిబ్బందిని ప్రశ్నించి తెలుసుకున్నారు. ప్రజలతో వ్యవహరించే విధానం, ఫిర్యాదులపై స్పందన, నేర నియంత్రణ చర్యలు, స్టేషన్‌లో విధుల నిర్వహణ తదితర అంశాలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.పోలీస్ స్టేషన్‌లోని పరిసరాల పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, కేసుల దర్యాప్తు పురోగతి, సిబ్బంది పనితీరు, నేర నియంత్రణ చర్యలను సమీక్షించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుని సమస్యను పూర్తిగా విని, సత్వర స్పందన అందిస్తూ చట్టపరమైన పరిష్కారం చూపాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన పోలీస్ సేవలు అందించడం ద్వారా పోలీస్ శాఖపై ప్రజల్లో మరింత నమ్మకాన్నీ పెంపొందించాలన్నారు.దోమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదవుతున్న నేరాల తీరుతో పాటు పెండింగ్ కేసులు, గ్రేవ్ కేసులు, రౌడీ షీట్లు, సస్పెక్ట్ షీట్లు, బైండోవర్ కేసులు, వారెంట్ల అమలు, బీట్ వ్యవస్థ తదితర అంశాలపై ఎస్పీ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా గ్రేవ్ కేసుల్లో నాణ్యమైన దర్యాప్తుతో పాటు సాంకేతిక ఆధారాల సేకరణ, సాక్ష్యాల పరిరక్షణ, సాక్షుల వివరాల నమోదు వంటి అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులు బాధితుల సమస్యలను సున్నితంగా పరిష్కరించాలని, మహిళలు, బాలలపై నేరాల విషయంలో ఎస్ఓపి ప్రకారం నాణ్యమైన దర్యాప్తు చేపట్టి నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలన్నారు.సమస్యాత్మక ప్రాంతాలు, నేరాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి పెట్రోలింగ్, బీట్ వ్యవస్థను మరింత పటిష్టంగా అమలు చేయాలని, రాత్రి వేళల్లో గస్తీని సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నిర్మూలన, ట్రాఫిక్ నియమాలు, మహిళలు బాలల భద్రతపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు ప్రాముఖ్యతను ప్రజలకు వివరించాలని సూచించారు.రాబోయే గణేష్ పండుగను పురస్కరించుకుని ముందస్తు ప్రణాళిక రూపొందించి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ సూచించారు. పోలీస్ స్టేషన్‌లోని అన్ని రికార్డులు, రిజిస్టర్లను ఎప్పటికప్పుడు నవీకరించి శాఖా నిబంధనల ప్రకారం పక్కాగా నిర్వహించాలని, స్టేషన్ హౌస్ ఆఫీసర్ సిబ్బంది పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి డీఎస్పీ మధుసూదన్, భిక్నూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ నరేశ్, దోమకొండ ఎస్ఐ ప్రభాకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పుల్గర్‌చర్ల గ్రామాలో వెంకటేశ్వర స్వామి ఆలయ ముఖద్వార గడప ప్రతిష్ఠ

- పుట్టిన గడ్డపై మమకారంతో సేవా బాటలో శ్రీనివాసులు సోదరులు
- తల్లిదండ్రులు, నానమ్మ-తాతల జ్ఞాపకార్థం కళ్యాణ మండపం నిర్మాణానికి శ్రీకారం
- పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఉచితంగా కల్యాణ మండపం సేవలు
- శ్రీ వెంకటేశ్వర్ల దేవాలయం గడప ప్రతిష్ట సర్పంచ్ బత్తుల బాలరాజు

ప్రజా వాయిస్.. వనపర్తి పుట్టిన ఊరంటే ప్రతి ఒక్కరికీ ప్రత్యేకమైన అనుబంధం ఉంటుంది. జీవన ప్రయాణంలో ఎక్కడికి వెళ్లినా, ఎన్ని విజయాలు సాధించినా, తాను పుట్టి పెరిగిన నేలను మరచిపోకుండా స్వగ్రామానికి ఏదైనా చేయాలనే తపన కొందరిలో మాత్రమే కనిపిస్తుంది. అలాంటి సేవా భావంతో స్వగ్రామానికి శాశ్వతమైన గుర్తుగా నిలిచే కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారు వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం పుల్గర్‌చర్ల గ్రామానికి చెందిన పోవానపు జంగం శ్రీనివాసులు, ఆయన సోదరులు. వ్యాపార రంగంలో కష్టపడి ఎదుగుతూనే తమ మూలాలను మరచిపోకుండా గ్రామాభివృద్ధి, ప్రజా సేవకు తమ వంతు సహకారం అందిస్తున్నారు.తల్లిదండ్రులు, నానమ్మ—తాతల జ్ఞాపకార్థం పుల్గర్‌చర్ల గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం సమీపంలో కళ్యాణ మండపాన్ని నిర్మించేందుకు ముందుకు వచ్చారు. గ్రామ ప్రజలందరికీ ఈ మండపాన్ని ఉచితంగా వినియోగించుకునే అవకాశం కల్పించాలన్నది వారి ప్రధాన సంకల్పంగా పేర్కొన్నారు.

వేదమంత్రాల నడుమ గడప ప్రతిష్ఠ:

పుల్గర్‌చర్ల గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద గడప ప్రతిష్ఠ కార్యక్రమాన్ని శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.వేదమంత్రాల నడుమ, గ్రామస్థుల సమక్షంలో ఆలయ ముఖద్వార గడప ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి పోవానపు జంగం శ్రీనివాసులు, ఆయన సోదరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆలయంలో జరుగుతున్న వివాహాలు, ఇతర శుభకార్యాల సమయంలో గ్రామస్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను శ్రీనివాసులు ప్రస్తావించారు. సరైన సౌకర్యాలు లేక టెంట్లు ఏర్పాటు చేసుకుని కార్యక్రమాలు నిర్వహించాల్సి వస్తున్న పరిస్థితిని గమనించిన ఆయన, గ్రామానికి శాశ్వతమైన కళ్యాణ మండపం అవసరమని భావించినట్లు తెలిపారు.గ్రామ ప్రజలకు ఉపయోగపడేలా, ఎలాంటి ఆర్థిక భారం లేకుండా వివాహాలు, శుభకార్యాలు నిర్వహించుకునే అవకాశం కల్పించాలన్న ఉద్దేశంతో కళ్యాణ మండప నిర్మాణానికి ముందుకు వచ్చినట్లు వెల్లడించారు. సేవా భావంతో ముందుకు వచ్చిన సోదరులు పోవానపు జంగం శ్రీనివాసులు మాట్లాడుతూ,,, పుట్టిన ఊరితో తనకు విడదీయరాని అనుబంధం ఉందన్నారు. తల్లిదండ్రులు, నానమ్మ తాతలు తమకు అందించిన విలువలను జీవితంలో కొనసాగించడమే వారికి అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.గ్రామంలో ఎవరైనా వివాహం లేదా ఇతర శుభకార్యం నిర్వహించుకోవాలనుకుంటే కుల, మత, ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా అందరికీ సమానంగా కళ్యాణ మండప సేవలు అందించాలన్నదే తమ ఉద్దేశమన్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఈ సదుపాయం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. గ్రామానికి అవసరమైన సమయంలో తన వంతు సహాయం అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని శ్రీనివాసులు హామీ ఇచ్చారు. గ్రామ ప్రజలు తనను ఒక కుటుంబ సభ్యుడిగా భావించాలని, స్వగ్రామానికి సేవ చేయడం తన బాధ్యతగా భావిస్తానని అన్నారు. వ్యవసాయ కుటుంబం నుంచి వ్యాపార రంగం వరకు పుల్గర్‌చర్ల గ్రామానికి చెందిన పోవానపు మశన్న, గౌరమ్మ దంపతుల కుమారుడు పోవానపు బాలస్వామి. వ్యవసాయాన్ని వృత్తిగా చేసుకున్న బాలస్వామి, లక్ష్మీదేవమ్మ దంపతులకు ఏడుగురు సంతానం నలుగురు కుమార్తెలు, ముగ్గురు కుమారులు ఉన్నారు. ముగ్గురు కుమారుల్లో పెద్దవారు పోవానపు జంగం శ్రీనివాసులు కాగా, అలాగే మోహన్, శ్రీరామ్ ఉన్నారు. సాధారణ వ్యవసాయ కుటుంబంలో జన్మించిన ఈ అన్నదమ్ములు చిన్ననాటి నుంచే కష్టపడి పనిచేయడం, పట్టుదలతో ముందుకు సాగడం నేర్చుకున్నారు. కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో బాలస్వామి—లక్ష్మీదేవమ్మ దంపతులు కర్నూలుకు వలస వెళ్లి అక్కడ జీవనోపాధిని కొనసాగించారు.కుటుంబాన్ని పోషించేందుకు ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూనే పిల్లల భవిష్యత్తుకు బాటలు వేశారు.తల్లిదండ్రుల కష్టాలను దగ్గరగా చూసిన శ్రీనివాసులు, ఆయన సోదరులు జీవితంలో స్వయం కృషితో ఎదగాలనే సంకల్పంతో వ్యాపార రంగంలో అడుగుపెట్టారు.చిన్న వ్యాపారం నుంచి రియల్ ఎస్టేట్ వరకు శ్రీనివాసులు, ఆయన సోదరుల వ్యాపార ప్రస్థానం చిన్నస్థాయి కార్యకలాపాలతో ప్రారంభమైంది. తొలుత వాటర్ ప్లాంట్ వంటి వ్యాపారాలను నిర్వహిస్తూ అనుభవాన్ని సంపాదించారు.అలాగే తమ వ్యాపార కార్యకలాపాలను వివిధ రంగాలకు విస్తరించారు. క్రమంగా రియల్ ఎస్టేట్ రంగంలో అడుగుపెట్టి పట్టుదల, కష్టపడి పనిచేసే స్వభావం, వ్యాపార దక్షతతో ముందుకు సాగారు. అన్నదమ్ముల మధ్య సమన్వయం, పరస్పర సహకారం వారి వ్యాపార ప్రస్థానానికి బలంగా మారింది. వ్యాపార రంగంలో ఎదిగినప్పటికీ తమ పుట్టిన ఊరిని మాత్రం మరచిపోలేదు.తమ తల్లిదండ్రులు, పూర్వీకుల జ్ఞాపకాలు ముడిపడి ఉన్న పుల్గర్‌చర్ల గ్రామానికి ఏదైనా శాశ్వతంగా ఉపయోగపడే కార్యక్రమం చేయాలనే ఆలోచనతో సేవా కార్యక్రమాలను చేపడుతున్నారు.తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ముఖద్వారం తమ తల్లిదండ్రుల జ్ఞాపకాలను చిరస్థాయిగా నిలుపుకోవాలనే ఉద్దేశంతో పెబ్బేరులో కొల్లాపూర్ కమాన్ చౌరస్తాగా పేరొందిన చింతకుంట అనుమాండ్ల ముఖద్వారాన్ని నిర్మించినట్లు శ్రీనివాసులు తెలిపారు. తల్లిదండ్రులు తమకు అందించిన కష్టపడే తత్వం, నిబద్ధత, ఇతరులకు సహాయం చేయాలనే గుణాలను జీవితాంతం కొనసాగించడమే వారికి అందించే నిజమైన నివాళిగా భావిస్తున్నామని చెప్పారు. ఒక్క కుటుంబానికి మాత్రమే పరిమితమయ్యే జ్ఞాపకంగా కాకుండా, ప్రజలకు ఉపయోగపడే నిర్మాణాల రూపంలో తల్లిదండ్రుల జ్ఞాపకాలను నిలుపుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు.ప్రతి అమావాస్య అన్నదానం సేవా కార్యక్రమాల్లో భాగంగా పాతపల్లి గ్రామంలోని చింతకుంట అనుమాండ్ల దేవాలయంలో ప్రతి నెల అమావాస్య రోజున అన్నదాన కార్యక్రమాన్ని శ్రీనివాసులు, ఆయన సోదరులు నిర్వహిస్తున్నారు.కొంతకాలంగా తమ సొంత ఖర్చులతోనే ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తూ భక్తులు, పేదలు, అవసరమైన వారికి అన్నదానం చేస్తున్నారు.ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించాలనే ఉద్దేశంతో ఎలాంటి స్వార్థ ప్రయోజనం లేకుండా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని వారు పేర్కొంటున్నారు.అన్నదానం ద్వారా ఆకలితో ఉన్న వారికి ఆహారం అందించడం, ఆలయాలు మరియు గ్రామాలకు అవసరమైన నిర్మాణాలు చేపట్టడం వంటి కార్యక్రమాలను సేవా దృక్పథంతో కొనసాగిస్తున్నారు.గ్రామంలో పెళ్లిళ్లకు ఇబ్బందులు గమనించి పుల్గర్ చర్ల గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో వివాహాలు, ఇతర శుభకార్యాలు నిర్వహించే సమయంలో సరైన వసతులు లేక గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని శ్రీనివాసులు గమనించారు.వివాహ వేడుకల కోసం టెంట్లు ఏర్పాటు చేసుకోవడం, ఇతర ఏర్పాట్లకు అదనపు ఖర్చులు చేయాల్సి రావడం వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం ఉండాలని భావించారు. దీంతో దేవాలయం సమీపంలో ఒక కళ్యాణ మండపాన్ని నిర్మించాలని నిర్ణయించారు.తల్లిదండ్రులు, నానమ్మ—తాతల జ్ఞాపకార్థంగా నిర్మించనున్న ఈ కళ్యాణ మండపం భవిష్యత్ తరాలకు కూడా ఉపయోగపడేలా ఉండాలన్నది వారి ఆలోచనగా పేర్కొన్నారు.పేద కుటుంబాలకు ఎంతో ఉపయోగం వివాహ కార్యక్రమాలు పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భారంగా మారుతున్న పరిస్థితుల్లో గ్రామంలో ఉచిత కళ్యాణ మండపం అందుబాటులోకి రావడం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు.కళ్యాణ మండపం నిర్మాణం పూర్తయిన అనంతరం గ్రామంలోని ప్రతి కుటుంబం ఎలాంటి భేదాభిప్రాయాలకు తావులేకుండా వినియోగించుకునే అవకాశం కల్పిస్తామని శ్రీనివాసులు తెలిపారు.కులం, మతం, ఆర్థిక స్థితిగతులు అనే తేడాలు లేకుండా గ్రామ ప్రజలందరికీ సమానంగా సేవలు అందించాలన్నదే తమ కుటుంబ సంకల్పమని స్పష్టం చేశారు.గ్రామ సర్పంచ్ బత్తుల బాలరాజు మాట్లాడుతూ,,, పుల్గర్‌చర్ల గ్రామానికి ఉపయోగపడే గొప్ప కార్యక్రమానికి శ్రీనివాసులు, ఆయన సోదరులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో నిర్మించనున్న కళ్యాణ మండపం రాబోయే తరాలకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి స్వచ్ఛందంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం గొప్ప సేవా భావానికి నిదర్శనమన్నారు.తల్లిదండ్రుల జ్ఞాపకార్థం చేపడుతున్న ఈ నిర్మాణ కార్యక్రమం గ్రామ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని తెలిపారు. శ్రీనివాసులు, ఆయన సోదరులకు గ్రామ ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.అన్నదమ్ముల ఐక్యతకు నిదర్శనం పోవానపు బాలస్వామి లక్ష్మీదేవమ్మ దంపతులకు ఏడుగురు సంతానం కాగా, నలుగురు కుమార్తెలు, ముగ్గురు కుమారులు ఉన్నారు. శ్రీనివాసులు పెద్ద కుమారుడు కాగా, మోహన్, శ్రీరామ్ తరువాతి కుమారులు,ముగ్గురు అన్నదమ్ములు కలిసి వ్యాపార రంగంలో ముందుకు సాగడమే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ భాగస్వాములవుతున్నారు.కుటుంబ ఐక్యతతో పాటు సేవా భావాన్ని కొనసాగిస్తూ ముందుకు సాగడం పట్ల స్థానికులు అభినందనలు వ్యక్తం చేశారు. వ్యాపారంలో కలిసి ప్రయాణించడం, సంపాదనలో కొంత భాగాన్ని సామాజిక సేవకు కేటాయించడం, స్వగ్రామానికి అవసరమైన సమయంలో సహాయం అందించడం వారి కుటుంబ విలువలకు ప్రతిబింబంగా నిలుస్తోందని పలువురు పేర్కొంటున్నారు. గ్రామానికి శాశ్వత ఆస్తిగా కళ్యాణ మండపం ఒక్క రోజు జరిగే కార్యక్రమం ద్వారా మాత్రమే కాకుండా, తరతరాలకు ఉపయోగపడే శాశ్వత ఆస్తిని గ్రామానికి అందించాలన్న ఉద్దేశంతో కళ్యాణ మండప నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు శ్రీనివాసులు తెలిపారు. వివాహాలు, నిశ్చితార్థాలు, ఇతర శుభకార్యాలతో పాటు గ్రామ ప్రజలకు అవసరమైన సందర్భాల్లోనూ మండపాన్ని వినియోగించుకునేలా నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులు, నానమ్మ—తాతల జ్ఞాపకార్థంగా నిర్మించనున్న ఈ కళ్యాణ మండపం ద్వారా వారి జ్ఞాపకాలు చిరస్థాయిగా నిలిచిపోవడంతో పాటు, ప్రజలకు నిరంతరం ఉపయోగపడే అవకాశం ఉంటుందని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు.స్వగ్రామంపై మమకారానికి నిదర్శనం పుట్టిన ఊరంటే కేవలం ఒక ప్రాంతం కాదు చిన్ననాటి జ్ఞాపకాలు, తల్లిదండ్రుల అడుగుజాడలు, పూర్వీకుల అనుబంధం, బాల్య జీవితపు జ్ఞాపకాలు ముడిపడి ఉన్న నేల. అందుకే ఎక్కడ స్థిరపడినా స్వగ్రామాన్ని మరచిపోకుండా తమ వంతు సేవ చేయాలనే ఆలోచన కొందరిలో బలంగా ఉంటుంది.పోవానపు జంగం శ్రీనివాసులు, ఆయన సోదరులు చేపడుతున్న సేవా కార్యక్రమాలు అదే భావనకు ప్రతిరూపంగా నిలుస్తున్నాయి. వ్యాపార రంగంలో సాధించిన విజయాలను కేవలం వ్యక్తిగత అభివృద్ధికే పరిమితం చేయకుండా, సమాజానికి కూడా ఉపయోగపడేలా కార్యక్రమాలు చేపడుతున్నారనే అభిప్రాయం స్థానికుల్లో వ్యక్తమవుతోంది. ఆపదలో అండగా ఉంటానని హామీ స్వగ్రామ ప్రజలకు ఎలాంటి అవసరం వచ్చినా, గ్రామానికి ఎలాంటి ఆపద ఎదురైనా తన వంతు సహాయం అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని శ్రీనివాసులు తెలిపారు.గ్రామ ప్రజలు తనను ఒక కుటుంబ సభ్యుడిగా భావించాలని, గ్రామానికి అవసరమైన సమయంలో తన శక్తి మేరకు సహాయం చేయడం తన బాధ్యతగా భావిస్తానని పేర్కొన్నారు.కేవలం నిర్మాణాలు, అన్నదాన కార్యక్రమాలకే పరిమితం కాకుండా భవిష్యత్తులో ప్రజలకు మరింత ఉపయోగపడే సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

గ్రామస్థుల హర్షం

స్వగ్రామానికి ఇంతటి గొప్ప సేవా కార్యక్రమాన్ని అందించేందుకు ముందుకు వచ్చిన శ్రీనివాసులు, ఆయన సోదరులను గ్రామస్తులు అభినందించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాలరాజు, ఉపసర్పంచ్ జుర్రు చిన్నమ్మ, టిఆర్ఎస్ నాయకులు సురేందర్ రెడ్డి, మణిక రెడ్డి, మల్లెపూల నరసింహ, బాబు రెడ్డి, మురళి రెడ్డి, రామిరెడ్డి, మల్లెపూల చిన్న స్వాములు, గణపతి, నాగరాజు, నరేష్ ,అప్పల నరసింహ, సత్య రెడ్డి నారాయణ శెట్టి, శశికాపూర్, దండు రాముడు, వడ్డే తిరుపతయ్య, వార్డు సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల ఆకస్మికతనికి

ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య లభిస్తుంది

చౌల్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో కలిసి అల్పాహారం చేసిన పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

ప్రజా వాయిస్ హన్మకొండ /ఆత్మకూర్

హనుమకొండ జిల్లా పరకాల నియోజకవర్గ ఆత్మకూరు మండలం చౌల్లపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు.అనంతరం విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని . ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని, రాబోయే దేశ పౌరులు అని అల్పాహారం పథకాన్ని ప్రారంభించారని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చెందుతున్నాయని ,కార్పొరేట్ తరహా మౌలిక వసతులు, అల్పాహారం,మధ్యాహ్న భోజనం,నాణ్యమైన ఉచిత విద్య అందిస్తున్నామని అన్నారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల్లో భారీ అక్రమాలు

- సిబిఐ, ఈడీ డైరెక్టర్లకు సూర్య ఫిర్యాదు

- బిల్లులు ఆపి, కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని డిమాండ్

ప్రజా వాయిస్ గోదావరిఖని

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనుల్లో భారీ అవినీతి జరిగిందని, దీనిపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ డైరెక్టర్లకు ఫిర్యాదు చేసినట్లు సిపిఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య, నగర కార్యదర్శి ఖ. కనకరాజు తెలిపారు. గురువారం గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ?కార్పొరేషన్‌కు వచ్చిన 16 కోట్ల స్టాంప్ డ్యూటీ నిధులను దారిమళ్లించి, టెండర్లు ఇతరులు వేయకుండా కేవలం ఏడుగురు కాంట్రాక్టర్లకే పనులు అప్పగించారని ఆరోపించారు. 75--77లకు చేయాల్సిన పనిని 99లకు ఖరారు చేసి దాదాపు 22% నిధుల అక్రమాలకు పాల్పడ్డారని మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే హైదరాబాద్ కాంట్రాక్టర్ల నుండి 10 నుండి 12% కమిషన్లు తీసుకుంటూ స్థానిక కాంట్రాక్టర్ల ఉపాధి దెబ్బతీస్తున్నారని ధ్వజమెత్తారు. 1000 రోజుల పాలనలో అభివృద్ధి పేరిట రామగుండం ప్రజలను “రక్షించకున్నా... భక్షించకండి” అని హితవు పలికారు. నిబంధనలు ఉల్లంఘించిన ఏడు ప్యాకేజీల కాంట్రాక్టర్ల బిల్లులు నిలిపివేసి, వారిని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని, లేనిపక్షంలో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ?ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తాళ్లపల్లి మల్లయ్య, నగర నాయకులు శనిగరపు చంద్రశేఖర్, ఆసాల నవీన్, అబ్దుల్ కరీం, రాణవేణి సుధీర్ కుమార్, సాధుల శివ, పోతరాజు నాగరాజు, శనిగరపు తిరుమల తదితరులు పాల్గొన్నారు.

నెలకే తేలిన నాణ్యత రంగు!

- ఖాన్సాయిపేటలో సీసీ రోడ్ల నిర్మాణంపై ఆరోపణలు

- రూ.10 లక్షల వ్యయంతో చేపట్టిన పనుల్లో పగుళ్లు

- కాంట్రాక్టర్, అధికారుల తీరుపై విమర్శలు

ప్రజా వాయిస్ మంథని

పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఖాన్‌సాయిపేట పంచాయతీలో ఉపాధి హామీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్ల నాణ్యతపై తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. నిర్మాణం పూర్తయి నెల తిరక్కుండానే రోడ్లు పగుళ్లు బారడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ?రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన రెండు సీసీ రోడ్లలో నాసిరకం మెటీరియల్ వాడటం వల్లే ఇవి విరిగిపోతున్నాయని, ప్రజాధనం దుర్వినియోగమైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీ కాలనీ నుంచి స్మశాన వాటిక వరకు వేయాల్సిన రోడ్డును పక్కనబెట్టి, అవసరం లేని చోట నిర్మించారని కుడుదుల వెంకటేష్ ఆరోపించారు. పాఠశాల, జీపీ కార్యాలయం వద్ద పాత రోడ్డుపైనే కొత్తది వేసి నిధులు కాజేసే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. అధికారుల పర్యవేక్షణ లోపంతోనే ఈ అక్రమాలు జరిగాయని, వెంటనే విచారణ జరిపి కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

అజ్ఞానము తొలగించి
విజ్ఞానం పంచేది గురువు

గురువు చెప్పే విషయాలను శ్రద్ధగా విని

దేశం గర్వించేలా తయారు కావాలి

ప్రజా వాయిస్.. వనపర్తి

వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం తుంకుంట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ.కిరణ్ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి మాట్లాడుతూ సమాజంలో గురువుకు ఉన్నటువంటి స్థానం మరెవరికీ లేదని, తరగతి గదులలో విద్యార్థులలో అజ్ఞానాన్ని తొలగించి విజ్ఞానం వైపు పయనించేలా ఎంతో కృషి చేస్తారని అన్నారు. బావి భారత పౌరులు తరగతి గదుల్లోనే రూపుదిద్దుకుంటారని, అటువంటి విద్యార్థులను తయారు చేసే బాధ్యత ఎక్కువగా గురువు పైన ఉందని అన్నారు. విద్యార్థులు గురువు చెప్పే విషయాలను శ్రద్ధగా విని భవిష్యత్తులో దేశం గర్వించేలా తయారు కావాలని అన్నారు. సమాజంలో ఉన్న గురువులను ప్రతి ఒక్కరూ గౌరవించి, సముచిత స్థానం ఇవ్వాలని అన్నారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళి,వాలంటీరు అరుణమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సంక్షేమ పథకాలతో ప్రజలకు మేలు

- కేటీఆర్ అసత్య ప్రచారాలు మానుకోవాలి.

- ప్రభుత్వ విప్ విజయరమణరావు

ప్రజా వాయిస్, పెద్దపల్లి : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. చీకురాయి రోడ్ నుంచి జెండా చౌరస్తా వరకు జరిగిన ర్యాలీలో రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు పాల్గొన్నారు. కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై సంబరాలు నిర్వహించారు.ఈ సందర్భంగా విజయరమణరావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, సన్నబియ్యం, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్ల వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. పెద్దపల్లి నియోజకవర్గ అభివృద్ధికి బైపాస్ రోడ్డు, ప్రభుత్వ ఆస్పత్రి విస్తరణ, ఆర్ఓబీ నిర్మాణం వంటి పనులు వేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.రైతులు, పేదలు, మహిళల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రజలు సంక్షేమ పథకాలపై సంతృప్తిగా ఉన్నారని అన్నారు. ప్రభుత్వంపై మాజీ మంత్రి కేటీఆర్ అసత్య ప్రచారాలు, ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. అవినీతి రహిత పాలనతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

తేనేపల్లి తండాలో పంచాయతీ నిధుల రచ్చ

మాజీ, ప్రస్తుత సర్పంచుల మధ్య మాటల యుద్ధం

పాత ఎంబీల బిల్లులపై పరస్పర ఆరోపణలు

ప్రజా వాయిస్ : గుర్రంపోడు మండలం,

నల్గొండ జిల్లా, గుర్రంపోడు మండల పరిధిలోని తేనెపల్లి తండాలో పాత ఎంబీలు క్లోజ్ చేయకుండా, నిధులు దుర్వినియోగం చేశారని తేనేపల్లి తండా మాజీ సర్పంచ్ రజిత నాగరాజు నాయక్ ఆరోపించారు. శనివారం ఆయన గుర్రంపోడు మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. తండా పంచాయతీ సెక్రెటరీ హరికృష్ణ, సర్పంచ్ రజితలు కుమ్మక్కై పాత ఎంబీల బిల్లులు ఇవ్వకుండా, నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు డ్రా చేసుకున్నారని మండలంలోని సర్పంచులందరికీ బిల్లులు విడుదలయ్యాక నాకెందుకు రావని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి రికార్డులను పరిశీలించి, తనకు రావాల్సిన డబ్బులను ఇప్పించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.ఈ సందర్భంగా తేనేపల్లి సర్పంచ్ వడిత్య రజిత వివరణ ఇస్తూ తాను సర్పంచ్‌గా గెలిచి 9 నెలలు అవుతున్నా, గత మాజీ సర్పంచ్ ఇంతవరకు పంచాయతీ రికార్డులను గానీ, రిజిస్టర్లను గానీ అధికారికంగా అప్పగించలేదని ఆరోపించారు.గత ఐదేళ్లు సర్పంచ్‌గా ఉండి, ఆ తర్వాత అధికారి పాలన ముగిసినా లేని ఎంబి రికార్డులు.. దాదాపు మూడేళ్ల తర్వాత ఇప్పుడు ఎక్కడి నుంచి వచ్చాయని ఆమె ప్రశ్నించారు. నిబంధనల ప్రకారం ఎంబి రికార్డులను పంచాయతీ సెక్రెటరీకి ఇవ్వాలని, ఒకవేళ ఆయన తీసుకోకపోతే నేరుగా ఎం పి డి ఓ కి ఫిర్యాదు చేయాలే తప్ప, 10 నెలల పాటు తన వద్దే ఉంచుకుని రాజకీయం చేయడం సరికాదన్నారు. మీడియా మిత్రులు తేనేపల్లి తండాకు వచ్చి క్షేత్రస్థాయిలో విచారణ జరిపి నిజాలను ప్రజల ముందుంచాలని సర్పంచ్ రజిత కోరారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం

పస్నూర్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

విద్యార్థులకు కుర్చీలు విరాళంగా అందించిన ప్రధానోపాధ్యాయురాలు

విజయలక్ష్మిప్రజా వాయిస్ :

నాంపల్లి మండలం, నల్గొండ జిల్లా, నాంపల్లి మండలలో నీ పస్నూర్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. వీరమల్ల శైలజ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మితో పాటుఉపాధ్యాయులను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి విద్యార్థుల సౌకర్యార్థం స్వయంగా కుర్చీలు విరాళంగా అందించడంతో గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు అభినందించారు. పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని గ్రామ ప్రజలు ప్రశంసించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ క్లియరెన్స్ కోసం తల్లి నిరీక్షణ..

కార్యాలయం ముందే పసికందుకు తండ్రి పాలుతాగిస్తూ..

ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి

ఎస్ఐఆర్ ఓటు అప్లికేషన్ క్లియరెన్స్ కోసం ఓ తల్లి తన పసికందుతో కలిసి వరంగల్ ఎమ్మార్వో కార్యాలయానికి వచ్చింది. కార్యాలయంలో తన పని పూర్తయ్యే వరకు వేచి ఉండాల్సి రావడంతో, మరోవైపు పసికందు ఏడవడంతో కుటుంబం ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కోగా పసికందు ఆకలితో ఏడుస్తుండటంతో తండ్రి ఎమ్మార్వో కార్యాలయం ముందు ఉన్న టేబుల్‌పై బిడ్డను పడుకోబెట్టి పాలసీసాతో పాలు తాగించే సన్నివేశం కలచివేసింది.తల్లి మాత్రం ఎస్ఐఆర్ ఓటు అప్లికేషన్ క్లియరెన్స్ కోసం కార్యాలయం వద్ద వేచి చూస్తూ కనిపించింది.ప్రభుత్వ కార్యాలయాల్లో సామాన్య ప్రజలకు సౌకర్యంగా, వేగవంతమైన సేవలు అందించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

కుడా చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన గుండు సుధారాణి

శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యేలు,కలెక్టర్,మున్సిపల్ కమిషనర్

కుడా చైర్ పర్సన్ గా పదవీ బాధ్యత లు స్వీకరించిన గుండు సుధారాణి

ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి

హన్మకొండలోని కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) కార్యాలయంలో శనివారం కుడా చైర్మన్ గా గుండు సుధారాణి ఘనంగా ప్రమాణ స్వీకారం చేసి అధికారికంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి,రేవూరి ప్రకాష్ రెడ్డి,జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ తదితరులు గుండు సుధారాణికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ... కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ మరింత ప్రగతిపథంలో పయనించే విధంగా, ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో మౌలిక సదుపాయాల కల్పన, పట్టణాభివృద్ధి పనులు వేగవంతం చేసే దిశగా కృషి చేయాలని కూడా చైర్మన్ గుండు సుధారాణికి సూచించారు. ఈ కార్యక్రమంలో , రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయూబ్ అలీ, ,మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, పిసిసి నాయకులు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వాయిస్

అనాథ బాలిక 'సంధ్య' అరుదైన ప్రతిభ

- ఎంబీబీఎస్ సీటు సాధించిన తబిత ఆశ్రమ విద్యార్థిని
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అభినందనలు

ప్రజా వాయిస్ పెద్దపల్లి

పట్టుదల ఉంటే అనాథరికం చదువుకు అడ్డంకి కాదని తబిత ఆశ్రమానికి చెందిన వి. సంధ్య నిరూపించింది. చిన్నతనం నుంచి ఆశ్రమంలోనే ఉంటూ, ఇంటర్‌లో 955 మార్కులు సాధించిన సంధ్య.. కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రోత్సాహంతో నీట్ ఆన్‌లైన్ కోచింగ్ తీసుకుంది. పట్టుదలతో చదివి భూపాలపల్లి ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. ఈ సందర్భంగా సంధ్యను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఆమె ఎంబీబీఎస్ పూర్తయ్యే వరకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆశ్రమ విద్యార్థులంతా సంధ్యను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

సింగరేణికి కాంగ్రెస్, ఏఐటీయూసీల వల్ల ప్రమాదం

- పుట్ట మధూకర్

ప్రజా వాయిస్ రామగిరి

సింగరేణి మైన్స్ గేట్ల నుంచి కాంగ్రెస్, ఏఐటీయూసీ నేతలను తరిమికొట్టకపోతే సంస్థ మనుగడకే ప్రమాదమని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ హెచ్చరించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు శనివారం లద్నాపూర్ ఓసీపీ-2 మైన్‌పై టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డితో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పుట్ట మధూకర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను 100 రోజుల్లో నెరవేరుస్తామని చెప్పి, 1000 రోజులైనా పట్టించుకోకుండా కార్మికులను, ప్రజలను మోసం చేసిందన్నారు. మెడికల్ అన్‌ఫిట్ ప్రక్రియలో తీవ్ర అన్యాయం జరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుపై విమర్శలు గుప్పిస్తూ.. 40 ఏళ్లుగా అధికారంలో ఉన్న దుద్దిళ్ల కుటుంబం నియోజకవర్గానికి చేసింది శూన్యమని, కొత్త పరిశ్రమలు గానీ, ఐటీ కంపెనీలు గానీ తీసుకురాలేకపోయారని మండిపడ్డారు. రూ.300 కోట్ల డిఎమ్ఎఫ్‌టి నిధులతో చేపట్టిన రోడ్డు పనుల్లో మిగిలిన 4 కి.మీ పనులను కూడా మూడేళ్లయినా పూర్తి చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. అధికారులు కాంగ్రెస్ కార్యకర్తల్లా వ్యవహరిస్తే రిటైర్ అయినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

గురువుల పట్ల ప్రేమ, గౌరవం, కృతజ్ఞత చాటుకున్న విద్యార్థులు

శామీర్ పేట్ / ప్రజా వాయిస్ :

దక్షా హైస్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భారత తొలి ఉపరాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ప్రతి ఏటా సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ గురువుల పట్ల తమకున్న ప్రేమ, గౌరవం, కృతజ్ఞతను చాటుకున్నారు. విద్యార్థులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రసంగాలు, వినోద కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ప్రదర్శనలను ఉపాధ్యాయులు ఆసక్తిగా తిలకించి అభినందించారు. ఈ సందర్భంగా దక్ష విద్యాసంస్థల అధినేత, డైరెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. గురువులు విద్యార్థులకు విద్యాబోధనతో పాటు మంచి విలువలు, క్రమశిక్షణ, నైతికతను నేర్పిస్తూ భవిష్యత్తుకు మార్గదర్శకులుగా నిలుస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దక్ష విద్యాసంస్థల అధినేత, డైరెక్టర్ శివశంకర్, ప్రిన్సిపల్ శశిరేఖ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంథని బియ్యం కుంభకోణంపై 'త్రివిధ' దాడికి రంగం సిద్ధం

- నాలుగేళ్ల దందా.. రూ. 12.28 కోట్ల మాయం!
- త్రిముఖ వ్యూహంతో విచారణకు డిమాండ్
- బినామీల ఆస్తులపై ఈడీ కన్ను పడాల్సిందే
- సివిల్ సప్లైస్ అధికారుల పాత్రపై విజిలెన్స్ విచారణ



ప్రజా వాయిస్ మంథని

పెద్దపల్లి జిల్లా మంథని పరిధిలో వెలుగుచూసిన భారీ బియ్యం కుంభకోణం కేసు ముమ్మర మలుపులు తిరుగుతోంది. ప్రభుత్వానికి చెందిన రూ. 12.28 కోట్ల విలువైన వడ్లను పక్కదారి పట్టించి విక్రయించిన ఘటనపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఆదాయపన్ను శాఖలు సంయుక్తంగా పూర్తిస్థాయి విచారణ జరిపించాలని ముత్తారం మండలం ఖమ్మంపల్లి మాజీ సర్పంచ్ సముద్రాల రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన హైదరాబాద్‌లోని సదరు మూడు ఉన్నతాధికారుల కార్యాలయాలకు రాతపూర్వక ఫిర్యాదు పంపారు.

12.28 కోట్ల సరుకు విక్రయం

మంథని పోలీస్ స్టేషన్‌లో నమోదు అయిన ఎఫ్ఐఆర్ నెంబర్ 194/2026 ప్రకారం పవన సుత రైస్ మిల్ అధినేత రావికంటి పవన్ కుమార్, శ్రీ లక్ష్మి ఎంఆర్ఎం నిర్వాహకుడు వొల్లాల నవీన్ కుమార్ అనే ఇద్దరు మిల్లు యజమానులు 2021-22 సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం కేటాయించిన 5,798 మెట్రిక్ టన్నుల వడ్లలో, సుమారు 4,211 మెట్రిక్ టన్నుల వడ్లను (2,821 మెట్రిక్ టన్నుల బియ్యం) బయట మార్కెట్లో అక్రమంగా విక్రయించుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గత నాలుగేళ్లుగా ఈ అక్రమ వ్యాపారం సాగుతోందని సివిల్ సప్లైస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్

ముప్పిడి శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారని గుర్తుచేశారు. ఈ కుంభకోణంలో ప్రజాధనం భారీగా దుర్వినియోగం అయినందున త్రివిధ శాఖలు రంగంలోకి దిగాల్సిన అవసరం ఉందని సముద్రాల రమేష్ కోరారు. అక్రమంగా ధాన్యం విక్రయించడం ద్వారా వచ్చిన రూ. 12.28 కోట్ల నిధులను నిందితులు బినామీ పేర్లతో ఆస్తులుగా మార్చి ఉంటారని, ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ కింద ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ నమోదు చేసి ఆస్తులను, బ్యాంకు ఖాతాలను వెంటనే సీజ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. నాలుగేళ్లుగా బియ్యం నిల్వలు తగ్గినా పౌర సరఫరాల శాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవడం వెనుక అధికారుల ప్రమేయం, అవినీతి స్పష్టంగా కనిపిస్తోందని ఆరోపించారు. లెక్కల్లో చూపని ఈ భారీ ఆదాయంపై ఆదాయపన్ను శాఖ సెక్షన్ 132/13కూ కింద సోదాలు నిర్వహించి, పన్నుతో పాటు భారీగా పెనాల్టీలు విధించాలని కోరారు. ప్రభుత్వ సొమ్మును రికవరీ చేసి, బాధ్యులైన మిల్లు యజమానులతో పాటు వారికి సహకరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సింగరేణి కార్మికులపై వేధింపులు ఆపాలి

- టీబీజీకేఎస్, బీఆర్ఎస్ నిరసన హోరు
- సస్పెన్షన్లు, ఛార్జ్ షీట్లు వెంటనే రద్దు చేయాలి
- కార్మికుల జోలికొస్తే ఊరుకునేది లేదు
- రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ హెచ్చరిక

గోదావరిఖని

సింగరేణి వ్యాప్తంగా కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్), బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం నిరసన హోరు మిన్నంటింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల ప్రజా వ్యతిరేక పాలనను నిరసిస్తూ ఆర్జీ-1 ఏరియాలోని జిడికే 2 & 2A ఇన్క్లైన్ వద్ద ఈ నిరసన ధర్నా చేపట్టారు. వడ్డేపల్లి శంకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని ప్లకార్డులతో నిరసన తెలిపారు. కార్మికులపై జారీ చేసిన ఛార్జ్ షీట్లు, సస్పెన్షన్లు, డిస్మిసల్స్ వెంటనే రద్దు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. సింగరేణి రికార్డుల్లో పెండింగ్‌లో ఉన్న మారుపేర్ల సమస్యను తక్షణమే పరిష్కరించాలని, కారుణ్య మరియు డిపెండెంట్ ఉద్యోగాల నియామకాలను పునరుద్ధరించాలని కోరారు. ఖాళీల ఆధారంగా అర్హులైన కార్మికులకు ప్రమోషన్లు ఇవ్వాలని, 60 ఏళ్లు దాటిన వారికి బకాయిలతో కూడిన పింఛన్ మంజూరు చేయడంతో పాటు క్రమం తప్పకుండా మెడికల్ బోర్డులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 1000 రోజులు గడుస్తున్నా కార్మికులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన 250 గజాల ఇండ్ల స్థలాలు, 100 శాతం ఇన్వాలిడేషన్ ఉద్యోగాలు, ఇన్‌కమ్ టాక్స్ మినహాయింపు వంటి వాగ్దానాలను పూర్తిగా విస్మరించి కార్మికులను మోసం చేశారని మండిపడ్డారు. గతంలో కేసీఆర్ పాలనలో 19,000 మందికి ఉద్యోగాలు కల్పించడమే కాకుండా, మెడికల్ కాలేజీల్లో కార్మికుల పిల్లలకు 5 శాతం కోటా ఇచ్చామని గుర్తుచేశారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో కొత్తగా ఒక్క ఉద్యోగం ఇవ్వకపోగా, కార్మికులను వేధిస్తూ సస్పెన్షన్లు, ఛార్జ్ షీట్లతో తొలగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల హక్కులను కాలరాస్తే ఊరుకునేది లేదని, పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ?ఈ కార్యక్రమంలో మాదాసి రామ్మూర్తి, నూనె కొమరయ్య, ఉప్పులేటి తిరుపతి, మీస రాజు, దూత శేషగిరి, మేకల సమ్మయ్య, మూల విజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్షర బాటలో నడిపించి, జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకునేలా చేసే శిల్పి ఉపాధ్యాయుడు

తరగతిగది నాలుగు గోడల మధ్య దేశ భవిష్యత్తును నిర్మించే అద్భుతమైన శక్తి గురువుకే స్వంతం

సర్పంచ్ తలకంటి ప్రభాకర్ రెడ్డి

ప్రజా వాయిస్.. వనపర్తి

వనపర్తి జిల్లా పాన్గల్ మండలం బుసిరెడ్డిపల్లి గ్రామంలో శనివారం రోజు సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా గురుపూజోత్సవ కార్యక్రమాన్ని ప్రాథమిక పాఠశాల మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు గ్రామ సర్పంచ్ తలకంటి ప్రభాకర్ రెడ్డి గురువులను పూలదండలు శాలువలతో ఘనంగా సన్మానించి శు భాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటుచేసిన టీచర్స్ డే సందర్భంగా తలకంటి ప్రభాకర్ రెడ్డి సర్పంచ్ మాట్లాడుతూ,,భారతదేశ ద్వితీయ రాష్ట్రపతి, గొప్ప తత్వవేత్త మరియు, ఆదర్శ ఉపాధ్యాయుడు ఆయన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని మనం ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 05న ఉపాధ్యాయుల దినోత్సవం జరుపుకుంటున్నాం అని అన్నారు, గురువు అంటే అజ్ఞానమని చీకటిని తొలగించి జ్ఞానమని వెలుగును ప్రసాదించేవారు అని అన్నారు, తల్లిదండ్రులు మనకు జన్మనిస్తే ఆ జన్మకు సార్థకతను చేకూర్చే బాధ్యతలను ఉపాధ్యాయులు తీసుకుంటారని అన్నారు, కేవలం పుస్తకాలలోనే పాటలు మాత్రమే కాకుండా జీవితంలో ఎలా జీవించాలి మంచి నడవడిక క్రమశిక్షణ నైతిక విలువలను నేర్పేది ఉపాధ్యాయులు అని అన్నారు, ఒక దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే రూపుదిద్దుకుంటుందని, ఆ భవిష్యత్తును శిల్పిలు మన ఉపాధ్యాయులు అని అన్నారు, డాక్టర్లు ఇంజనీర్లు, సైంటిస్టులు, నాయకులు ఇలా సమాజంలో ఎన్నో ఉన్నత స్థానంలో ఉన్న వారైనా ఒకప్పుడు ఉపాధ్యాయులు వద్ద విద్యను అభ్యసించిన వారే అని అన్నారు, మన ఎదుగుదలకు నిరంతరం శ్రమించే మన ఉపాధ్యాయుల పట్ల సదా గౌరవాన్ని కృతజ్ఞతలు కలిగి ఉండడమే మనవారికి ఇచ్చే నిజమైన కానుకని అన్నారు, భవిష్యత్తులో విద్యార్థులు మంచి ప్రణాళిక బద్ధంగా చదివి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు, అనంతరం ఉపాధ్యాయులను పూలమాల శాలువలు కప్పి సన్మానం చేశారు, పదవ తరగతి పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థినికి నగదు బహుమతి 5000 రూపాయలు ఇచ్చి సన్మానం చేశారు, ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెన్నప్ప, పాఠశాల ఉపాధ్యాయులు, నాగయ్య, శ్రీనివాసులు, రమేష్, డాకేశ్వర్ గౌడ్, భారతి, శిరీష, బాలిశ్వర్, సాములు ఉప సర్పంచ్ లలిత కర్ణ, గ్రామ యువకుడు సూర్యవంశం రాము, గ్రామపంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు

8, 9 న అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

ప్రజా వాయిస్ కొత్తగూడ

మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో మంచిర్యాల పట్టణంలో సెప్టెంబర్ 8, 9 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర 9వ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జు దేవేందర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రం మహాసభల విజయవంతం కోసం అఖిల భారత రైతు కూలీ సంఘం,అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో కొత్తగూడ మండల కేంద్రంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభను జయప్రదం చేయాలని నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జు దేవేందర్ మాట్లాడుతూ రైతులు, కూలీల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తు, రైతుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మొండి వైఖరి వ్యతిరేకంగా ఏఐకేఎంఎస్ నిరంతరం ఉద్యమాలు చేస్తున్నది తెలిపారు.మరింత ఉద్యమ భవిష్యత్ కార్యాచరణను రూపొందించేందుకు రాష్ట్ర మహాసభలు కీలక వేదికగా నిలుస్తాయని తెలిపారు. రైతు కూలీలు, కార్మికులు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.రైతు కూలీల హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీశైలం, ఏఐకేఎంఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు భూర్కా వెంకటయ్య, జిల్లా సహాయ కార్యదర్శి పుల్లన్న, నాయకులు బుర్కా బుచ్చిరాములు, పూర్ణ చందర్, సోమయ్య, జామ్లా, రాయుడు, దేవేందర్, శ్రీను రాజా తదితరులు పాల్గొన్నారు

బీఆర్ఎస్ నాయకుల వ్యాఖ్యలను ఖండించిన కాంగ్రెస్ నేతలు

వజ్రేష్ యాదవ్ చొరవతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు

రాష్ట్ర హజ్ కమిటీ మెంబర్ ముజీబుద్దీన్

శామీర్‌పేట్ / ప్రజా వాయిస్:

ఇటీవల శామీర్‌పేట్ మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ సమావేశంలో ఓ బీఆర్ఎస్ నాయకుడు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ ఉమ్మడి శామీర్‌పేట్ ప్రెస్ క్లబ్ లో కాంగ్రెస్ పార్టీ నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు మహమ్మద్ ముజిబుద్దిన్ మాట్లాడుతూ..... ఎన్నికల్లో పోటీ చేసి ఓడిన వారు అభివృద్ధి కార్యక్రమాల సభల్లో కూర్చుంటున్నారంటూ బీఆర్ఎస్ నాయకుడు చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలుగా పోటీ చేసిన వారిని అధికారికంగా ఇన్‌చార్జీలుగా నియమించిందని, ఆ విషయం కూడా తెలియకుండా కాంగ్రెస్ నాయకులపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. ఏ పార్టీలో ఉన్నారో స్పష్టత లేని మల్లారెడ్డి కోసం బీఆర్ఎస్ నాయకులు ఎందుకు అంతగా తాపత్రయపడుతున్నారో అర్థం కావడం లేదని విమర్శించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనకుండా దూరంగా ఉండటం వల్ల నియోజకవర్గంలో సమస్యలు పేరుకుపోయాయని ఆరోపించారు. నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న వజ్రేష్ యాదవ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తో ఉన్న సాన్నిహిత్యంతో భారీగా నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పనులు చేపడుతున్నారని తెలిపారు. నియోజకవర్గ సమస్యలపై గతంలో అసెంబ్లీలో ఏనాడూ చర్చించని మల్లారెడ్డి.. కాంగ్రెస్ నాయకులపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన కాలేజీల అభివృద్ధి కోసమే రాజకీయాల్లోకి వచ్చారంటూ ఎద్దేవా చేశారు. మంత్రిగా ఉన్న సమయంలో నియోజకవర్గంలో కబ్జాలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఎదుర్కొన్న మల్లారెడ్డి.. కాంగ్రెస్ నాయకులపై బురదజల్లడం సరికాదన్నారు.గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఆ పార్టీ నాయకులే అభివృద్ధి చెందారని, రాష్ట్ర అభివృద్ధిని పట్టించుకోలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తోందని

ముజిబుద్దిన్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింలు యాదవ్, జిల్లా ఆర్టీఏ మెంబర్ బీమిడి జైపాల్ రెడ్డి, శామీర్‌పేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శంకర్ గౌడ్, మాజీ సర్పంచ్ బత్తుల కిషోర్ యాదవ్, మాజీ ఎంపీటీసీ డప్పు సాయిబాబా, శామీర్‌పేట్ డివిజన్ మైనార్టీ ప్రెసిడెంట్ హాజీమ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అశోక్, మహేందర్ యాదవ్, నరసింహారెడ్డి, ఆంజనేయులు, సొగడి రాజు, కత్తి వెంకటేష్, మనోహర్ యాదవ్, వెంకటేష్ గౌడ్, బుర్కా వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగాఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

ప్రజా వాయిస్ కొత్త గూడ

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజు సందర్భంగా మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులు పూలమాలలతో శాలువాలతో తమకు రోజు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుని ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ గురించి ఉపాధ్యాయుల ప్రాధాన్యం గురించి విద్యార్థిని విద్యార్థులు ఉపన్యాసాలు ఇవ్వడం జరిగింది. గురువు గొప్పతనం తెలియజేసే పాటలు పాడడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గుమ్మడి లలిత విద్యార్థి మరియు ఉపాధ్యాయుల మధ్య ఉన్న సంబంధాల గురించి, గురువు గొప్పతనం గురించి తెలియజేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని, భవిష్యత్తులో గొప్పగా ఎదగాలని సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నామాల మోహన్, తీగల రమేష్, చాట్ల బేబీ, కల్తీ రాధిక, గొగ్గల భారతి, ఆలూరి శంకరయ్య, కేశబోయిన భరత్ పాల్గొన్నారు.

మహిళల భద్రత...టీ –సేఫ్ అప్ పై హన్మకొండ లోని అవినాష్ కాలేజీలో షీ టీం ఎస్సై రామారావు అవగాహన సదస్సు

ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి

నేరాలు, అఘాయిత్యాలు పెరుగుతున్న నేటి కాలంలో నేరాల అదుపులో అందరు భాగస్వామ్యం కావాలని తమవంతు బాధ్యతలను నిర్వర్తించాలని, జాగ్రత్తతో మెలగడం వల్ల మహిళల మీద జరిగే నేరాలను అదుపు చేయవచ్చని వరంగల్ షీ టీమ్ ఎస్సై రామారావు అన్నారు. హన్మకొండ లోని అవినాష్ కాలేజీ లో దాదాపు 150మంది విద్యార్థినిలతో సైబర్ నేరాలు, మహిళలపై జరిగే అత్యాచారాలు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాల పట్ల అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఈ సందర్భంగా వరంగల్ షీ టీమ్ ఎస్సై రామారావు మాట్లాడుతూ అమ్మాయిలు ఫేస్ బుక్, ఇన్ స్టా గ్రామ్, స్నాప్ చాట్, టెలిగ్రామ్ లాంటి సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫొటోలు, వివరాలు పంచుకోవడంలో జాగ్రత్త వహించాలని, సైబర్ నేరాల పై,అవగహన కలిగివుండాలని మరియు మహిళలు

ఒంటరిగా తెలియని ప్రదేశాలకు ప్రయాణం చేయవలసి వచ్చినప్పుడు అందరు టీ-సేఫ్ ఆప్ ను ఉపయోగించుకోవాలని, టీ-సేఫ్ ఆప్ పై అవగాహన కలిగి ఉండాలని, ఉద్యోగాలు చేసే మహిళలకు తాము పనిచేసే ప్రదేశాలలో అసభ్యకరంగా ప్రవర్తించే వారి పట్ల, ఆకతాయిల పట్ల జాగ్రత్తగా ఉండాలని, గుర్తు తెలియని వారితో తమ వ్యక్తిగత విషయాలు పంచుకోరాదని సూచించారు. ఎవరైనా మహిళలపై అనుచితంగా, అసభ్యంగా ప్రవర్తించినట్లైతే ధైర్యంగా వెంటనే షీ టీమ్ పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ నేరాలు జరిగితే టోల్ ఫ్రీ1930 కి ఫిర్యాదు చేయాలని, మా షీ టీమ్ మొబైల్ నంబర్స్ సీపీ వాట్సాప్ నంబర్ 8712685257, సీఐ వాట్సాప్ నెంబర్ 8712685142, ఎస్ఐ వాట్సాప్ నెంబర్ 8712685270కు ఫిర్యాదు చేసిన వారి వివరాలను చాలా గోప్యంగా ఉంచి నేరస్థులకు కౌన్సిలింగ్ ఇచ్చి వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అవినాష్ కాలేజీ ప్రిన్సిపాల్ షహీన్. ఉపాధ్యాయులు మరియు షీ టీమ్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న సివిల్ డిజీఎం రాజేంద్రకుమార్‌కు ఘన సన్మానం

ప్రజా వాయిస్ రామగిరి

రామగుండం ఆర్జీ-3 ఏరియా మరియు అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలో సివిల్ డిజీఎమ్‌గా బాధ్యతలు నిర్వహించి, కొత్తగూడెం ఏరియాకు బదిలీపై వెళ్తున్న బి.రాజేంద్రకుమార్‌ను శనివారం జీఎం కార్యాలయంలో అధికారులు అభినందనపూర్వకంగా ఘనంగా సన్మానించారు. ?ఈ సందర్భంగా ఆర్జీ-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జీఎం కొలిపాక నాగేశ్వరరావులు మాట్లాడుతూ.. రాజేంద్రకుమార్ ఏరియా అభివృద్ధిలో ఎంతో అంకితభావంతో, క్రమశిక్షణతో సేవలు అందించారని ప్రశంసించారు. ఆయన నూతన బాధ్యతల్లోనూ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ?ఈ కార్యక్రమంలో అధికారులు ప్రవీణ్ వి ఫ్యాటింగ్, విభాగాధిపతులు బి.టి. మురళీకృష్ణ, కె. ఐలయ్య, షబ్బీరుద్దీన్, సి.జె. సురేఖ, ఆర్. రాజేశ్వరి, అప్సర్ పాషా, రవిచరణ్, ఆసిఫ్ యాసిన్, జ్ఞానసంబంధన్, ప్రకాష్, డివైపీఎం ఎండీ ఆసిఫ్, సీనియర్ పీఓ టి. ప్రీతి తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీలో రాజకీయం తగదు

అర్హులైన నిరుపేదల కే కేటాయించాలి.

జనగామ కలెక్టర్ కు మాజీ మంత్రి ఎర్రబెల్లి వినతి

న్యాయం జరగకపోతే కలెక్టరేట్ ముట్టడిస్తాం

ప్రజావాయిస్/పాలకుర్తి

ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు ప్రక్రియ పారదర్శకంగా జరగాలని, రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా కేవలం అర్హులైన నిరుపేదలకే వాటిని అందించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి దయాకర్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాను కలిసి ఆయన సమగ్ర వినతిపత్రం అందజేశారు. పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల మండలాల పరిధిలోని అర్హులైన పేదలను క్షేత్రస్థాయిలో గుర్తించి, డ్రా పద్ధతి ద్వారా మాత్రమే ఇళ్లను పంపిణీ చేయాలి. అధికార కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకే లబ్ధి చేకూర్చేలా ఇళ్ల కేటాయింపులు జరిగితే సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు.ఆందోళన హెచ్చరిక: డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల విషయంలో అర్హులైన నిరుపేదలకు అన్యాయం జరిగితే, వేలాది మంది ప్రజలతో కలిసి కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని తేల్చిచెప్పారు.

రాజకీయ, పరిపాలనా విశ్లేషణ

తెలంగాణలో పేదల గృహ నిర్మాణ పథకం అనేది అత్యంత సున్నితమైన, ప్రభావవంతమైన అంశం. పాలకుర్తి నియోజకవర్గంలో ఇటీవల అధికార మార్పిడి జరిగిన నేపథ్యంలో, గత ప్రభుత్వం నిర్మించిన ఇళ్ల కేటాయింపులపై కాంగ్రెస్, బీఆర్ఎస్ వర్గాల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. అధికార పార్టీ తమ కేడర్‌ను బలోపేతం చేసుకునేందుకు వీటిని వినియోగించుకుంటోందన్నది అర్హుల ఎంపిక ప్రక్రియలో పక్షపాత రహిత వైఖరి అవసరమని విపక్షం గళమెత్తుతోంది. కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వడం ద్వారా

ఎర్రబెల్లి ఈ అంశాన్ని కేవలం రాజకీయ విమర్శగా కాకుండా, అధికార యంత్రాంగంపై ఒత్తిడి తెచ్చే ప్రజా సమస్యగా ముందుకు తెచ్చారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పల్లా సుందర్ రాంరెడ్డి, దేవరుప్పుల మండల అధ్యక్ష, కార్యదర్శులు తీగల దయాకర్ గౌడ్, చింత రవి, మాజీ ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, సుందర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఏల సుందర్ తదితరులు పాల్గొన్నారు.

ఒకే ఊరు ఒకే గణపతి చిన్న గ్రామాలు ఆదర్శంగా నిలవాలి!

గ్రామస్తులంతా అన్నదమ్ముల్లా కలిసి గణేష్ వేడుకలు జరుపుకోవాలి

రాజారాంపేటలో వినాయకుడు మనకు నేర్పే పాఠాలు, సైబర్ విజ్ఞానం పోస్టర్ ఆవిష్కరణ.

సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై అప్రమత్తత అవసరం: ఎస్సై శ్రీనివాసరెడ్డి

ప్రజా వాయిస్ ఖమ్మం:

ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం,రాజారాంపేట, గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ రాయపూడి రామారావు ఆధ్వర్యంలో శనివారం సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నియంత్రణపై గ్రామస్థులకు శనివారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో రూపొందించిన వినాయకుడు మనకు నేర్పే పాఠాలు సైబర్ విజ్ఞానం కలిగి ఉండండి అనే పోస్టర్‌ను స్థానిక ఎస్సై శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిపోతున్న సైబర్ నేరాలు, నకిలీ ఆఫర్ల లింకుల పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, యువత మాదకద్రవ్యాల వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. ఎవరైనా ఆన్‌లైన్ మోసాలకు గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని లేదా cybercrime.gov.in లో ఫిర్యాదు చేయాలని తెలిపారు.సర్పంచ్ రామారావు మాట్లాడుతూ.. గణేష్ చతుర్థి వేడుకలను మన గ్రామంలో భక్తిశ్రద్ధలతో, బాధ్యతాయుతంగా జరుపుకోవాలని సూచించారు. ఎటువంటి విభేదాలు, ఘర్షణలకు తావులేకుండా గ్రామస్థులంతా అన్నదమ్ముల్లా కలిసి ఒకే ఊరు, ఒకే వినాయక విగ్రహం ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇది గ్రామ సమైక్యతను చాటుతూ ఇతర చిన్న గ్రామాలకు మనం ఆదర్శంగా నిలవాలి అని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, మాజీ ఉపసర్పంచ్, గ్రామ పెద్దలు, యువకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పాలకు బదులు పామాయిల్ ఇదేం పన్నీర్.?

పన్నీర్ పేరుతో ప్రజారోగ్యానికి ఎసరు

మైలార్‌దేవ్‌పల్లి, గగన్‌పహాడ్‌లో కల్తీ బాగోతం

795 లీటర్ల లూజ్ పామాయిల్ గుర్తింపు

మూడు డెయిరీల లైసెన్సులు రద్దు

కల్తీపై కోరాడ ఝలిపిస్తున్న టీజీ సేఫ్

ప్రజా వాయిస్/ రాజేంద్రనగర్:

తెల్లగా కనిపిస్తోంది,మెత్తగా ఉంది, రుచిగా ఉందని పన్నీర్‌ను లొట్టలేసుకుంటూ తినేస్తున్నారా.? అయితే కాస్త జాగ్రత్త సుమీ.! మీరు తింటున్నది నిజమైన పాల పన్నీరేనా.? లేక పామాయిల్,ఇతర పదార్థాలతో తయారు చేసిన కల్తీ పన్నీరా.? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్న కల్తీ పన్నీర్ తయారీపై టీజీ సేఫ్ అధికారులు కొరడా ఝళిపించారు. వివరాల్లోకి వెళితే. హైదరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల్లోని 14 డెయిరీ యూనిట్లలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించగా పలు చోట్ల నిబంధనల ఉల్లంఘనలు బయటపడ్డాయి.ముఖ్యంగా రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లిలో ధనలక్ష్మీ డెయిరీ ప్రొడక్ట్స్, గగన్‌పహాడ్‌లోని లక్ష్మీ ఫుడ్స్‌లో తీవ్ర ఉల్లంఘనలు గుర్తించారు.

పాల స్థానంలో పామాయిల్ – కల్తీకి కేరాఫ్.!

తనిఖీల్లో పన్నీర్ తయారీలో పాలకు బదులుగా నిబంధనలకు విరుద్ధంగా పామాయిల్, గ్లిజరాల్ మోనోస్టియరేట్ వంటి పదార్థాలను వినియోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. గగన్‌పహాడ్‌లోని లక్ష్మీ ఫుడ్స్‌లో 600 లీటర్లు, మైలార్‌దేవ్‌పల్లిలోని ధనలక్ష్మీ డెయిరీలో 195 లీటర్ల లూజ్ పామాయిల్

గుర్తించారు.మొత్తంగా ఈ రెండు యూనిట్లలో 795 లీటర్ల పామాయిల్ బయటపడటం కలకలం రేపింది.తీవ్ర ఉల్లంఘనల నేపథ్యంలో ఈ రెండు సంస్థలతో పాటు అల్వాల్‌లోని మరో డెయిరీ ఆహార భద్రత లైసెన్సులను టీజీ సేఫ్ అధికారులు రద్దు చేశారు.వెంటనే కార్యకలాపాలు నిలిపివేయాలని ఆదేశించారు.

పరిశుభ్రత గాలికి – పురుగుల బెడద!

కొన్ని డెయిరీ యూనిట్లలో ఉత్పత్తి ప్రదేశాలు అపరిశుభ్రంగా ఉన్నట్లు తనిఖీల్లో గుర్తించారు. బొద్దింకలు, ఈగలు, పారిశుధ్య లోపాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు.పాలు ఎక్కడి నుంచి సేకరిస్తున్నారో తెలిపే కొనుగోలు రికార్డులు కూడా కొన్ని సంస్థల్లో లేకపోవడం గమనార్హం.

పన్నీర్ కొనే ముందు, హోటల్‌లో లొట్టలేసుకుంటూ తినే ముందు జాగ్రత్త!

ప్యాకెట్ పన్నీర్ కొనుగోలు చేసే ముందు తయారీదారు వివరాలు,ఫుడ్ సేఫ్టీ లైసెన్స్, తయారీ తేదీ,గడువు తేదీ, పదార్థాల వివరాలు తప్పనిసరిగా పరిశీలించాలని అధికారులు సూచిస్తున్నారు.హోటల్‌లో పన్నీర్ వంటకం ఆర్డర్ చేసే సమయంలోనూ నాణ్యతపై అప్రమత్తంగా ఉండాలని చెబుతున్నారు. అనుమానాస్పద వాసన, రంగు లేదా నాణ్యత కనిపిస్తే ఆహారాన్ని తీసుకోకుండా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే కల్తీ దందాలను ఏమాత్రం ఉపేక్షించేది లేదని టీజీ సేఫ్ అధికారులు హెచ్చరించారు.నిబంధనలు ఉల్లంఘించే డెయిరీ యూనిట్లపై తనిఖీలు కొనసాగుతాయని, అవసరమైన చోట కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

హర్ష హైస్కూల్‌లో ఘనంగా గురుపూజోత్సవ వేడుకలు

ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :

సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని కనుకుల గ్రామంలోని హర్ష హైస్కూల్ పాఠశాలలో గురుపూజోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి, వారి సేవలను కొనియాడారు.విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని వక్తలు పేర్కొన్నారు. గురువులను గౌరవించడం భారతీయ సంస్కృతిలో గొప్ప సంప్రదాయమని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త శంకరయ్య, పాఠశాల కరస్పాండెంట్ ఉమాదేవి, పాఠశాల డైరెక్టర్ ఎస్.కె. ఇక్బాల్, సాధన కళాశాల ప్రిన్సిపాల్ వి. కిరణ్‌తో పాటు అధ్యాపక బృందం పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి..రాజీపడి సంతోషంగాజీవించండి

ప్రజా వాయిస్ కొత్తగూడ

మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల ప్రజలకు కొత్తగూడ ఎస్సై రాజ్ కుమార్ ముఖ్య విజ్ఞప్తి చేస్తున్నారు. పోలీస్ స్టేషన్‌లో వివిధ కేసుల్లో నమోదైన రాజీ పరిష్కారానికి అవకాశం ఉన్న కేసుల పరిష్కారం కోసం సెప్టెంబర్ 12న లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు.చిన్న చిన్న వివాదాలు జీవితాంతం శత్రుత్వాలకు దారితీయకుండా, ఇరువర్గాలు పరస్పరం మాట్లాడుకుని రాజీ మార్గంలో కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు..కోర్టుల చుట్టూ తిరగడం కంటే.. కక్షలు మరిచి, రాజీపడి, సంతోషంగా జీవించడం ఎంతో మంచిది.అందువల్ల అర్హత ఉన్న కేసులకు సంబంధించిన ఇరువర్గాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సెప్టెంబర్ 12న జరిగే లోక్ అదాలత్‌కు హాజరై తమ కేసులను పరిష్కరించుకోవాలని కొత్తగూడ ఎస్సై రాజ్ కుమార్ కోరుతున్నారు

గురువులకు ఘన సన్మానం

ప్రజా వాయిస్, కోరుట్ల:

స్థానిక కాల్వగడ్డ బాయ్స్ హైస్కూల్‌లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్ ముఖ్య అతిథులుగా హాజరై రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జువ్వాడి కృష్ణారావు మాట్లాడుతూ.. గొప్ప తత్వవేత్తగా, దేశ తొలి ఉపరాష్ట్రపతిగా, రెండో రాష్ట్రపతిగా రాధాకృష్ణన్ అందించిన సేవలు మరువలేనివన్నారు. విద్యార్థులు ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షాహిద్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తిరుమల గంగాధర్, మండల మాజీ అధ్యక్షులు కొంతం రాజం, కౌన్సిలర్ శోగ్రాఫి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపూర్ గేట్ వద్ద కారు-ఆటో ఢీ

నలుగురికి తీవ్ర గాయాలు.. గాజు పెంకులు తొలగించిన పోలీసులు..

ప్రజా వాయిస్ టేక్మాల్:

టేక్మాల్ మండలం వెంకటాపూర్ గేట్ వద్ద కారు, ఆటో ఢీకొన్న ఘటనలో నలుగురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదంలో ఆటో దెబ్బతినడంతో రోడ్డుపై గాజు పెంకులు చెల్లాచెదురుగా పడ్డాయి.స్థానికులు సమాచారం అందించడంతో పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని ప్రమాద పరిస్థితిని పరిశీలించారు. గాయపడిన నలుగురిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.కాగా, రోడ్డుపై పడిన ఆటో గాజు పెంకులతో వాహనదారులకు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా టేక్మాల్ ఎస్ఐ అరవింద్ కుమార్ పోలీస్ సిబ్బంది సహాయంతో వాటిని తొలగించి రోడ్డును శుభ్రం చేయించారు. పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి ప్రమాదానికి సంబంధించిన వివరాలను సేకరిస్తున్నారు.

కాంగ్రెస్ హామీలపై తాడ్వాయిలో బీఆర్ఎస్ వంటావార్పు

ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

రైతులు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులకు న్యాయం చేయాలి

ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం ఆగదు

ప్రజా వాయిస్ ములుగు జిల్లా; తాడ్వాయి మండలం:/

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తాడ్వాయి మండల కేంద్రంలో వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ములుగు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ బడే నాగజ్యోతి, ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు హాజరై నిరసనలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ..... ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. రైతులు, విద్యార్థులు, మహిళలు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించి పరిష్కార చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మరిన్ని నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలబడి పోరాడుతుందని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ పోరిక గోవింద నాయక్, ములుగు జిల్లా సీనియర్ నాయకుడు, ఉద్యమకారుడు తుమ్మ మల్లారెడ్డి, జిల్లా నాయకులు కాకులమర్రి ప్రదీప్ రావు, జగదీష్, తాటి కృష్ణ, కర్ర రవీందర్, ఎండీ ఖాజాపాషా, తాడ్వాయి మండల అధ్యక్షుడు దండుగుల మల్లయ్య, ప్రధాన కార్యదర్శి పోగు నాగేష్, సహకార సంఘం ఉపాధ్యక్షుడు ఇందారపు లాలయ్య, సర్పంచ్ ప్రవళిక గున్ను, కొమరం శైలజ, దిడ్డి మోహన్ రావు, జాజా విజయ చంద్రం, ఉప సర్పంచులు దుర్గం నవీన్, పాలకుర్తి బాబు, మాజీ ఆత్మ చైర్మన్ దుర్గం రమణయ్య, మాజీ ట్రస్ట్ బోర్డు చైర్మన్లు రేగ నర్సయ్య, కాక లింగన్న, మాజీ మండల అధ్యక్షుడు నుషెట్టి రమేష్, మాజీ జడ్పీటీసీ రామసహాయం శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచులు చీడం బాబురావు, గొంది శ్రీధర్, మోహనరావు, సిద్దబోయిన శివరాజ్, మాజీ ఎంపీటీసీలు లిలిముండ్రాతి రాజమౌళి, పాయం నర్సింగరావు, ధనుక నర్సింగరావు, మండల యువజన అధ్యక్షుడు కోట సురేష్, సీనియర్ నాయకులు లిలియాదిరెడ్డి, పత్తి గోపాల్ రెడ్డి, ఏడవెల్లి మధు, సతీష్ చారీ, భుక్య శ్రీను, కాయం ఎల్లయ్య, యలం విక్రమ్, శేషగిరి, బంగారి శ్రీరాములు, చింతల కొమరయ్య, వహీద్, తిరుపతి, నీలం రాములు, గజ్జెల మహేష్, జీడి బాబు, వెంకట్రామ్, ఎండీ రఫిక్, సిద్ధబోయిన వసంతరావు, అర్రెం కృష్ణ, బీఆర్ఎస్ విద్యార్థి విభాగం జిల్లా నాయకుడు కొమరం సిద్దు, యువజన నాయకులు మనోజ్ రెడ్డి, సురేందర్ సింగ్, శ్రావణ్, నవీన్, ప్రసాద్ చారీ, తడక సాయి కిరణ్, ఎల్‌పీ వెంకటేష్, వంశీ, ప్రణయ్, మహేందర్, తడక హరీష్, నితిన్, శివాజీ, ఇసం సంబన్న, చన్ను శివ, దేవరాజ్, బన్నీ, సంజీవ రెడ్డి, విజయ్ కుమార్, రాకేష్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చరిత్రను తొక్కేస్తే.. కనుమరుగవుతుందా.?

తరతరాల త్యాగాలకు సాక్ష్యంగా బంజారా జీవనం

సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణే నేటి తరానికి అసలైన బాధ్యత

ప్రజా వాయిస్,ప్రత్యేక కథనం:

చరిత్రను ఎవరు రాసినా.. తరతరాల జ్ఞాపకాలను చెరిపేయడం అంత సులువు కాదు. రాజ్యాలు మారాయి.. పాలకులు మారారు.. కాలం మారింది.. కానీ పూర్వీకుల జీవన అనుభవాల నుంచి పుట్టిన సంస్కృతి, సంప్రదాయాలు మాత్రం తరతరాలకు వారసత్వంగా వస్తూనే ఉన్నాయి. అలాంటి విశిష్టమైన జీవన సంప్రదాయాన్ని కలిగిన సమాజాల్లో బంజారా సమాజం ఒకటి.బంజారాలు ఎవరు వారి మూలాలేమిటి భారతదేశ చరిత్రలో వారి పాత్ర ఎంత దేశం కోసం వారి పూర్వీకులు చేసిన పోరాటాలేమిటి? నేటి తరం తమ సంస్కృతిని ఎలా కాపాడుకోవాలి అనే ప్రశ్నలు నేడు మరోసారి చర్చకు వస్తున్నాయి.

దేశమంతా విస్తరించిన సమాజం

బంజారాలను వివిధ ప్రాంతాల్లో లంబాడి, సుగాలి, బంజారా తదితర పేర్లతో పిలుస్తారు. రాజస్థాన్ ప్రాంతంతో తమ చారిత్రక మూలాలను అనుసంధానించుకునే బంజారా సమాజం నేడు దేశంలోని అనేక రాష్ట్రాల్లో విస్తరించింది. భాష, వస్త్రధారణ, ఆభరణాలు, వివాహ పద్ధతులు, పండుగలు, ఆచార వ్యవహారాలు, సామాజిక కట్టుబాట్లు ఈ సమాజానికి ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయి.బంజారా సమాజపు చరిత్రలో మరో ప్రత్యేకత ఉంది. వారి పూర్వీకుల కథలు, వంశగాథలు, వీరగాథలు ఎక్కువగా మౌఖిక సంప్రదాయంలోనే తరతరాలకు చేరాయి. తాతలు చెప్పిన కథలను మనవళ్లు వినడం.. పాటల రూపంలో చరిత్రను గుర్తుంచుకోవడం.. ఆచారాల ద్వారా గతాన్ని సజీవంగా ఉంచడం బంజారా జీవనంలో భాగమైంది.

వీరగాథలతో ముడిపడిన మూలాలు

బంజారా సమాజంలోని పలు వర్గాలు తమ మూలాలను రాజపుత్ర వంశాలతో అనుసంధానించుకుంటాయి. రాథోడ్, చౌహాన్, పవార్, జాదవ్ వంటి వంశపేర్లు బంజారా సమాజంలో ప్రాచుర్యంలో ఉన్నాయి.పృథ్వీరాజ్ చౌహాన్, రాణా ప్రతాప్ వంటి చారిత్రక వీరులతో బంజారా సమాజానికి వంశపారంపర్య సంబంధం ఉందనే విశ్వాసం కూడా సమాజంలో బలంగా ఉంది. విదేశీ దండయాత్రలను ఎదుర్కొన్న వీరుల సంతతిగా తమను తాము భావించుకునే బంజారాలు.. దేశ రక్షణ కోసం పూర్వీకులు చేసిన త్యాగాలను తమ సామూహిక స్మృతిలో ఇప్పటికీ పదిలంగా ఉంచుకున్నారు.అయితే ఈ అంశాల్లో కొన్ని చరిత్రకారుల మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ.. బంజారా సమాజం తమ మూలాలు, వీరగాథలను తమ సామాజిక గుర్తింపులో కీలక భాగంగా భావించడం మాత్రం వాస్తవం.

పృథ్వీరాజ్ వీరగాథ

పృథ్వీరాజ్ చౌహాన్,మహమ్మద్ ఘోరీకి సంబంధించిన గాథ బంజారా సమాజంలో తరతరాలుగా వినిపించే వీరగాథల్లో ఒకటి. గురువు, కవి చాంద్ బర్దాయి సహాయంతో పృథ్వీరాజ్ శబ్దభేదీ బాణంతో ఘోరీని సంహరించాడనే కథ ప్రజల్లో ప్రసిద్ధి చెందింది. ఈ గాథలో చరిత్ర ఎంత.. జానపద విశ్వాసం ఎంత అన్నదానిపై చర్చ ఉన్నప్పటికీ.. ఒక విషయం మాత్రం స్పష్టం. బంజారా సమాజం తన పూర్వీకుల వీరత్వాన్ని కేవలం కథగా కాకుండా తమ ఆత్మగౌరవానికి ప్రతీకగా భావిస్తోంది.

అడవుల బాట పట్టిన జీవితం

కాలక్రమంలో జరిగిన యుద్ధాలు, రాజకీయ మార్పులు, దండయాత్రలు అనేక సంచార సమూహాల జీవనాన్ని ప్రభావితం చేశాయి. రాజ్యాధికారం కోల్పోయిన అనేక వర్గాలు అడవులు, మారుమూల ప్రాంతాలను ఆశ్రయించాల్సి వచ్చింది.బంజారా సమాజపు చరిత్రలోనూ సంచార జీవనం ఒక ముఖ్యమైన దశగా నిలిచింది. పశుపోషణ, వ్యాపారం, రవాణా వంటి వృత్తులతో జీవనం సాగిస్తూ తండాలుగా స్థిరపడ్డారు.

బ్రిటిష్ పాలనలో కష్టాలు

బ్రిటిష్ పాలనలో సంచార, అర్ధసంచార సమూహాలపై తీవ్రమైన అనుమానాలు నెలకొన్నాయి. 1871లో బ్రిటిష్ ప్రభుత్వం తీసుకొచ్చిన క్రిమినల్ ట్రైబ్స్ యాక్ట్ అనేక సమూహాలను 'నేరపూరిత తెగలు'గా వర్గీకరించింది. ఈ చట్టం కారణంగా అనేక సంచార సమాజాలు సామాజికంగా, ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నాయి.ఆ ముద్ర తరతరాల జీవితాలను ప్రభావితం చేసింది. స్వేచ్ఛగా సంచరించిన సమాజం అనుమానిత సమాజంగా మిగిలింది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాతే ఆ చట్టం రద్దయింది.

తండానే ఒక ప్రపంచం

బంజారా సంస్కృతికి తండా ఒక జీవన పాఠశాల. పుట్టుక నుంచి వివాహం వరకు.. పండుగ నుంచి మరణ సంస్కారం వరకు.. ప్రతి సందర్భానికీ ప్రత్యేకమైన ఆచార వ్యవహారాలున్నాయి.బంజారా మహిళల సంప్రదాయ వస్త్రధారణ, రంగురంగుల అద్దాల అలంకరణ, ఆభరణాలు.. పురుషుల సంప్రదాయ వేషధారణ.. జానపద గేయాలు, నృత్యాలు.. ఇవన్నీ ఆ సమాజపు ప్రత్యేకతకు అద్దం పడుతున్నాయి.తండాలో పెద్దల మాటకు విలువ ఇవ్వడం, సామాజిక కట్టుబాట్లను పాటించడం, సామూహికంగా నిర్ణయాలు తీసుకోవడం వంటి సంప్రదాయాలు కూడా తరతరాలుగా కొనసాగాయి.

కనుమరుగవుతున్న భాష..మారుతున్న సంస్కృతి

అభివృద్ధి కొత్త అవకాశాలను తీసుకొచ్చింది. విద్య, ఉద్యోగాలు, పట్టణీకరణ, ఆధునిక జీవన విధానం బంజారా సమాజంలోనూ మార్పులు తీసుకొచ్చాయి. అయితే అదే సమయంలో భాష, సంప్రదాయ వస్త్రధారణ, జానపద గేయాలు, ఆచారాలు, తండా జీవన పద్ధతులు క్రమంగా కనుమరుగయ్యే ప్రమాదం కనిపిస్తోంది.ఒక తరం తమ మాతృభాషను మాట్లాడకపోతే.. మరో తరం దానిని అర్థం చేసుకోకపోతే.. మూడో తరానికి అది కేవలం ఒక జ్ఞాపకంగా మిగిలిపోతుంది.

వారసత్వాన్ని కాపాడటం ఎవరి బాధ్యత.?

బంజారా సంస్కృతిని కాపాడాల్సిన బాధ్యత ఒక్క ప్రభుత్వానిదే కాదు. సమాజంలోని ప్రతి కుటుంబానిదీ.పిల్లలకు తండా చరిత్ర చెప్పాలి. మాతృభాషను మాట్లాడేలా ప్రోత్సహించాలి.పూర్వీకుల జానపద గేయాలు, కథలు, వీరగాథలను భద్రపరచాలి.సంప్రదాయ కళలు, వస్త్రధారణ, ఆచారాలను డాక్యుమెంట్ చేయాలి.పెద్దల వద్ద ఉన్న మౌఖిక చరిత్రను రికార్డు చేసి భవిష్యత్ తరాలకు అందించాలి.చరిత్ర పుస్తకాల్లో రాయకపోతే చరిత్ర కాదని కాదు.పూర్వీకుల జ్ఞాపకాల్లో బతికే చరిత్రను భవిష్యత్ తరాలకు అందించకపోవడమే అసలైన నష్టం.బంజారా సంస్కృతి కేవలం గతానికి సంబంధించిన జ్ఞాపకం కాదు.. అది ఒక జీవన విధానం. తండా కేవలం నివాస ప్రాంతం కాదు.. అది తరతరాల సంస్కృతికి నిలయం.చరిత్రను తొక్కేస్తే కనపడదనుకోవచ్చు..కానీ దాన్ని జీవించే జాతి ఉన్నంతకాలం వెలికితీయకుండా ఆపలేరు.అందుకే..బంజారా సంస్కృతి పరిరక్షణ నినాదం కాకూడదు.ప్రతి బంజారా ఇంటి నుంచే మొదలయ్యే బాధ్యత కావాలి.

కోటియ నాయక్ భూక్య,
కోదాడ,
సూర్యాపేట జిల్లా

యువతను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్: చల్లా ధర్మారెడ్డి

కాంగ్రెస్ 1000 రోజుల దగా పాలనపై బీఆర్ఎస్ పోరుబాట..

పరకాలలో అంబేద్కర్ సెంటర్ నుంచి బస్టాండ్ వరకు భారీ ర్యాలీ..

అంబేద్కర్ సెంటర్లో ధర్నా..పోలీసుల అత్యుత్సాహంతో తోపులాట..

విద్యార్థులను అడ్డుకున్న పోలీసుల తీరుపై చల్లా ధర్మారెడ్డి ఆగ్రహం..

ప్రజా వాయిస్ హన్మకొండ /పరకాల

పరకాల: ఎన్నికల ముందు యువతకు అరచేతిలో వైకుంఠం చూపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను గాలికొదిలేసిందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మండిపడ్డారు. విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి యువత తగిన గుణపాఠం చెబుతుందని హెచ్చరించారు.కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల విఫల పాలనకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా నాలుగో రోజు పరకాల పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సెంటర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ బస్టాండ్ కూడలి వరకు సాగి తిరిగి అంబేద్కర్ సెంటర్‌కు చేరుకుంది. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు స్వచ్ఛందంగా ర్యాలీలో పాల్గొని తమ మద్దతు తెలిపారు.అయితే ర్యాలీలో పాల్గొనేందుకు వస్తున్న పాలిటెక్నిక్ విద్యార్థులను పోలీసులు అడ్డుకోవడంపై చల్లా ధర్మారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "విద్యార్థులను చూస్తే రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి ఎందుకంత భయం? ప్రశ్నించే గొంతులను అడ్డుకోవడం చేతగాని పాలనకు నిదర్శనం" అని విమర్శించారు.

హామీలు ఎక్కడ రేవంత్‌రెడ్డి?

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా యువతను మోసం చేస్తోందని చల్లా ధర్మారెడ్డి ఆరోపించారు. నిరుద్యోగులకు నెలకు రూ.4,000 భృతి ఏమైంది? తొలి ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయి? జాబ్ క్యాలెండర్ ఎక్కడ? యూత్ కమిషన్ ఏర్పాటు ఏమైంది?విద్యార్థులకు రూ.10 లక్షల వడ్డీలేని రుణాలు ఎక్కడ?విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటీలు ఏమయ్యాయి?రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు ఎక్కడ?ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయి?ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు విదేశీ విద్య కోసం రూ.25 లక్షల ఆర్థిక సహాయం ఎక్కడ?

బీఆర్ఎస్ హయాంలో.. విద్యారంగానికి పెద్దపీట..

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టామని చల్లా ధర్మారెడ్డి తెలిపారు.294 నుంచి 1,000కు పైగా గురుకులాలు, జూనియర్ కళాశాలలు, ప్రత్యేక మైనార్టీ గురుకులాలు ఏర్పాటు చేశామని చెప్పారు. 'మన ఊరు--మన బడి', 'మన బస్తీ--మన బడి' కింద రూ.7,900 కోట్లతో పాఠశాలల్లో మౌలిక వసతులు అభివృద్ధి చేశామని ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లతో పాటు కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటు, యూనివర్సిటీల బలోపేతం చేపట్టామని పేర్కొన్నారు. మహాత్మా జ్యోతిబా పూలే, అంబేద్కర్ విదేశీ విద్యానిధి పథకాల ద్వారా విదేశీ విద్యకు ఒక్కో విద్యార్థికి రూ.20 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించామని తెలిపారు.

జీఓ 97ను వెంటనే రద్దు చేయాలి..

పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని జీఓ 97ను వెంటనే రద్దు చేయాలని చల్లా ధర్మారెడ్డి డిమాండ్ చేశారు.

యువత భవిష్యత్తుతో ఆడుకుంటే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదు. విద్యార్థులకు ఇచ్చిన ప్రతి హామీ అమలు చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాం.. ప్రజాక్షేత్రంలో నిలదీస్తాం" అని చల్లా ధర్మారెడ్డి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, యువజన నాయకులు, విద్యార్థులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాజారాం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో
ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

-విద్యార్థిని విద్యార్థులు గోప్ప స్థాయికీ ఎదగాలి
-రాజారాం గ్రామ సర్పంచ్ జెల్ల బుచ్చన్న

ధర్మపురి, సెప్టెంబర్ 05 (ప్రజా వాయిస్) :
జగిత్యాల జిల్లాలోని ధర్మపురి మండలం లోని రాజారాం గ్రామంలో గల స్థానిక మండల పరిషత్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణ యందు.. శనివారం రోజు ఉదయం వేళలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుక లను ఎంతో ఘనంగా నిర్వహించారు. ఇట్టి కార్యక్రమ నిర్వహణ శుభ సందర్భంగా డాక్టర్ సర్వే పల్లి రాధా కృష్ణన్ చిత్ర పటానికి పూల మాల వేసి అలంకరించారు. కార్యక్రమ తధానంతరం మండల పరిషత్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి ఎంతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమ అనంతరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సరఫరా చేసిన షూ లను విద్యార్థిని విద్యార్థులు అందరికీ పంపిణీ చేశారు. తదుపరి కార్యక్రమనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన

రాజారాం గ్రామ సర్పంచ్ జెల్ల బుచ్చన్న కార్యక్రమన్ని ఉద్దేశించి మీడియా సమావేశం నందు మాట్లాడుతూ.. విద్యార్థిని విద్యార్థులు అందరు చాలా చక్కగా చదువుకుని గోప్ప స్థాయికీ ఎదిగి తమ తల్లిదండ్రులకు, తమ గ్రామానికి మంచి పేరు తీసుకోని రావాలి అని, కార్యక్రమాన్ని ఉద్దేశించి తమ అమూల్యమైన సందేశాన్ని ఇచ్చారు. రాజారాం మండల పరిషత్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ఎల్లవేళలా తమ వంతుగా తమ సహాయ సహకారాలను అందిస్తాం అని వారు తమ హామీని ఇచ్చారు.ఇట్టి కార్యక్రమంలో వారితో పాటు, రాజారాం

మండల పరిషత్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు సాధు శ్రీకాంత్, రాజారాం గ్రామ ఉప సర్పంచ్ జెల్ల బుచ్చన్న, రాజారాం గ్రామ పంచాయతీ నాలుగవ వార్డు సభ్యుడు కాంపెల్లి రవి, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు బండారి సతీష్ కుమార్, చుంచు కాల శ్వేతా రాణి, చల్ల కృష్ణ లతో పాటు, ప్రీ ప్రైమరీ ఉపాధ్యాయురాలు మంజుల, ఆయా శ్యామల, అంగన్ వాడీ ఉపాధ్యాయురాలు స్వరూప, అధికారులు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, విద్యార్థిని విద్యార్థులు, మండల పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి ఒక న్యాయం..సామాన్యులకు మరో న్యాయమా?

ప్రభుత్వాన్ని నిలదీసిన ఎంపీ రఘునందన్ రావు
పటాన్చెరు లో 22 ఏ బాధితులకు సంఘీభావం

పటాన్ చెరువు ప్రజావాయిస్
రాష్ట్రంలో సిఎం కు ఒక న్యాయం,సామాన్యులకు మరో న్యాయమా అని ప్రభుత్వాన్ని మెదక్ ఎంపీ రఘునందన్ రావు ప్రశ్నించారు. పట్టణంలోని సింఫోనీ పార్క్ హోమ్స్ లో శనివారం ఉదయం 22 ఏ బాధితులతో సమావేశమై వారికి సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం,రెవిన్యూ మంత్రి పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.22 ఏ పేరుతో రాష్ట్రంలో అరాచకం సృష్టిస్తున్నారని ఆరోపించారు.పటాన్చెరు పట్టణంలో 55 ఎకరాల్లో 953 ఇళ్లతో నిర్మించిన సింఫోనీ పార్కు హోమ్స్ కాలనీని 22 ఏ పరిధిలోకి తీసుకురావడాన్ని తీవ్రంగా ఖండించారు.55 ఎకరాల రైతుల భూములు బిల్డర్ తీసుకుని వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చాలని దరఖాస్తు చేస్తే రెవిన్యూ అధికారులు రికార్డులు పరిశీలించి వ్యవసాయేతర భూమిగా మార్చారన్నారు.ఆ తరువాత బిల్డర్ ఫ్లఎఱు కి వెళ్లి లే అవుట్ అనుమతి తీసుకున్నారని,అనంతరం ghmc అనుమతి తో ఇల్లు నిర్మించారన్నారు.ఈ అనుమతులన్నీ చూసి సాఫ్ట్ వేర్ ఉద్యోగులు ఇల్లు

కొనుక్కుని గత 12 ఏళ్లుగా నివసిస్తున్నారని అన్నారు.అనుమతులన్నీ 2013 లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిందని,ఇప్పుడు తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వమే నిషేధిత జాబితాలో చేర్చడం దారుణమని మండిపడ్డారు.పాలన చేతకాక గుంపు మేస్త్రీ రేవంత్ రెడ్డి తిక్క తిక్క పనులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రభుత్వ వ్యవస్థలపై ప్రజలకు నమ్మకం పోయేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.సీఎం,రెవిన్యూ మంత్రి ఆస్తులను ఒక్కరోజులో నిషేధిత జాబితా నుంచి తొలగించిన విధంగానే సామాన్యులవి తొలగించాలని డిమాండ్ చేశారు.తప్పు జరిగిందని స్వయంగా రెవిన్యూ మంత్రి పొంగులేటి ఒప్పుకున్నప్పుడు తప్పుచేసిన వారిపై చర్యలు తీసుకుని ప్రజల ఆస్తులను 22 ఏ నుంచి

ఎందుకు తొలగించరని ప్రశ్నించారు.సాఫ్ట్వేర్ ఉద్యోగులు సోషల్ మీడియాను అస్త్రంగా మార్చుకుని ఉద్యమించాలని పిలుపునిచ్చారు.ప్రభుత్వాన్ని అసెంబ్లీ వేదికగా నిలదీస్తామని,అప్పటికీ దిగిరాక పోతే ప్రజల తరపున పోరాడుతామని హెచ్చరించారు.ఈ సందర్భంగా సింఫోనీ పార్క్ హోమ్స్ కి రెవిన్యూ,ఫ్లఎఱు,స్ట్రక్చఎఇ ఇచ్చిన అనుమతుల కాపీలను ఆయన ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి,ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి,దిశ కమిటీ సభ్యుడు కాసాల సుధాకర్,కాలనీ అధ్యక్షుడు విజయ్ రాజ్,ప్రధాన కార్యదర్శి సత్యారావు,పటాన్చెరు నియోజకవర్గం బీజేపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న సాగర్ నిర్వాసితుల పరిస్థితి అత్యంత దయనీయం

- నమ్మించి నట్టేట ముంచిన బిఆర్ఎస్ ప్రభుత్వం
- అండగా ఉంటానని హామీ ఇచ్చి చేతులెత్తేసిన రేవంత్ రెడ్డి
- టిఆర్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, గజ్వేల్ నియోజకవర్గ బాధ్యులు కొట్టాల యాదగిరి

ప్రజా వాయిస్ గజ్వేల్ :
మల్లన్న సాగర్ నిర్వాసితుల బ్రతుకులు అత్యంత దయనీయంగా ఉన్నట్లు టిఆర్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, గజ్వేల్ నియోజకవర్గ బాధ్యులు కొట్టాల యాదగిరి ముదిరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం గజ్వేల్ శివారులోని ఆర్అండ్ఆర్ కాలనీ సందర్శించి ముంపు బాధితులతో కలిసి మీడియాతో మాట్లాడారు. మల్లన్న సాగర్ రిజర్వాయర్ నిర్మాణం కోసం సర్వం కోల్పోయిన బాధితులను ఆదుకోవాల్సిన అప్పటి సీఎం కేసీఆర్ పట్టించుకోకపోగా, మాజీ మంత్రి హరీష్ రావు, అప్పటి కలెక్టర్ వెంకట్రాంరెడ్డి హామీల పేరుతో నమ్మించి గొంతు కోసినట్లు స్పష్టం చేశారు. అయితే అండగా ఉంటానని హామీ ఇచ్చిన ఇప్పటి సీఎం రేవంత్ రెడ్డి చేతులెతేయగా, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కండ్లు తెరిపించి అప్పటి హామీలు

సాధిస్తామని తెలిపారు. ప్రాణహిత--చేవెళ్ల ప్రాజెక్టు రీడిజైన్ తో కాళేశ్వరం ప్రాజెక్టుగా మార్చగా, కొండపాక, తొగుట మండలాల పరిధిలోని 7 పంచాయతీలు, ఆరు ఆవాస గ్రామాలను ముంపు ప్రాంతాలుగా గుర్తించి బాధితులను అర్ధరాత్రి అపరాత్రి అనకుండా ఈడ్చికొచ్చినట్లు గుర్తు చేశారు. మున్సిపల్ పరిధిలో అరకొర వసతుల మధ్య పునరావాసం కల్పించగా, స్థిరమైన ఉపాధి లేక వారు అర్ధాకలితో చస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా మల్లన్న సాగర్ లో చేపలు పట్టే అవకాశం అనుమతి ఇవ్వకపోవడం, జీవనోపాధి లేకపోవడం, బ్యాంకర్లు ముందుకు రాకపోవడం తదితర కారణాలతో ముంపు బాధితులు నిత్య సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నట్లు పేర్కొన్నారు. అయితే వివిధ రకాల హామీలు, పరిహారం చెల్లింపు, వర్గల్ పారిశ్రామికవాడలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని అరచేతిలో వైకుంఠం చూపిన హరీష్ రావు, వెంకట్రాంరెడ్డి పత్తా లేరని అన్నారు. ఎన్నికల్లో లబ్ధి పొందడం కాకుండా నిర్వాసితులకు పునరావాసంతో పాటు గౌరవప్రదమైన జీవితం, స్థిరమైన ఉపాధి, ఆదాయ వనరులు సమకూర్చాలని డిమాండ్ చేశారు. అయితే భూ నిర్వాసితులకు ఇచ్చిన హామీల్లో భాగంగా పరిశ్రమల్లో అవకాశం ఇవ్వాలని, మల్లన్న సాగర్ రిజర్వాయర్ లో చేపల పెంపకం చేపట్టి పట్టుకునీ అవకాశం ఇవ్వాలని, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలను గుర్తించి ఆదుకోవాలని, ప్రభుత్వం నేరుగా ప్రజా దర్బార్ నిర్వహించి సమస్యలు పరిష్కరించాలని స్పష్టం చేశారు. లేని పక్షంలో నిర్వాసిత గ్రామాలకు ప్రజలతో కలిసి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. సర్వం కోల్పోయిన బాధితుల ఆగ్రహానికి గురికాకముందే బిఆర్ఎస్ నేతలు, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి ఎడ్ల నర్సింలు, పట్టణ యువజన అధ్యక్షులు కూరాకుల శ్రీకాంత్, లింగని రాజు, నాంపల్లి, నరేష్ చారీ తదితరులు పాల్గొన్నారు

ఒక్క ఏడాదిలోనే 2,500 పైచిలుకు విద్యార్థుల పెరుగుదల

ఎమంచిర్యాల జిల్లా విద్యాశాఖ రికార్డు విజయం!
విశిష్ట ప్రతిభా పురస్కారంతో మంచిర్యాలకు గర్వకారణం

ప్రజా వాయిస్ / మంచిర్యాల
మంచిర్యాల జిల్లా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపునకు విశేష కృషి చేసినందుకు మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్కు ప్రతిష్ఠాత్మక విశిష్ట ప్రతిభా పురస్కారం--2026 లభించింది. రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి చేతుల మీదుగా కలెక్టర్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. శనివారం కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపులో మంచిర్యాల జిల్లా సాధించిన విశిష్ట ప్రగతికి రాష్ట్ర ప్రభుత్వం ఈ గుర్తింపును అందించింది. 2025-26 విద్యా సంవత్సరంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 43,072 మంది విద్యార్థులు ఉండగా, 2026-27 విద్యా సంవత్సరంలో ఆ సంఖ్య 45,626కు చేరింది. దీంతో ఒక్క ఏడాదిలోనే అదనంగా 2,554 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరడం విశేషం. గత రెండేళ్లతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు 10.34 శాతం పెరిగినట్లు అధికారులు తెలిపారు.జిల్లాలోని 282 ప్రభుత్వ పాఠశాలల్లో 10 శాతానికి పైగా అదనపు విద్యార్థుల నమోదు సాధించడం గమనార్హం. మందమర్రి, నస్పూర్, జైపూర్, హాజీపూర్, భీమారం మండలాల్లో విద్యార్థుల నమోదు గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా 2026-27 విద్యా సంవత్సరంలో 4,346 మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలను వీడి ప్రభుత్వ పాఠశాలల్లో చేరడం, ప్రభుత్వ విద్యపై తల్లిదండ్రుల్లో పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనంగా నిలిచిందని అధికారులు పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మార్గదర్శకత్వంలో విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎంఐఎస్ సిబ్బంది, సీసీవోలు, సీఆర్పీలు సమన్వయంతో చేపట్టిన

కార్యాచరణ, నిరంతర పర్యవేక్షణ, సమష్టి కృషి ఫలితంగానే ఈ ఘనత సాధ్యమైందని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపుతో పాటు విద్యా ప్రమాణాల మెరుగుదలకు చేపట్టిన చర్యలకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు లభించడం పట్ల జిల్లా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యా సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. మంచిర్యాల జిల్లాకు రాష్ట్ర స్థాయిలో విశిష్ట గుర్తింపు దక్కడం యావత్ జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు.

విశిష్ట సేవలకు గుర్తింపుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

- కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్న కృష్ణప్రియ
- విద్యార్థుల సమగ్ర వికాసానికి విశేష కృషి

ప్రజా వాయిస్, సుల్తానాబాద్ : విద్యార్థుల విద్యా ప్రగతి, సమగ్ర వికాసమే ధ్యేయంగా అంకితభావంతో సేవలందిస్తున్న మాటేటి కృష్ణ ప్రియకు పెద్దపల్లి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. పెద్దపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష చేతుల మీదుగా ఆమె పురస్కారం అందుకున్నారు.విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి, చదువుతో పాటు క్రమశిక్షణ, సృజనాత్మకత, నైపుణ్యాల అభివృద్ధికి ఆమె చేస్తున్న కృషిని గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేశారు.కృష్ణ ప్రియకు అవార్డు లభించడం పట్ల ఇండియన్ పబ్లిక్ పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్ హర్షం వ్యక్తం చేసి అభినందించారు.విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఆమె సేవలు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ పురస్కారం పాఠశాలకే గర్వకారణమని తెలిపారు.

సూరారం గ్రామానికి బస్సు సౌకర్యం

మహిళల వినతి కి స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజా వాయిస్ ఎల్కతుర్తి
హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని సూరారం గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ గ్రామ మహిళలు రాష్ట్రమంత్రి పొన్నం ప్రభాకర్ కు వినతి పత్రం అందజేశారు. మహిళల విజ్ఞప్తికి స్పందించిన మంత్రి సూరారం గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో శనివారం హనుమకొండ నుంచి సూరారం గ్రామానికి ట్రయల్ గా బస్సులు నడిపించి గ్రామానికి బస్సు రాకపోకలకు అనుకూలతను పరిశీలించారు. దీంతో సూరారం గ్రామ ప్రజలు ముఖ్యంగా మహిళలు హర్షం వ్యక్తం చేశారు. గ్రామానికి బస్సు సౌకర్యం అందుబాటులోకి వస్తే విద్యార్థులు మహిళలు వృద్ధులు ఉద్యోగులు ఇతర ప్రయాణికులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని గ్రామస్తులు తెలిపారు. తమ విజ్ఞప్తికి స్పందించి బస్సు సౌకర్యం కల్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్ కు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూరారం గ్రామ శాఖ అధ్యక్షుడు బచ్చు శ్రీధర్ రావు, గ్రామ సర్పంచ్ నీల కొమురయ్య, ఉప సర్పంచ్ మేకల బాబు, కుర్ర ప్రకాష్, చల్లూరి వేణు, మహమ్మద్ జావిద్, మొలుగూరి భాస్కర్, పి. సంపత్, చత్రపతి, గ్రామపంచాయతీ కార్యదర్శి ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

- మండల విద్యాధికారి గజ్జెల కనకరాజు

ప్రజా వాయిస్ దౌల్తాబాద్, సెప్టెంబరు 5:
విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు నైతిక విలువలను అందించి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని మండల విద్యాధికారి గజ్జెల కనకరాజు అన్నారు. శనివారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని దౌల్తాబాద్ మండలం తిరుమలాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన గురుపూజోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు.విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. సమాజానికి మార్గనిర్దేశం చేసే ఆదర్శప్రాయమైన వ్యక్తులుగా ఉపాధ్యాయులు నిలవాలని పేర్కొన్నారు.ఈ సందర్భంగా భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవలను స్మరించుకున్నారు. ఉపాధ్యాయుడిగా ఆయన అందించిన సేవలు, విద్యారంగానికి చేసిన కృషి నేటి ఉపాధ్యాయులకు స్ఫూర్తిదాయకమని అన్నారు.మండలంలోని అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ఉపాధ్యాయులు శ్రీనివాస్రెడ్డి, ఉపాధ్యాయులు రజిని, శ్రీనివాస్, నగేష్, నరేందర్, శ్రీనివాస్, సీఆర్పీ నగేష్తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

అమెరికాలో కొడుకులు.. ఊళ్లో 30 ఎకరాల భూమి.. అయినా చేతిలో రేషన్ కార్డు! చిన్నకోడూరు తాసిల్దార్‌కు ఫిర్యాదు

ప్రజా వాయిస్: చిన్నకోడూరు

సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం మేడిపల్లి గ్రామంలో అర్హత లేని ఓ పెద్ద భూస్వామి కుటుంబానికి రేషన్ కార్డు కేటాయించడంపై వివాదం చెలరేగింది. గ్రామానికి చెందిన దాదాపు 30 ఎకరాల భూస్వామి ముఖిస పాపిరెడ్డి (సన్నాఫ్ నర్సింహారెడ్డి), అతని కుటుంబ సభ్యుల పేరిట అక్రమంగా రేషన్ కార్డు (నెంబర్: 369350099761) పొంది ప్రభుత్వ పథకాలను దుర్వినియోగం చేస్తున్నారంటూ అదే గ్రామానికి చెందిన బెజ్జంకి అనిల్ కుమార్ (సన్నాఫ్ రాజమల్లు) తాసిల్దార్ (ఎమ్మార్వో) గారికి రాతపూర్వక ఫిర్యాదు సమర్పించారు.ఫిర్యాదుదారుడు తెలిపిన వివరాల ప్రకారం... సదరు భూస్వామి కుమారులు అమెరికాలో ఉద్యోగాలు చేస్తూ ఆర్థికంగా ఎంతో ఉన్నత స్థితిలో ఉన్నప్పటికీ, తప్పుడు పత్రాలతో అధికారులను తప్పుదోవ పట్టించి ఈ వైట్ రేషన్ కార్డును సాధించారు.పేద ప్రజలకు అందాల్సిన సంక్షేమ పథకాలను ఇలాంటి ధనికులు అక్రమంగా అనుభవించడంపై గ్రామంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. తప్పుడు సమాచారంతో ప్రభుత్వాన్ని మోసం చేసిన సదరు లబ్ధిదారులపై, అలాగే ఎలాంటి క్షేత్రస్థాయి పరిశీలన లేకుండా కార్డు జారీ చేసిన అధికారులపై తక్షణమే సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అనిల్ కుమార్ తాసిల్దార్ గారిని గట్టిగా డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై స్పందించిన మండల రెవెన్యూ అధికారులు నిబంధనల ప్రకారం విచారణ జరిపి నివేదిక సమర్పిస్తామని హామీ ఇచ్చారు.

SIR ముసాయిదా ఓటర్ జాబితాలో నోటీసులు వచ్చిన వారిపట్ల అధికారులు స్పష్టత ఇవ్వాలి

ప్రతి ఒక్కరి ఓటు కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది

సామాజిక కార్యకర్త డాక్టర్ వేల్పుల శంకర్

సిద్దిపేట జిల్లా కోహెడ మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేసిన సామాజిక కార్యకర్త డాక్టర్ వేల్పుల శంకర్ కోహెడ మండలంలో గల అన్ని గ్రామాలలో ూ×= ఫారాలు అన్ని పరిశీలనలు నోటీసులు మండల వారీగా ఎన్ని ఉన్నాయి ఎంతమంది ఏ ఏ కారణాలతో తప్పిదాలు జరిగినాయి ఆ కారణాలకు సంబంధించిన బాధితులు ఓటర్లు ఏఏ పత్రాలు సమర్పించాలి వివరాలతో చెప్పాలి సంబంధిత బి ఎల్ వో లు పారాలిస్తూ ఫోటోలు తీసుకుని తప్ప వీటి గురించి వివరించడం లేదు కొన్ని ఓటర్లకు సంబంధించి వివరాల్లో వ్యత్యాసాలు ఉన్న కారణంగా నోటీసు జారీ చేసినట్లు సమాచారం అయితే మండల పరిధిలో మొత్తం ఎన్ని SIR పారాల స్వీకరించారు ఎన్ని ఎన్ని పారాలు పరిశీలించారు ఎన్ని ఓటర్లకు వివరాలు తప్పిదాలు గుర్తించారు ఎన్ని నోటీసులు జారీ చేశారు నోటీసులు జారీ చేసిన వారిలో ఎంతమంది సమాధానం ఇచ్చారు అనే పూర్తి వివరాలు అధికారులు ప్రజలకు వెల్లడించాలి. కోహెడ మండలంలోని అన్ని గ్రామాల వారిగా SIR పారాలు స్వీకరణ మ్యాపింగ్ తప్పిదాలు నోటీసుల వివరాలను పారదర్శకంగా ప్రకటించాలి ఎన్నికల ప్రక్రియ ప్రజాస్వామ్యానికి సంబంధించిన అత్యంత ముఖ్యమైన అంశం కాబట్టి అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సందేశాలకు సరైన సమాధానం ఇవ్వాలి మండల స్థాయిలో జరిగిన ప్రక్రియలకు సంబంధిత అధికారులు ప్రెస్ మీట్ నిర్వహించి గ్రామాల వారిగా పూర్తి గణనాలను బి వెల్లడించాలి. ఓటు హక్కు కలిగిన ఏ ఒక్క అర్హుడు పేరు కూడా తప్పిదాలు కారణంగా జాబితా లేకుండా పోకూడదు అధికారులు వెంటనే గ్రామాల వారిగా పూర్తి వివరాలను బహిర్గతం చేసి ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృతం చేయాలి.

విద్యుత్ శాఖలో శ్రీకాంత్ రెడ్డి పదేళ్ల సేవా ప్రస్థానం

ఘనంగా సత్కరించిన స్నేహితులు, స్థానికులు

మోటకొండూరు, సెప్టెంబర్ 5(ప్రజా వాయిస్):-

మండలంలోని నాంచారిపేట గ్రామ పంచాయతీ పరిధి తుంబాయి గ్రామానికి చెందిన పీసరి శ్రీకాంత్ రెడ్డి టీజీ ఎస్పీడీసీఎల్ (తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ) లో ఉద్యోగిగా చేరి పదేళ్లు విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను స్థానికులు, స్నేహితులు ఘనంగా సత్కరించారు. ఈ వేడుకను పురస్కరించుకుని సహచరులు శ్రీకాంత్ రెడ్డితో కేక్ కట్ చేయించి, శాలువాతో సన్మానించారు. పదేళ్లుగా ఆయన ప్రజలకు అందిస్తున్న సేవలను అభినందిస్తూ, భవిష్యత్తులో ఉద్యోగపరంగా మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాల సంఘం చైర్మన్ పైళ్ల సుదర్శన్ రెడ్డి, నాంచారిపేట 6వ వార్డు మెంబర్ పైళ్ల మహేష్ రెడ్డి, నాయకులు మామిడి రాజశేఖర్ రెడ్డి, పెద్దిరెడ్డి రామిరెడ్డి, టింకు, లింగం, నిరంజన్, రమేష్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్, కిరణ్, హేమంత్, రాజు తదితరులతో పాటు పలువురు స్నేహితులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గణేష్ మండపాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి

రోడ్లపై మండపాలు ఏర్పాటు చేయొద్దు నిర్వాహకులకు సూచనలు ఇస్తున్న ఎస్సై నరేష్ కుమార్

ప్రజా వాయిస్.. వనపర్తి

వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో వీపనగండ్ల మండలానికి చెందిన గణేష్ మండపాల నిర్వాహకులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి పోలీసులు సూచనలు, సలహాలు అందించారు ఈ సందర్భంగా ఎస్సై జె నరేష్ కుమార్ మాట్లాడుతూ,,, ఎవరూ రోడ్లపై గణేష్ మండపాలను ఏర్పాటు చేయరాదని సూచించారు.వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించే ప్రతి మండప నిర్వాహకుడు ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా శాంతియుత వాతావరణంలో వేడుకలు నిర్వహించాలని సూచించారు.

సంక్షేమ హాస్టళ్ల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని డిమాండ్

ప్రజా వాయిస్ ఆసిఫాబాద్

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలపై కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ హైదరాబాద్‌లో జరిగిన కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సమావేశంలో అభిప్రాయాలు వ్యక్తం చేశారు.జిల్లా అధికారులు హాస్టళ్లను తనిఖీ చేయకపోవడం వల్ల నిర్వహణ గాడి తప్పి విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దుర్గం దినకర్ వివరించారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాలు శిథిలావస్థకు చేరినా అధికారులు పట్టించుకోకపోవడంతో విద్యార్థులు కష్టతరమైన పరిస్థితుల్లో చదువుకోవాల్సి వస్తుందని పేర్కొన్నారు.జిల్లా కేంద్రంలో బీసీ బాలికల కళాశాల వసతి గృహాన్ని వెంటనే ప్రారంభించేలా జిల్లా కలెక్టర్ చొరవ తీసుకోవాలని, అద్దె భవనాల్లో కొనసాగుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలకు స్వంత భవనాలు మంజూరయ్యేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని దుర్గం దినకర్ డిమాండ్ చేశారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఆదే శివాజీకి ఘన సన్మానం

కొమురం భీమ్ జిల్లా కౌటాల మండల కేంద్రంలోని మాలి సంఘ భవనంలో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఆదే శివాజీని మాలి సంఘం నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. అవార్డు గ్రహీతతో పాటు సతీమణి లాస్యను నాయకులు శాలువాలతో సత్కరించారు.విద్యాబోధనలో విశేష ప్రతిభ కనబరుస్తూ విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేసిన ఆదే శివాజీకి జిల్లా స్థాయి అవార్డు రావడం మాలి సమాజానికి గర్వకారణమని నాయకులు అభిప్రాయపడ్డారు. మరిన్ని ఉన్నత స్థాయిలకు ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదే వసంత్ రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆదే నాందేవ్, జిల్లా ప్రధాన తదితరులు పాల్గొన్నారు.

కోతల బెడద తో ఇండ్లలో పంటలు వేయలేదు

ప్రజా వాయిస్ - బెల్లంపల్లి

మంచిర్యాల జిల్లా, బెల్లంపల్లి మండలం లోని అకెనపల్లి గ్రామంలో ప్రస్తుతం కోతుల బెడద చాలా ఎక్కువగా ఉంది. కోతులు గుంపులు.. గుంపులుగా వచ్చి ఇళ్ళల్లోకి చొరబడి గ్రామస్థులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. చేతికి దొరికిన వస్తువులను చిందర వందర చేస్తున్నాయి.ఇంటి ఆవరణ లోని కూరగాయ మొక్కలు, పండ్ల మొక్కలు, పూల మొక్కల్ని కొరికి పారేస్తున్నాయి.గతంలో ప్రతి ఇంటి ఆవరణలో ఇంటికి సరిపడా మొక్క జొన్న పంట వేసుకునేవారు .ఇప్పుడు కోతుల భయానికి ఎవరు కూడా ఆ పంట వేయడం లేదు. ఈ మధ్యనే గుడిపాటి శ్రీమతి అనే గ్రామ మహిళను కోతులు గుంపుగా వచ్చి తీవ్రంగా గాయపర్చాయి. ఈ ఘటనతో గ్రామస్తులు కోతులంటేనే జంకుతున్నారు .గ్రామ సర్పంచి సుదమల్ల వెంకటి సంబంధిత అధికారులను సంప్రదించగా ఖర్చులు గ్రామస్థులు భరిస్తే, వేరే చోట కోతులను పట్టుకెల్లి ఒది లేస్తామని అన్నారని చెప్పారు కానీ ఇంతవరకు ఎలాంటి చర్యలు లేవు, అధికారులు స్పందించి త్వరగా చర్యలు తీసుకొని,కోతుల బారి నుండి రక్షించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

జిల్లా స్థాయి అవార్డులు అందుకున్న మోత్కూరు ఉపాధ్యాయులు

ప్రజా వాయిస్ మోత్కూరు (సెప్టెంబర్ 5):

మోత్కూరు ఉన్నత పాఠశాల, మండల పరిధిలోని పాటిమట్ల ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఇ.రాంప్రసాద్ ,దర్శనం వెంకన్నలు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారు.ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ లో జరిగిన పురస్కార ప్రదాన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. అవార్డు గ్రహీతలను ప్రధాన ఉపాధ్యాయులు అరవిందరాయుడు మిర్యాల దామోదర్ డి వెంకటయ్య టి అంజయ్య లింగయ్య శ్రీనివాస్ రామకృష్ణ రవికుమార్ ఉప్పలయ్య గాదె వెంకటేశ్వర్లు తిరుపతి యాదయ్య తదితరులు అభినందించారు.కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి అడిషనల్ కలెక్టర్ భాస్కరరావు జిల్లా గ్రంథాలయ చైర్మన్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు యువత భవిష్యత్తుతో కాంగ్రెస్ చెలగాటం...

- 420 హామీల అమలులో ఘోర వైఫల్యం

- మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

ప్రజా వాయిస్, పెద్దపల్లి :

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో విద్యార్థులు, యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వారి భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని బీఆర్ఎస్ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఆరోపించారు. హామీల అమలులో ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ బీఆర్ఎస్ చేపట్టిన పోరుబాటలో భాగంగా పెద్దపల్లిలో శనివారం సుమారు 5 వేల మంది విద్యార్థులు, యువతతో భారీ ర్యాలీ నిర్వహించారు.వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి ప్రారంభమైన ర్యాలీ కమాన్, జెండా చౌరస్తా, పెద్ద మసీదు మీదుగా అమర్‌నగర్ చౌరస్తా, అయ్యప్ప టెంపుల్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా దాసరి మాట్లాడుతూ.. ప్రతి ఏడాది 2 లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి, మెగా డీఎస్సీ, యూత్ కమిషన్, వడ్డీలేని రుణాలు వంటి హామీలను ప్రభుత్వం అమలు చేయడం లేదని విమర్శించారు.ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా భరోసా వంటి విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 420 హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థి, యువజన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతకుంటలో తీజ్ పండుగ ముగింపు వేడుకలు వైభవంగా నిర్వహణ

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ మండలం చింతకుంట గ్రామంలో బంజారా సోదరుల సంప్రదాయ తీజ్ పండుగ ముగింపు వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప హాజరయ్యారు. కమిటీ సభ్యులు, గ్రామస్థులు కోనప్పకు ఘన స్వాగతం పలికి సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు.బంజారా సమాజంలో తీజ్ పండుగకు ప్రత్యేక ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యత ఉంది. తొమ్మిది రోజుల పాటు పంట ధాన్యాన్ని పవిత్రంగా భావించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. చివరి రోజున పూజించిన ధాన్యాన్ని దైవానికి సమర్పించి, కుటుంబాలు, గ్రామం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ పూజలు చేయడం ఆనవాయితీగా కొనసాగుతోంది. కోనప్ప బంజారా సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామంలోని పెద్దలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శాతవాహనుల యుగం (The Age of the Satavahanas)

మౌర్య సామ్రాజ్యం పతనానంతరం దక్కన్ ప్రాంతంలో అత్యంత శక్తివంతమైన స్థానిక రాజవంశంగా శాతవాహనులు అవతరించారు. పురాణాల లో వీరిని ఆంధ్రులు అని పేర్కొన్నారు. పురాణాల ప్రకారం వీరు సుమారు మూడు శతాబ్దాల పాటు పాలించారు. ఆధునిక చరిత్రకారుల అభిప్రాయం ప్రకారం శాతవాహనుల పాలన సుమారు క్రీ.పూ. 1వ శతాబ్దం నుండి క్రీ.శ. 3వ శతాబ్దం వరకు కొనసాగింది. శాతవాహనుల ప్రారంభ పాలకులు మహారాష్ట్ర ప్రాంతంలో అధికారాన్ని స్థాపించి, తరువాత ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మధ్యప్రదేశ్, గుజరాత్ వంటి ప్రాంతాలకు తమ సామ్రాజ్యాన్ని విస్తరించారు. ప్రారంభంలో వారి శాసనాలు ఎక్కువగా మహారాష్ట్రలో లభించాయి. తరువాత గోదావరి లోయను కేంద్రంగా చేసుకుని తమ రాజ్యాన్ని అభివృద్ధి చేశారు.

రాజకీయ చరిత్ర

శాతవాహనులలో అత్యంత ప్రసిద్ధ రాజు గౌతమీపుత్ర శాతకర్ణి (సుమారు క్రీ.శ. 106--130) శాతవాహనులలో అత్యంత గొప్ప రాజు. ఇతడు శక పాలకుడు నహపానుడిని ఓడించి కోల్పోయిన భూభాగాలను తిరిగి స్వాధీనం చేసుకున్నాడు. నహపానుడి వెండి నాణేలపై శాతవాహన ముద్రలను పునర్ముద్రించడం (రాజపితీతీఅఎఅస్త్ర) దీనికి ముఖ్యమైన ఆధారం. ఇతడు శకులను ఓడించి, నహపానుడిని జయించి కోల్పోయిన ప్రాంతాలను తిరిగి స్వాధీనం చేసుకున్నాడు. నాసిక్ ప్రాంతంలో లభించిన నహపానుడి వెండి నాణేలపై శాతవాహన ముద్రలు వేయించడం దీనికి నిదర్శనం. ఇతని సామ్రాజ్యం ఉత్తరాన మాళ్వా నుండి దక్షిణాన కర్ణాటక వరకు విస్తరించింది.గౌతమీపుత్రుని తరువాత వాశిష్ఠీపుత్ర పులుమావి (క్రీ.శ. 130--154) పాలించాడు. ఇతడు పైఠాన్ (ప్రతిష్ఠాన)ను రాజధానిగా చేసుకుని ఆంధ్ర ప్రాంతంపై తన అధికారాన్ని బలపరిచాడు. అనంతరం శకులతో మళ్లీ యుద్ధాలు జరిగాయి. శకరాజు రుద్రదామన్ శాతవాహనులను రెండుసార్లు ఓడించినప్పటికీ రుద్రదామన్ తన కుమార్తెను వాశిష్ఠీపుత్ర శాతకర్ణికి వివాహం చేయడంతో బంధుత్వ సంబంధాలు ఏర్పడ్డాయి. అందువల్ల శాతవాహనులను పూర్తిగా నిర్మూలించలేదని జునాగఢ్ శాసనం ద్వారా తెలుస్తుంది. చివరి ప్రముఖ రాజు యజ్ఞశ్రీ శాతకర్ణి (క్రీ.శ. 165--194). ఇతడు ఉత్తర కొంకణ్, మాళ్వా ప్రాంతాలను తిరిగి జయించి సముద్ర వాణిజ్యాన్ని అభివృద్ధి చేశాడు. ఇతని నాణేలపై ఓడ బొమ్మ ఉండటం విదేశీ వాణిజ్యానికి నిదర్శనం.

ఆర్థిక వ్యవస్థ

శాతవాహనుల కాలంలో వ్యవసాయం ప్రధాన వృత్తి. గోదావరి-కృష్ణా నదుల మధ్య ప్రాంతం పెద్ద వరి ఉత్పత్తి కేంద్రంగా అభివృద్ధి చెందింది. పత్తి ఉత్పత్తిలో ఆంధ్రదేశం ప్రసిద్ధి చెందింది. ఇనుముతో తయారైన నాగళ్లు, గొడ్డళ్లు, కొడవళ్లు, పారలు, బాణపు మొనలు వంటి వ్యవసాయ, యుద్ధ పరికరాలు విస్తృతంగా వాడుకలోకి వచ్చాయి. శాతవాహనులు బంగారు నాణేలు కాకుండా ప్రధానంగా సీసం, రాగి, కంచు, పోటిన్ నాణేలను ముద్రించారు. రోమన్లతో విస్తృతమైన విదేశీ వాణిజ్యం కొనసాగింది. గోదావరి-కృష్ణా ప్రాంతంలో లభించిన రోమన్ నాణేలు దీనికి నిదర్శనం.

పట్టణాభివృద్ధి

శాతవాహనుల కాలంలో పట్టణ జీవనం అభివృద్ధి చెందింది. కాల్చిన ఇటుకలతో ఇళ్లు, బావులు, మురుగు కాలువలు నిర్మించబడ్డాయి. అప్పటి కరీంనగర్ జిల్లాలో (ప్రస్తుత పెద్దపల్లి జిల్లా) ఉన్న పెద్దబంకూరులో జరిగిన తవ్వకాలలో ఇటుక నిర్మాణాలు, బావులు, ఇనుప పనిముట్లు బయటపడ్డాయి. గోదావరి--కృష్ణా ప్రాంతం ప్రముఖ వాణిజ్య కేంద్రంగా ఎదిగింది.

సామాజిక వ్యవస్థ

శాతవాహనులు మొదట దక్కన్ ప్రాంతానికి చెందిన ఒక తెగగా కనిపించిన తరువాత బ్రాహ్మణ మతాన్ని స్వీకరించారు. గౌతమీపుత్ర శాతకర్ణి వర్ణవ్యవస్థను పునరుద్ధరించానని ప్రకటించాడు. శకులు, స్థానిక గిరిజనులు క్రమంగా హిందూ సమాజంలో కలిసిపోయారు. వర్తకులు, శిల్పులు, సుగంధ ద్రవ్య వ్యాపారులు బౌద్ధ విహారాలకు విరాళాలు అందించేవారు. శాతవాహనుల ప్రత్యేకత మాతృనామ సంప్రదాయం. అందువల్ల గౌతమీపుత్ర, వాశిష్ఠీపుత్ర వంటి పేర్లు కనిపిస్తాయి. రాణులు కూడా దానధర్మాలు చేసి, కొన్నిసార్లు పాలనలో ముఖ్యపాత్ర పోషించారు.

పరిపాలనా వ్యవస్థ

శాతవాహన రాజు ధర్మ పరిరక్షకుడిగా భావించబడేవాడు. పరిపాలనా విభాగాలను ఆహారాలు (ూష్ట్రుతీఁం) అని పిలిచేవారు. అమాత్యులు, మహామాత్రులు వంటి అధికారులు పరిపాలన నిర్వహించేవారు. సేనాపతి కొన్నిసార్లు ప్రాంతీయ పాలకుడిగానూ వ్యవహరించేవాడు. గ్రామాల్లో శాంతిభద్రతల కోసం గౌల్మికులు సైన్యంతో నియమించబడేవారు. బ్రాహ్మణులు, బౌద్ధ సన్యాసులకు పన్ను మినహాయింపు గ్రామాలను దానం చేసే పద్ధతిని ప్రారంభించారు.

మతం

శాతవాహనులు బ్రాహ్మణ మతాన్ని ఆదరించి అశ్వమేధ, వాజపేయ వంటి వైదిక యజ్ఞాలు నిర్వహించారు. శ్రీకృష్ణుడు, వాసుదేవుడు వంటి దేవతలను ఆరాధించారు. అదే సమయంలో బౌద్ధమతానికీ ప్రోత్సాహం ఇచ్చి భూములను దానం చేశారు. అమరావతి, నాగార్జునకొండ, నాసిక్, జున్నార్ ప్రాంతాలు ప్రముఖ బౌద్ధ కేంద్రాలుగా అభివృద్ధి చెందాయి.

కళలు - వాస్తు

శాతవాహనుల కాలంలో చైత్యాలు, విహారాలు, స్తూపాలు నిర్మించబడ్డాయి. మహారాష్ట్రలోని కార్లే చైత్యం అత్యంత ప్రసిద్ధి చెందింది. ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి స్తూపం మరియు నాగార్జునకొండ బౌద్ధ కళా వైభవానికి చిరస్మరణీయ చిహ్నాలు. అమరావతి స్తూపంపై బుద్ధుని జీవిత ఘట్టాలను అద్భుతమైన శిల్పాల రూపంలో చెక్కారు.

భాష - సాహిత్యం

శాతవాహనుల శాసనాల ప్రధాన భాష ప్రాకృతం. అవి బ్రాహ్మీ లిపిలో చెక్కబడ్డాయి. శాతవాహన రాజు హాలుడు రచించిన గాథాసప్తశతి ప్రాకృత భాషలోని ప్రముఖ సాహిత్య గ్రంథం.

ముగింపు

శాతవాహనులు దక్కన్ ప్రాంత రాజకీయ, ఆర్థిక, సామాజిక, మత, సాంస్కృతిక రంగాల్లో విశేష అభివృద్ధికి కృషి చేశారు. వ్యవసాయం, విదేశీ వాణిజ్యం, పట్టణాభివృద్ధి, శిల్పకళ, బౌద్ధ--బ్రాహ్మణ మతాల అభివృద్ధి, ప్రాకృత సాహిత్య వికాసానికి వారు అందించిన సేవలు భారత చరిత్రలో విశిష్ట స్థానం సంపాదించాయి. శాతవాహనుల పాలన దక్షిణ భారత చరిత్రలో ఒక ముఖ్యమైన అధ్యాయంగా నిలిచింది.

వాసం రాజేష్

DME.MA.BLISC.P
GDCA.MCJ.PGD
HR.DRE.CPFN.(M
A{L})

సెల్:8555856450

భక్తిశ్రద్ధలతో ముత్యాలమ్మ జాతర

ప్రభలతో తరలివచ్చిన గ్రామస్తులు.. బోనాలతో అమ్మవారికి మొక్కులు

నూతన విగ్రహ ప్రతిష్ఠాపనతో నారాయణపురంలో పండుగ సందడి

ప్రజా వాయిస్,చిలుకూరు:

సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలంలోని నారాయణపురం (పాలేఅన్నారం) గ్రామంలో శనివారం ముత్యాలమ్మ పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభలతో ఊరేగింపుగా తరలివెళ్లారు. మహిళలు బోనాలు ఎత్తుకొని నూతనంగా ప్రతిష్ఠించిన ముత్యాలమ్మ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.అమ్మవారి ఆశీస్సులతో గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు కోరుకున్నారు. పండుగ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మండవ జయమ్మ వెంకటేశ్వర్లు, పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

చెన్నూర్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతం

మంత్రి వివేక్ వెంకటస్వామి

కమ్యూనిటీ భవనాలకు భూమి పూజ

కావాలనే ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలు చేస్తున్నారు

తెలంగాణ జీవగడ్డ:చెన్నూర్

మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని చెన్నూర్ ఎమ్మెల్యే, మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. చెన్నూర్ మున్సిపాలిటీలో యాభై లక్షల రూపాయల నిధులతో రెండు కమ్యూనిటీ భవనాలకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ చెన్నూరు లో రోడ్లు డ్రైనేజీలు అధ్వాన్నంగా ఉండేవని, తాను వచ్చాక సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్ పనులు చేశానని తెలిపారు. గతంలో ఇక్కడ ఏం పనులకు నిధులు మంజూరు చేయలేదని, చెన్నూరు లో కేవలం సెంట్రల్ లైటింగ్ రోడ్డు వెడల్పు పనులు చేశారని ఎన్నికల సమయంలో కేవలం శంకుస్థాపనలు చేసి కొబ్బరి కాయలు కొట్టారని అన్నారు.గత ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టర్ లకు నిధులు చెల్లించలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తాను ఎమ్మెల్యేగా చెన్నూరు రూపు రేఖలు మార్చాలని కృషి చేస్తున్నానని చెప్పారు. రోడ్డు వెడల్పు పనుల్లో స్థానిక ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కూల్చివేతలు చేసుకుంటున్నారని, రోడ్డు వెడల్పు పనుల్లో ఎవరైతే ఉపాధి కోల్పోతున్నారో వారికి షాప్స్ కట్టించి ఇవ్వడం జరుగుతుందని హామినిచ్చారు. మంచి నీటి పథకంలో భాగంగా ముప్పై కోట్ల రూపాయల నిధులతో పనులు జరుగుతున్నాయని, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల భవన పనులకు నిధులు ఇవ్వడం జరిగిందని, చెన్నూరు పట్టణాన్ని ఒక మోడల్ పట్టణంగా తీర్చిదిద్దుతానని, కావాలనే బీజేపీ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారు. గోదావరికి వెళ్లడానికి 10 వ వార్డులో రోడ్డు వెడల్పు కోసం 6 కోట్లు మంజూరు చేయడం జరుగుతుంది. పట్టణంలోని పోచమ్మ ఆలయ అభివృద్ధికి 2 కోట్ల నిధులు మంజూరు చేసాము. చెన్నూరు లో టూరిస్ట్ సెంటర్ గా ఏర్పాటు చేయడానికి 17 కోట్ల నిధులతో రూపకల్పన చేయడం జరుగుతుంది. ఈరోజు చెన్నూరు పట్టణంలో 3 కమ్యూనిటీ భవనాలకు సుమారు 75 లక్షల నిధులతో భూమిపూజ చేసుకున్నాము. జోడువాగులు వద్ద మన ఎంపీ వంశీ కృష్ణ ఫోలో అప్ చేసి పనులకు 100 కోట్ల నిధులు శాంక్షన్ చేసుకున్నారుటెండర్ ప్రక్రియ జరుగుతుంది త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయి. చెన్నూరు డిపో చెన్నూరు ప్రజల చిరకాల వాంఛా.. డిపో పనులు గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో ఆగిపోయింది. నేను వచ్చాక ఆ పనులను ప్రారంభించడానికి ప్రయత్నాలు చేస్తున్నాను త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయి. 100 పడకల ఆసుపత్రి భవనాన్ని ఈ నెలలో ప్రారంభం చేసుకోవడం జరుగుతుంది. ఇప్పటికే 23 మంది డాక్టర్లు మనకు రావడం జరిగింది వచ్చే సంవత్సరంలో పుష్కరాల్లో భాగంగా సుమారు డెబ్భై కోట్ల రూపాయల నిధులతో పనులు ప్రారంభం అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిర్దయగా గొంతు కోసి చంపేశాడు

నెన్నెల హత్య కేసులో నిందితుడు రిమాండ్‌కు!

ప్రజా వాయిస్ /మంచిర్యాల క్రైమ్

మంచిర్యాల జిల్లా నెన్నెల్ మండలంలో భార్యపై అనుమానంతో తరచూ వేధింపులకు గురిచేస్తూ, చివరకు ఆమె ప్రాణాలనే తీసిన భర్తను నెన్నెల పోలీసులు అరెస్ట్ చేశారు. నెన్నెల పోలీస్ స్టేషన్ పరిధిలో సెప్టెంబర్ 2న జరిగిన మహిళ హత్య కేసులో నిందితుడు తోట మల్లేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని న్యాయస్థానం ఎదుట హాజరుపరిచారు. ఈ ఘటనలో మృతురాలు తోట సబిత (38) నిందితుడు మల్లేష్ అని బెల్లంపల్లి రూరల్ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్. హనూక్ తెలిపారు. గత కొంతకాలంగా భార్యపై అనుమానంతో మల్లేష్ ఆమెను తరచూ వేధిస్తూ గొడవలకు దిగేవాడని పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. గతంలో కూడా ఆమెపై దాడి చేసి హత్య చేసేందుకు ప్రయత్నించినట్లు విచారణలో తెలిసినట్లు పోలీసులు పేర్కొన్నారు. సెప్టెంబర్ 2న మధ్యాహ్నం భార్యా భర్తల మధ్య మరోసారి తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో ఆగ్రహానికి గురైన మల్లేష్ తన భార్య సబిత గొంతు నులిమి, అనంతరం ఇంట్లో లభించిన పదునైన వస్తువుతో ఆమె గొంతుపై దాడి చేసి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. హత్య అనంతరం రక్తపు మరకలు ఉన్న దుస్తులను ఇంట్లోనే వదిలివేసి, దుస్తులు మార్చుకుని నిందితుడు పరారైనట్లు పోలీసులు వెల్లడించారు. అతడి కోసం నెన్నెల పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. నమ్మదగిన సమాచారం మేరకు సెప్టెంబర్ 4 సాయంత్రం తాళ్లగురజాల వై-జంక్షన్ వద్ద నిందితుడు మల్లేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతడిని అరెస్ట్ చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా, న్యాయస్థానం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ హనూక్ తెలిపారు. నిందితుడి అరెస్టులో కీలక పాత్ర పోషించిన పోలీసు సిబ్బందిని ఏసీపీ కిరణ్ కుమార్, సీఐ సి.హెచ్. హనూక్ అభినందించి ప్రశంసించారు.

ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన ఆర్డీవో

అభ్యంతరాల స్వీకరణపై ఆరా

పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచన

ప్రజా వాయిస్,వేములపల్లి:

ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా చేపట్టిన క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ కార్యక్రమాన్ని మిర్యాలగూడ ఆర్డీవో రమణారెడ్డి శనివారం పరిశీలించారు. వేములపల్లి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో కొనసాగుతున్న ప్రక్రియను ఆయన పరిశీలించి, ఓటర్ల నుంచి స్వీకరిస్తున్న దరఖాస్తులు, అభ్యంతరాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే స్వీకరించిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను నిర్ణీత గడువులోగా క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు.కార్యక్రమంలో తహసీల్దార్ హేమలత, సర్పంచ్ పుట్టల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయుల దినోత్సవం

గురువులే సమాజానికి మార్గదర్శకులు..

సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు ఘన నివాళి

ప్రజా వాయిస్,చిలుకూరు:

సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలంలోని బేతవోలు జిల్లా పరిషత్, ప్రైవేట్ పాఠశాలల్లో భారత మాజీ రాష్ట్రపతి, తత్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తూ, సమాజ నిర్మాణంలో గురువులు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. విద్యార్థుల్లో విజ్ఞానంతో పాటు క్రమశిక్షణ, విలువలు, నైతికతను పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదన్నారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మూడు దశాబ్దాల అక్షర సేవకు అవార్డు

చిలుకూరు తెలుగు ఉపాధ్యాయురాలు డా. పి.

సజ్జనకుమారికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలి పురస్కారం

కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందజేత

ప్రజా వాయిస్,చిలుకూరు

విద్యాబోధనను వృత్తిగా కాకుండా బాధ్యతగా భావిస్తూ మూడు దశాబ్దాలుగా విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్న చిలుకూరు మండల కేంద్రంలోని పీఎం జడ్‌పీహెచ్ఎస్ తెలుగు ఉపాధ్యాయురాలు డా. పి. సజ్జనకుమారికి అరుదైన గౌరవం దక్కింది. సూర్యాపేట జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఆమె ఎంపికై, జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.గత 30 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్న సజ్జనకుమారి వేలాది మంది విద్యార్థులకు తెలుగు భాషతోపాటు విద్యాబుద్ధులు, క్రమశిక్షణ, నైతిక విలువలు, సంస్కారం వంటి అంశాలను బోధిస్తూ తనదైన ముద్ర వేశారు. విద్యార్థుల్లో తెలుగు భాషపై అభిమానం పెంపొందించేందుకు ఆమె చేసిన కృషి ప్రత్యేకంగా నిలిచింది.తరగతి గదికే పరిమితం కాకుండా విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడుతూ, వారి భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసిన ఆమె సేవలను గుర్తించి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక చేయడం పట్ల సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. సజ్జనకుమారికి అభినందనలు తెలిపారు.